అందుకని ఆకలి నెపంతో అన్నం కోసం కంగారు పెట్టి ఆ స్త్రీకి తన దర్శనం, ఆలింగన భాగ్యం కలుగ జేసారు.

కొత్తపేటలో కొంతమంది బాబా కారును ఆపివేసారు. కొబ్బరి కాయలు సిద్ధంగా ఉన్నాయి, కొబ్బరినీరు త్రాగమని అన్నారు. బాబా నేరుగా అమలాపురం వెళ్దామనుకుంటే కొత్తపేటలో ఆపడం, కొబ్బరినీళ్ళ గురించి చెప్పటం బాబాకు యిష్టం కాలేదు. ఈలోగా బస్సులో వస్తున్న మండలి వారు 'బాబా త్రాగమన్నార'ని చెప్పడంతో కొబ్బరి నీళ్ళు త్రాగడం ప్రారంభించారు. ఆందరూ 4 కొబ్బరి కాయల నీళ్ళు త్రాగాలని బాబా ఆజ్ఞాపించారు. వెంటనే మళ్ళీ అమలాపురానికి ప్రయాణ మయ్యారు. దారిలో కారు నడుపుతున్న ధర్మారావుగారికి కునుకువచ్చి కారు అదుపు తప్పి ప్రక్కనున్న రాళ్ళ గుట్టపై రెండు చక్రాలు ఎక్కాయి. బాబా తన చేతితో స్టీరింగ్ త్రిప్పారు. లేకపోతే ఒక్క క్షణంలో కారు ప్రక్కనున్న కాలువలో పడిపోయి ఉండేది. తృటిలో తప్పిన ప్రమాదానికి కారులోని వారికి ఒళ్ళు జలదరిస్తే బాబా మాత్రం హుందాగా కూర్చున్నారు. మధ్యాహ్నం గం.12.30లకు అమలాపురం చేరుకున్నారు. బాబాకు మండలి వారికి ఆల్ ఇండియా కాంగ్రెస్ మాజీ జనరల్ సెక్రటరీ కళా వెంకట్రావ్ అన్ని ఏర్పాట్లు చేసారు. బాబా ఎక్కడికి వెళ్ళినా వెంటనే ఉండి బాబాకు కావలసివన్నీ స్వయంగా సమకూర్చాడు కళా వెంకట్రావ్.

'మంచితనమంటే స్వార్ధ చింతన లేక పోవడం, నిస్వార్థంగా తోటి వారికి సేవ చేస్తే భగవంతుని సేవించినట్లే. నిస్వార్థ సేవ అంటే సేవ చేసాననే ఆలోచన కూడా రాకుండా ఉండటం' అని బాబా చెప్పారు. సాయంత్రం అమలాపురం బోర్డ్ హైస్కూల్ ఆవరణలో ప్రజాదర్శనం యిచ్చారు. దాదాపు 7000 మంది దర్శనార్థులకు బాబా ప్రసాదం పంచి పెట్టారు. మరునాడు 01.03.54 రోజున ఉదయం కొంత మంది ప్రేమికుల యిళ్ళకు బాబా వెళ్ళారు. తర్వాత రాజోలుకు ప్రయాణమై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిట్లో ప్రజాదర్శనం యిచ్చారు. రాజోలు నుండి కొత్తపేటకు వెళ్ళే దారిలో ఒక కొబ్బరి తోటలోకి వెళ్ళి అందరినీ పిలిచి 'ఆ స్థలం రామావతరంలో తను చేసిన పనికి సంబంధం కలిగియుంద'ని చెప్పారు.

అందుకే కాబోలు బాబా ఆంధ్ర దేశంలో విరివిగా పర్యటించారు. దేశంలో అన్ని రాష్ట్రాలలో కంటె ఆంధ్ర రాష్ట్రంలోనే ఎక్కువ మంది బాబా ప్రేమికులున్నారు. ఒంటి గంటకు జిల్లా బోర్డు ఉన్నత పాఠశాలలో ప్రజాదర్శనమిచ్చారు. బాబా అడిగి పుకార్‌తో పాట పాడించుకొని 'ఫనా, బకా' అనే స్థితుల గురించి ప్రవచన మిచ్చారు. దాని సారాంశం ఇలా చెప్పారు.

'ఆత్మ పరమాత్మ వద్దకు పయనించినప్పుడు నాలుగు స్థితుల అనుభూతి కలుగుతుంది. మొదటి ప్రయాణం ఫనాలో రెండు స్థితులు. రెండవ ప్రయాణం బకాలో రెండు స్థితులుంటాయి. మూడవ ప్రయాణం కేవలం సద్గురువులకు మాత్రమే అనుభూతిలోకి వస్తుంది. అది కుతూబియత్ అనేది. నాలుగవది శరీరం త్యజించడంతో ముగిసే ప్రయాణం. మొదటి ప్రయాణం అహం బ్రహ్మాస్మి. నేను భగవంతుడ ననే అనుభూతితో అంతమౌతుంది. రెండవ ప్రయాణం భగవంతునిలో నిజంగా ఉండడమే. మూడవది మానవ శరీరంలో భగవంతుని జీవితం జీవించడం. మరియు నాల్గవది మానవ శరీరాన్ని త్యాగం చెయ్యడం, శరీరాన్ని వదిలిన తర్వాత కూడా అనంత అస్తిత్వానుభవం శాశ్వతంగా ఎరుకతో ఉండిపోతుంది'.

కె.డి.ఆర్.ఎమ్. ప్రేమికులు రాజోలు నుండి కొత్తపేటకు ప్రయాణించే జీపు ప్రమాదానికి గురియై గోతిలో పడిపోయింది. అదృష్టవశాత్తు స్వల్ప గాయాలతో అందరూ ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు. బాబా చేసిన అద్భుతం వల్లనే బ్రతికి బయట పడ్డామని వారు బాబాకు చెప్పగా బాబా తాను ఏ అద్భుతమూ చేయలేదని ఆ వార్త తానిప్పుడే వింటున్నానని చెప్పారు. అలాంటి అద్భుతాలు తనకు ఆంట గట్టరాదని బాబా పలుమార్లు చెప్పారు. ప్రేమికులకు తన యెడల గల ప్రేమ విశ్వాసాల శక్తి వల్ల అలాంటి వెన్నో జరుగుతాయని తనకు ప్రత్యక్షంగా అలాంటి చిన్న విషయాలు అంట గట్టరాదని అందరి హృదయాలను భౌతికం నుండి పరమార్థం వైపు మరల్చి ప్రేమమయమైన నవమానవాళిని సృష్టించడమే తన ప్రస్తుత అవతారంలో చేయబూనిన ఒకేఒక అద్భుతమని అది తన మౌనవిరమణపై ఆధారపడి యున్నదని పలుమార్లు చెప్పారు.

కొత్తపేటలో నేషనల్ క్లబ్బులో ఏర్పాటు చేసిన ప్రజాదర్శన కార్యక్రమంలో దర్శనమిచ్చి ప్రసాదం పంచిపెట్టారు. దాదాపు 4000 మంది ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం రాజమండ్రికి చేరుకొని గురుకులంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల ప్రత్యేక సమావేశాన్ని 01.03.54 రాత్రి 9 గంటల నుండి నిర్వహించారు. బాబా తన స్వహస్తాలతో అందరికీ కాఫీ యిచ్చారు. అది చాలా ముఖ్యమైనదని బాబా చెప్పారు. సమావేశాన్ని ప్రారంభిస్తూ బాబా యిలా చెప్పారు.

'మీరు నాకు సమర్పించిన సన్మాన పత్రాలు, ఈ సమావేశాలు, కార్యక్రమాలు, నా సందేశాలు, ఉపన్యాసాలు ఆధ్యాత్మిక మార్గంలో ఏ ప్రయోజనం చేకూర్చవు. అలాగే నాకు హారతులివ్వడం, పూజలు చేయడం, పూల మాలలు వేయడం, ప్రణామాలు చెయ్యడం, పళ్ళు, మిఠాయిలు సమర్పించడంలో కూడా ప్రయోజనమేదీ ఉండదు. మీరు నాపై చేసే ఖర్చు, పడే శ్రమ వృధా. నాకు కావల్సింది నిష్కళంకమైన ప్రేమ. అనాది నుండి దేవతలు నాకు పూజ చేస్తూనే ఉన్నారు. నా కార్యకర్తల నుండి నిజమైన పనిని ఆశిస్తున్నాను' అని చెప్పారు. బాబా తన పనియంటే ఏమిటో ఆ రోజున విపులంగా చెప్పారు. దాని సారాంశం యిలా ఉంది –

1. నేను అవతారుడనైతే నా పని నేనే చేసుకుంటాను. మౌనంగానే నా విశ్వ కార్యాన్ని నేనే చేసుకోగలను. ప్రపంచమంతా నాకు ఎదురు తిరిగినా నన్ను ఆరాధించినా నాకు ఒక్కటే. నా పనిలో పాల్గొనడం, నేను మీకు యిచ్చే అవకాశం మాత్రమే.

2. మీరు సిద్ధంగా ఉంటే నా పని నూటికి నూరు పాళ్ళు నిజాయితితో చేయాలి. మీరు బాబా దేవుడనుకుంటే అలా చెప్పండి, సంకోచించకండి. బాబా దయ్యం అనుకుంటే అలాగే చెప్పండి. భయపడకండి. మీరు నన్ను ఏదిగా తలుస్తే నేను అదే అవుతాను. మీ అంతరంగానికి విరుద్ధంగా చెప్పకండి మరి అతిశయోక్తిగా చెప్పకండి. నేను అన్నిటికీ అతీతుడను.

3. నా కోసం పని చేసే వారు ఏపని చేసినా నా నుండి గాని ఇతరుల నుండి గాని మెప్పు నాశించ రాదు. ప్రతిఫలం కోరరాదు. పని చేయడమే దాని మెప్పు. ఇది ఎంత సులభమో ఆచరణలో పెట్టడమంత అసాధ్యము. మెప్పు పొందాలనే ఆలోచన రాగానే చేసే పని నిష్ప్రయోజన మవుతుంది.

4. నీ శక్తి ననుసరించి ఎంత చేయగలిగితే అంత చేయి. అది నిజాయితీగా చేయి. కార్యకర్త ఎప్పుడైతే నా పని కోసం ఇతరులపైన గాని ఇతర విషయాలపైన గాని ఆధారపడతాడో నాపని చేసినా చెయ్యనట్లే అవుతుంది.

5. నా పేరుతో నా పని కోసం వసూలు చేసిన డబ్బు సరిగా లెక్క వ్రాయకుండా ఖర్చు చేస్తే కార్యకర్తలు వెంటనే దైవకార్యం కోసం తలపెట్టిన ఆ పనిని నిలిపి వేయాలి. సరియైన అవసరం లేకుండా నా పేరుతో ఒక్క పైసా వసూలు చేసినా అది అవినీతికరమే. ఆ వ్యక్తి కది అనేక జన్మాలకు కారణభూతమౌతుంది.

6. మీరు ప్రచారం మాత్రం చేస్తుంటే అది అక్కర్లేదు. అసత్యంగా వెల్లడి చేసే ప్రచారం అసలే వద్దు. నాకు కావలసింది ప్రేమ, నిజాయితీ తనం. ప్రచారమనే మాట నన్ను కించ పరుస్తుంది.

7. మీరు కొంచమైనా నన్ను ప్రేమిస్తుంటే మీ హృదయాలు ఒండొరుల యెడల పరిశుద్ధంగా ఉంచుకోవాలి. గతంలోని విభేదాలు మర్చిపోవాలి. మీ హృదయం శుభ్రం చేసుకోండి.

8. బాబాను నిజంగా మీరు ప్రేమిస్తుంటే బాబా కోసం జీవించండి.

9. ఇతరులు నన్ను ప్రేమించేలా మీరు చేయాలంటే మొదట మీరు నన్ను నిజంగా ప్రేమిస్తున్నారని అభిప్రాయం వారికి కలిగేలా నడుచుకోండి. ఊరికే వారికి మాటలు చెప్పి నా పుస్తకాలు, నా సందేశాలు చదివేలా చేయవద్దు. మీరు నా కోసం త్యాగయుత జీవితాన్ని గడిపి తద్వారా ఇతరులు నన్ను ప్రేమించేలా చెయ్యండి.

10. నన్ను ప్రేమించే వారి ప్రేమకు నేను బానిసను. అయినా నేను ప్రేమించ బడవలసినట్లుగా నన్ను ప్రేమించే వాడొక్కడైనా నాకు కనిపించడం లేదు. ప్రాక్పశ్చిమ దేశాల్లో 220 మంది నాకు సర్వ సమర్పణమై నేను ఏది చెప్పితే అది చేసే స్త్రీ పురుషులున్నారు. ఉదా : ఈరుచ్, పెండు, మెహెర్‌జీ మొదలగు వారు. నేను ఆజ్ఞాపిస్తే వారు నాకోసం ప్రాణాలు కూడా ధార పోస్తారు.

బాబా కె.డి.ఆర్.ఎమ్‌ను, సెంటర్లను నిలిపివేశానని ప్రతి ఒక్కరు ఎవరికి వారే సెంటర్ కాగలరని చెప్పారు. ఆంధ్రులు చూపించిన ప్రేమ తనను కదిలించిందని చెప్పి బాబా అందరిలో గల తప్పులను, బలహీనతలను క్షమించమని కోరుతూ అందరి తరపున క్షమాపణ పొందుతూ భగవంతుని ముందు అందరి తప్పులను ఒప్పుకొని పశ్చాత్తాప ప్రార్థన చేయించారు. అందరి తప్పులు ఆ రాత్రి క్షమించబడతాయని, ఆ తరువాత చేసే ఎవరి తప్పులకు వారిదే బాధ్యత అని బాబా చెప్పారు.

'నన్ను హృదయపూర్వకంగా ప్రేమించండి. అదొక్కటే నాకు కావలసింది. నన్ను ప్రేమించండి, నన్ను ప్రేమించండి, నన్ను ప్రేమించండి. అప్పుడు నన్ను మీరు చూడగలరు. నన్ను ప్రేమించేవారే ఆంధ్రలో నా సెంటర్లు' అని చెప్పి రెండవ మారు పశ్చాత్తాప ప్రార్థన చదివించి 02.03.54 ఉదయం గం. 2.35 ని.లకు సమావేశం ముగించారు. బాబా అనుమతితో అందరూ 3 గంటల నుండి విశ్రాంతి తీసుకున్నారు.

రాజమండ్రి గురుకుల పాఠశాలలో బాబాకు మండలికి కావలసిన ఏర్పాట్లన్నీ గురుకుల నిర్వహణాధికారి బుల్లెయ్యగారు సమకూర్చారు. 02.03.54 ఉదయం బాబా రాజమండ్రిలోని బాబా ప్రేమికుల యిళ్ళకు (ధర్మారావు మొదలైన వారి యిళ్ళకు) వెళ్ళారు. మధ్యాహ్నం రాజమండ్రి నుండి ఆలమూరు వెళ్ళారు. రాజమండ్రి నుండి బయలుదేరే ముందు బాబా ఈ సందేశం యిచ్చారు.

'ఎందరో అన్వేషించినా, కొందరికే లభ్యమగు వాడను నేనే. ఎంతటి

బుద్ధిమంతుడయినా నా లోతు తెలుసుకోలేడు. ఎంతటి తపస్వి అయినా నన్ను పొందలేడు. ఎవరైనా నన్ను ప్రేమించినప్పుడే నన్ను పొందగలరు. భగవంతుని అనంత గుణములలో మంచితనము ఒకటి. మంచి చేస్తే నాకు సన్నిహితుడవవుతావు. అందుచేత మంచి చేయి గాని ఎంత మాత్రము మెప్పుదల కోరకుండా చేయి'.

బాబా తాపేశ్వరం వెళ్ళే ముందు రాజమండ్రి దివ్య జీవన సమాజం వారి భవనంలో దర్శనం యిచ్చారు. ఆ సందర్భంగా ఈ సందేశం యిచ్చారు.

'ఎవరైతే నన్ను ప్రేమించి నాలో తన స్వార్థాన్ని పోగొట్టుకుంటారో వారు నన్ను పొందుతారు. ఆ ప్రేమ ఎంత నిజాయితీగా ఉండాలంటే అతనికి నా యెడల గల ప్రేమ ఇతరులకు తెలియకుండా ఉండటమే గాక స్వయంగా అతనికి కూడా తెలియకుండా ఉండాలి. ఒక వ్యక్తి బాబా ఆశీర్వాదం కోరగా నా ఆశీర్వాదం నేనిచ్చే ప్రసాదంలో ఉంది. ప్రేమతో దానిని స్వీకరిస్తే అది హృదయాంతరాళాలలోకి చేరుతుంది. ప్రేమలేని సందేశాలన్నీ నిరర్థకాలే'.

ఆలమూరులో నిర్మాణంలో ఉన్న ఒక సినిమా హాలులో దర్శన కార్యక్రమం ఏర్పాటు చేసారు. దాదాపు 1000 మందికి బాబా దర్శనం యిచ్చి ప్రసాదం పంచిపెట్టారు. ఆలమూరు నుండి బాబా మండపేట వెళ్ళారు. అక్కడి నుండి రామచంద్రాపురం వెళ్ళి దర్శనం యిచ్చారు. సాయంత్రం 7 గంటలకు కాకినాడ చేరుకున్నారు. కాకినాడలో బాబా బస శ్రీ వై.వి. నరసింహారావు జమీందార్ తోటలోని బంగళాలో ఏర్పాటు చేసారు. ఆ దగ్గరలోనే ఉన్న ముత్తా మాణిక్యం బంగళాలో మండలి వారికి బస ఏర్పాటు చేసారు.

03.02.54 రోజు ఉదయం తోటలో సమావేశమైన వారికి బాబా దర్శనం యిచ్చి తర్వాత వి.వి. నారాయణ రావు, ఏడిద సత్తిరాజు మొదలగు ప్రేమికుల యిండ్లకు వెళ్ళారు. హెచ్. సాంబ మూర్తి, జిల్లా కలెక్టర్ గారింటికి కూడా వెళ్ళారు. కలెక్టర్ గారి భార్య చాలా మంది స్త్రీ పురుషులను సమావేశ పరచి బాబాకు వారిని పరిచయం చేసింది. సాయంత్రం మలాడి సత్యలింగ నాయికర్ ఉన్నత పాఠశాలలో

ఏర్పాటుచేసిన ప్రజా దర్శన కార్యక్రమంలో 4000 మందికి దర్శన మిచ్చారు. బాబా అన్నపూర్ణయ్య, తిరుమల రావు, సుబ్బారావు మొదలగు 17 మంది ప్రేమికుల ఇళ్ళకు వెళ్ళారు. శివ భక్తులైన జి. వెంకట సుబ్బారావు యింటి ముందు చేతిలో బాబాకు సమర్పించడానికి తెచ్చిన కానుకతో నిలబడి యుండగా బాబాను శివుడుగా దర్శించుకొని ధన్యుడైనాడు. ఈ సందర్భంగా బోనాల వెంకటేశ్వర్లు బాబా దర్శనం చేసుకొని ఆయన దివ్యత్వంతో ఆకర్షింపబడ్డాడు. ఆ తర్వాత ఆంధ్ర కేంద్రం కార్యదర్శిగా బాబా సేవ చేసాడు. కాస్మో పాలిటన్ క్లబ్బుకు సాయంత్రం 3 గంటలకు వెళ్ళారు. ఆ సందర్భంగా ఈ సందేశం యిచ్చారు.

'భగవంతుని పరిస్థితిలో లింగ భేదం లేదు అక్కడ ఒకే అవిభాజ్యమైన అస్తిత్వం ఉంది. ఈ మాయా ప్రపంచంలోనే స్త్రీయని, పురుషుడని తేడాలున్నాయి'.

బాలయోగులకు బాబా తన ప్రేమాశీస్సులను తెలియజేసారు. బాబా అసలైన యోగులు, బాహ్యాడంబరాన్ని ప్రదర్శించే యోగుల గురించి యోగ సమాధి మరియు నిర్వికల్ప సమాధి గురించి చెప్పారు. యోగ సమాధి 'హాల్' (సూఫీ భాషలో) అభ్యాసం ద్వారా సిద్ధిస్తుందని ఆ సమాధిలో ఉన్నంత కాలం నిద్రాహారాలు బాధించవని ఆ సమాధి స్థితిలో నుండి బయటకు రాగానే మళ్ళీ శరీరావసరాలు అవసరమవుతాయని, నిర్వికల్ప సమాధి అంటే దైవత్వానుభూతి పొందడం అంటే భగవంతుడుగా అవడం, అది శాశ్వతంగా నిరంతరాయంగా ఉండిపోతుంది. మెరిసే దంతా బంగారం కాదని చెబుతూ బాబా యిలా చెప్పారు 'మెహెరాబాద్ పిచ్చి ఆశ్రమంలో 'ఫకీరు బువా' అనే పిచ్చివాడుండేవాడు. పిన్న వయస్సులో తల మీద ఎవరో కొట్టగా ఏర్పడిన గాయం వల్ల అతడు పిచ్చివాడై పోయాడు. పిచ్చి ఆశ్రమం మూసివేసిన తర్వాత అతనిని పూనాకు పంపించారు. బాబా అతనికి ఆధ్యాత్మికాధికారం యిచ్చారని ఎవరో పుకారు పుట్టించారు. ఫలితంగా ఫకీర్ బువాని జగద్గురువుగా మజ్జూబ్‌గా చూడడం ప్రారంభించారు. అతనికి శిష్యులు దర్శనార్థులు పెరిగారు. అతని కోసం డబ్బు ఖర్చుచేసే వారి సంఖ్య కూడా పెరిగింది. కాని అతడు ఒక పిచ్చివాడు మాత్రమే.

బాబా సద్గురువు, అవతారుడు. యిద్దరి స్థితుల గురించి ప్రసంగించారు. వి.వి. నారాయణ రావు అడిగిన ప్రశ్నకు సమాధానంగా బాబా నిరంతరం తనతో సంబంధముంచుకోవడ మెలా అనే విషయంపై ఇలా చెప్పారు.

'మీకు నిరంతరం ఆకలిగా ఉంటుందా? మీకు ఆకలి వేసినప్పుడు అన్నం తింటారు. దాని మాట తర్వాత మర్చిపోతారు. మీరు కష్టపడి పనిచేస్తే మళ్ళీ ఆకలి వేస్తుంది. నా కోసం మీరు ఎలా పనిచేయాలంటే మీరు నా కోసం ఎప్పుడూ ఆకలిగా ఉండేటట్లు – కాని అప్పుడప్పుడు నన్ను తలచుకోవడం, కొన్ని సమయాల్లో నా కోసం పని చేయడం, ఒక్కొక్కప్పుడు నా గురించి మాట్లాడం – అది ఎడ తెరిపి లేకుండా కాదు – అదే పనిగా అస్తమానం తింటుంటే అజీర్ణం చేస్తుంది కదా! – మీరు పడుకునే ముందు ఈ రోజంతా చేసినది – మంచి, చెడ్డా బాబాకు అప్పజెప్పుతున్నానని – లేవగానే చేయబోయేదంతా బాబా పరం చేస్తున్నట్లు రోజుకు రెండు సార్లు కేవలం ఐదు నిమిషాలు మాత్రం యిచ్చి నీవు చేసిన దానికి నన్ను (బాబాను) బాధ్యుణ్ణి చెయ్యి. ఇలా హృదయ పూర్వకంగా చేస్తే మీరు స్వేచ్ఛగా ఉండవచ్చు. ఏదీ నిన్ను బంధించదు కాని అది నీవు నిజాయితీగా చెయ్యాలి. (మొక్కుబడిగా కాదు) నేను సముద్రుడను, పువ్వులు కొబ్బరి కాయలు అంగీకరిస్తాను. చెత్తను కూడా అంగీకరిస్తాను. అందుచేత హృదయపూర్వకంగా అన్నీ ఈ సముద్రంలో (బాబాలో) పడవేయండి. చిత్త శుద్ధితో చేయక పోతే అది మీదైన చిన్న గుంటలో పడి ఆ నీటిని కలుషితం చేస్తుంది'.

స్వామి సత్య ప్రకాష్ మరియు బులుసు సాంబమూర్తి బాబా దర్శనం చేసుకున్నారు. బులుసు సాంబమూర్తి బాబా స్పర్శతో పులకితుడయ్యాడు. 04.03.54 తేదీన సామర్లకోటలో పూనా ప్యాసింజర్‌లో ఎక్కి బాబా మండలి వారితో తిరుగు ప్రయాణమయ్యారు. రాజమండ్రి స్టేషన్‌లో బాబా మాణిక్యాల రావును పిలిచి 'ఆ రైలు కంటె ముందు విజయవాడకు వెళ్ళగలవా' అని అడిగారు. 'అలాగయితే విజయవాడకు ముందుగా వెళ్ళి మద్రాసు నుండి వచ్చిన సంపతయ్యంగారి కుటుంబ సభ్యులు ముందుగా తన దర్శనం చేసుకోవాలని

తరువాతనే మిగిలి వారంతా ప్లాట్‌ఫారంపైన తన దర్శనం చేసుకోవాలని అందరికీ చెప్పవసింది'గా ఆజ్ఞాపించారు బాబా. కాని అనుకోకుండా చాగల్లు స్టేషన్లో ప్యాసింజర్‌ను ఆపి మెయిల్‌ను పంపి వేసారు. ఇక మాణిక్యాల రావుకు విజయవాడకు ముందుగా చేరే అవకాశం లేక పోయింది. 'బాబా ఆజ్ఞ పాటించడమెలాగా' యని మాణిక్యాల రావు దిగులుగా కూర్చున్నాడు. విజయవాడ స్టేషన్ ఔటర్ సిగ్నల్ వద్ద ప్యాసింజర్ బండి ఆగిపోయింది. వెంటనే బండి దిగి రెండు ఫర్లాంగుల దూరం పరుగెత్తుకుంటూ ప్లాట్‌ఫారం వద్దకు వెళ్ళాడు మాణిక్యాల రావు. అక్కడికి వచ్చిన బాబా ప్రేమికులకు బాబా ఆదేశాన్ని వివరించి సంపతయ్యంగారి కుటుంబం వారు బాబాను అందరి కంటే ముందుగా దర్శించుకోవాలని చెప్పాడు. బాబా ఆదేశాన్ని పాలించగానే బాబా వస్తున్న ప్యాసింజర్ రైలు ప్లాట్‌ఫారం మీదకు వచ్చేసింది. మెయిల్ బండి తప్పిపోయిందని విచారిస్తున్న మాణిక్యాల రావుకు ఔటర్ సిగ్నల్ పద్ద బండి ఆగిపోవడం బాబా యిచ్చిన అవకాశం అయితే సంకోచించకుండా ఆ అవకాశాన్ని వినియోగించుకొని బాబా ఆజ్ఞను పాటించి మాణిక్యాల రావు ధన్యుడైనాడు. బాబా మాణిక్యాల రావును చూసి భేష్ అన్నట్లుగా మందహాసం చేసారు. అపార కరుణామయుడు కదా మెహెర్ బాబా!

సామర్లకోట నుండి విజయవాడ వరకు తిరుగుప్రయాణంలో ప్రతి స్టేషన్‌లో ప్రేమికులు అధిక సంఖ్యలో వచ్చి బాబా దర్శనం చేసుకొని దివ్య ప్రియతమునికి వీడ్కోలు చెప్పారు. ఈ పర్యటనలో బాబాతో సన్నిహితంగా ఉండి ఆయన సహవాస భాగ్యం పొందిన ప్రేమికులెందరో ఆయన ఎడబాటు సహించలేక విలపించారు. కొందరు ఏమీ తోచని స్థితిలో నిశ్చేష్టులై చూస్తూ ఉండిపోయారు. కొందరు 'అవతార్ మెహెర్ బాబా కీ జై' అని జయజయ ధ్వానాలు చేసారు. కొందరు వారి మనసుల్ని బాబాకిచ్చి చేతులు జోడించి మౌనమూర్తి వైపు చూస్తూ మౌనంగా నిలబడ్డారు. రైలులో రెండవ తరగతి పెట్టెలో తలుపు వద్ద నిలబడి బాబా విభిన్న తరహాలలో తనకు వీడ్కోలు చెప్పుతున్న ప్రేమికులను ప్రేమతో ఆశీర్వదించారు. రైలు బెజవాడ స్టేషన్ దాటి పూనా వైపు వెళ్ళిపోయింది.



ఆంధ్ర దేశ పర్యటన ముగించుకొన్న తర్వాత బాబా మహాబలేశ్వర్, సాకోరీ, కొల్హాపూర్, సతారాలకు వెళ్ళారు. మస్తుల సాంగత్యం చేసే కార్యక్రమాన్ని కూడా కొనసాగిస్తూ వచ్చారు. బాబా 19వ నెంబర్ నవజీవన ప్రకటన ద్వారా ప్రేమికులందరూ 10.07.54 తేదీ మౌనంగా ఉండి ఉపవాసం చేయాలని ఆదేశించారు. ఆ 24 గంటల కాలంలో మంచి ఆలోచనలు వచ్చేలాగ ప్రయత్నించాలని మూడు సార్లు టీ గాని, కాఫీగాని త్రాగవచ్చని సాధ్యమైనంత వరకు ఏదేని భగవన్నామాన్ని జపించాలని ఆదేశించారు.

12.09.54 ఆదివారం రోజు బాబా అహమద్‌నగర్‌లోని వాడియా పార్క్‌లో ప్రజాదర్శనం యిచ్చారు. ఆ ప్రజా దర్శనానికి బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేసారు. సాకోరీ నుండి గోదావరి మాయి కన్యలను తీసుకొని వచ్చింది. పండరిపూర్ నుండి గాడ్గే మహరాజ్ వచ్చారు. అసంఖ్యాకమైన ప్రజావాహిని బాబా దర్శనార్థం కదలివచ్చింది. దర్శనానికి ముందు ఏడుగురు పేదలకు కాళ్ళు కడిగి 'మీరందరూ ఏదో ఒక విధంగా భగవంతుని అవతారాలే గనుక మీకు నేను ప్రణమిల్లుతున్నాను. మీ పాదాల వద్ద నేనుంచిన దైవ దక్షిణ స్వీకరించండి' అని ప్రతి ఒక్కరికీ రూ. 51/- దైవదక్షిణగా యిచ్చారు. బాబా వేదిక ముందుకు వచ్చి వేదిక దిగి స్త్రీల వైపున మళ్ళీ పురుషుల





వైపున కూర్చుండి 'మానవుడు మానవునకు మ్రొక్కినట్లు గాక భగవంతుడే భగవంతునకు ప్రణమిల్లినట్లు నేను మీకు ప్రణమిల్లు తున్నాను' అని అందరికీ నమస్కారం చేసారు. బాబా దర్శనం ఇస్తూ కుడిచేతితో ప్రసాదం పంచి పెట్టారు. కుడిచెయ్యి నొప్పి పెట్టినందున ఎడమ చేతితో ఇచ్చారు. మండలి వారు చెప్పినా వినకుండా బాబా మధ్యహ్నం 3 గంటల వరకు ప్రసాదం పంచారు. దాదాపు 15000 మంది భోజనాలు చేసారు. బాబా స్వయంగా వారికి వడ్డించారు. ఆ తర్వాత కారు టాపుపై కూర్చుని అందరీకి దర్శనం యిచ్చారు. నిరంతరాయంగా ప్రవాహంలాగా వచ్చి బాబా దర్శనం చేసుకున్న దర్శనార్థులతో వాడియా పార్క్ క్రిక్కిరిసి పోయింది. ఆ దర్శన కార్యక్రమం మరువరానిది. 'భగవంతుని ప్రేమించుట యెట్లు?' అనే సందేశం మరియు 'మెహెర్ బాబా పిలుపు' అనే సందేశం వినిపించబడ్డాయి.

బాబా సెప్టెంబర్ 29, 30 తేదీలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికై వచ్చిన 20 మంది పాశ్చాత్య ప్రేమికులు కూడా ఈ దర్శన కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరు బాబా సహవాసంలో గడిపిన రోజులు చిరస్మరణీయంగా మిగిలి పోయాయి. ఆ రోజులలో బాబా ఎన్నో ప్రవచనాలను వారికి చెప్పారు.

## అంతిమ ప్రకటనము

సెప్టెంబర్ 29, 30 తేదీలలో మెహెరాబాద్‌లో ప్రత్యేక సమావేశము ఏర్పాటు చేసారు. 16 సంవత్సరములు అంతకు మించిన వయస్సు గల పురుషులను అనుమతించారు. సుమారు 900 మంది పాల్గొన్నారు. ఈ సమావేశంలోనే బాబా మహాప్రకటన చేసారు. 29.09.54 తేదీన బాబా అందరినీ ఆలింగనం చేసుకున్నారు. క్రితం రోజు పడిన వర్షం వల్ల చాల మంది ప్రేమికులకు ఇబ్బంది

కలిగింది. బాబా ఈ అసౌకర్యానికి తనలో తానే ప్రశ్నించుకోగా 'మామూలు తీర్థయాత్రలకు వెళ్ళే భక్తులే అనేక ఇబ్బందులను, కష్టాలను ఓర్చుకొని వెళుతుంటే సాక్షాత్తు అవతారుని సహవాసానికి వచ్చే ప్రేమికులకు అ మాత్రం అసౌకర్యం శిరోధార్యమే' అని సమాధానం ఇచ్చారు. 30.09.54 రోజున బాబా (ఫైనల్ డిక్లరేషన్) అంతిమ ప్రకటనను జెప్పి అందరికీ వినిపించారు. ఆ ప్రకటనకు ముందు బాబా ప్రేమికులందరినీ మెహెరాబాద్ కొండపైకి, తన సమాధి వద్దకు తీసుకొని వెళ్ళారు. తన ఆఖరి విశ్రాంతి స్థలమైన సమాధి మందిరాన్ని దర్శించమని అందరికీ చెప్పారు. తర్వాత దిగువ మెహెరాబాద్‌లో సమావేశ స్థలానికి వచ్చి వేదికపైన సోఫాలో కూర్చున్నారు. తన అవతారాగమనానికి కారణభూతులైన పంచ సద్గురువులను (షిరిడీ సాయిబాబా, ఉపాసనీ మహరాజ్, హజ్రత్ బాబాజాన్, తాజుద్దీన్ బాబా, నారాయణ మహరాజ్‌లను) స్మరించి వారు తనకు దివ్య చైతన్యాన్ని కలిగించడంలో నిర్వహించిన పాత్రను వివరించారు. సాకోరీ నుండి వచ్చిన



గోదావరి మాయి తదితరులను సభికులకు పరిచయం చేయించారు. గోదావరీ మాయి ఉపాసనీ మహరాజ్ తర్వాత సాకోరీ ఆశ్రమ ఆధిపత్యం వహించింది. ఆమెను బాబా తన తల్లి యశోదగా పేర్కొన్నారు. బాబా అంతిమ ప్రకటనలోని ముఖ్యాంశములు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

'ఇప్పుడు సావధానులై వినండి. నేను మాట్లాడుట, వ్రాయుట కూడా మానివేశాను. ఈ అక్షర ఫలకాన్ని కూడా ఉపయోగించుట మానివేస్తాను. అంతర్ముఖుడనై ఉంటున్నట్లుగా ఉంటాను. ఇన్నాళ్ళుగా పదేపదే వాగ్దానాలు చేస్తున్న నా మౌన విరమణ ఎట్టకేలకు చాలా దగ్గరగా వచ్చింది. నా అవతార జీవితంలో మూడుదశలు వ్యక్తమవుతాయి.

1. నా శరీరానికి వింతయైన ఒక వ్యాధి సోకుతుంది. అది నేను సూచిస్తూ వచ్చిన నా అవమానానికి కారణభూతమవుతుంది.

2. ఈ అవమానము నేను ఆకస్మికంగా చేయు మౌన విరమణలోను, ఆది శబ్దోచ్చారణము చేయుటతోను ముగిసిపోతుంది. ఆ ఆదినాదాన్ని కేవలం భగవంతుడు మాత్రమే ఉచ్చరించగలడు.

3. నా అవతార వైభవము అవమానము యొక్క స్థానము నాక్రమిస్తుంది. నాలో అణగియున్న అనంతత్వము బయటకు వచ్చి విశ్వమంతా వ్యాపిస్తుంది. నా వైభవము విశ్వమంతా అనుభూతి పొందుతారు కాని నా భౌతిక సమక్షంలో నున్న కొద్ది మంది మాత్రం నా వైభవానుభూతిని పొందరు. నేను వెన్నుపోటుకు గురి అవుతాను. ఆ సమయంలో నా మండలి వారు గాని, నా ప్రేమికులు గాని యెవ్వరూ నా చెంత నుండరు.

నేను నా మౌనం విరమించుటకు ముందుగాని మౌనం విడిచిన వెంటనే గాని ప్రపంచంలో నాలుగింట మూడు భాగాలు నశించిపోతాయి.' అని చెప్పారు. అంతిమ ప్రకటనను సరిగ్గా మధ్యాహ్నం మూడు గంటలకు ఈరుచ్ చదివి వినిపించారు. దాని అనువాదాన్ని మూడు ఇతర భాషల్లోను చదివి వినిపించారు.

ఈ అంతిమ ప్రకటన వలన ప్రేమికుల హృదయాల్లో కలిగిన భయాందోళన లుపశమింప జేయడానికి బాబా దానిని విశదీకరించి జరుగబోయే సంఘటనలు కొన్ని తన భాషలోను, మరికొన్ని మన భాషలోను మరికొన్ని ఉభయ భాషలలోను చెప్ప బడ్డాయని కేవలం తన భాషలో చెప్పినది ఎంత ప్రయత్నించినా మన అవగాహనకందనిదని, మన భాషలో చెప్పినది మాత్రమే అవగాహనకు వీలవుతుందని చెప్పారు. కేవలం సంఘటనలు జరిగిన తర్వాతనే బాబా భాషలో చెప్పిన సంఘటనల గురించి తెలుసుకొనగలమని చెప్పారు.

1. వింత వ్యాధి బాబా శరీరానికి సోకుట – (మన భాష)

2. దానిపర్యవసానంగా బాబాకు కలిగే అవమానం – (మన భాష)

3. మౌన విరమణ చేసి ఆది శబ్దాన్ని ఉచ్చరించుట – (బాబా భాషలో – ఏక కాలంలో మన భాషలో కూడా చెప్పబడింది ఎందుకంటే బాబా ఆ ఆది శబ్దాన్ని ఉచ్చరించినప్పుడు అది అందరికీ వినబడేలా ఉంటుంది.)

4. బాబా వైభవము (ఉభయ భాషల్లో)

5. ప్రపంచం నాలుగింట మూడు వంతులు నాశనమగుట – (కేవలం బాబా భాషలోనే)

6. బాబాకు వెన్నుపోటు సంభవించుట – (బాబా భాషలోనే)

7. బాబా భౌతిక శరీర త్యాగము – (ఉభయ భాషల్లో)

'విశ్వవాప్తంగా ప్రపంచం భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను యివ్వబడే (షాక్) ఊపును స్వీకరించుటకు సిద్ధమగు వరకు పై సంఘటనలు జరిగే క్రమంలో గాని జరుగ వలసిన కాల పరిమాణంలో గాని మార్పు జరుగవచ్చును' అని చెబుతూ 'కాల పరిమాణంలో మార్పు జరిగితే నేను భౌతిక శరీరం ద్వారా చేసే బాహ్య క్రియలతో సంబంధం తెగిపోతుంది' అన్నారు బాబా. 'నేను ప్రపంచానికి మరణించిన వానిలాగా మార్పు చేయబడిన కాలపరిమితి వరకు ఉండవలసి వస్తుంది' అని బాబా చెప్పారు.

అవతారాగమన ప్రయోజనాన్ని అందరికీ అందివ్వడం కోసం బాబా ఏర్పరచుకున్న తన దివ్య ప్రణాళిక ననుసరించి జరుగ వలసిన రీతిలో ఆ సంఘటనలు జరుగుతాయి. ప్రాపంచిక జీవితంలో నిమగ్నులై ఆధ్యాత్మికానుభవం లేశమైన లేని వారు బాబా జరుప తలపెట్టిన సంఘటనల గురించి అవి ఎప్పుడు ఎలా జరుగుతాయని చెప్పడానికి ప్రయత్నించడం కేవలం ఊహాజనితమే అవుతుంది. బాబా ఏర్పరచుకున్న ప్రణాళిక ప్రకారం అవి ఆయన నిర్ణయించుకున్న రీతిలో తగు సమయంలో జరుగుతాయన్నది మాత్రం నిర్వివాదాంశం.

## అక్షర ఫలకాన్ని విసర్జించుట

బాబా 10.07.25 తేదీన మౌనం ప్రారంభించగానే చెప్పదలుచుకున్న విషయాలను పలక, బలపం ఉపయోగించి వ్రాసి చూపించేవారు. 1927వ సంవత్సరంలో వ్రాయడం మానేసి అక్షర ఫలకం ద్వారా చెప్పేమాటలను చూపించడం ప్రారంభించారు. అంతిమ ప్రకటన రోజు సూచించినట్లుగా బాబా 07.10.54 తేదీ నుండి అక్షర ఫలకాన్ని కూడా వాడడం మానివేసి సంజ్ఞల ద్వారా మాట్లాడటం ప్రారంభించారు. ఆ రోజు దసరా. షిరిడీ సాయిబాబా నిర్యాణం చెందిన రోజు. రాముడు రావణ సంహారం చేసిన రోజు. ఆ సంజ్ఞలను మాటల రూపంలో వ్యక్తం చేయడం బాబాకు సన్నిహితుడైన మండలి సభ్యుడు ఈరుచ్‌కు కలిగిన భాగ్యం. ఆ పనిని అంత సమర్ధవంతంగా ఎలా నిర్వహించగలిగానో తనకే తెలియదని ఈరుచ్ చెప్తుతారు. పాశ్చాత్య ప్రేమికులలో ముఖ్యుడైన మాల్కమ్ స్లాష్ 07.10.54 రోజు న్యూయార్క్‌లో చనిపోయారు. అంత ప్రాముఖ్యమైన రోజున గతించిన మాల్కమ్ అదృష్టవంతుడని బాబా చెప్పారు. బాబా పనిని నిర్వర్తించి భారతదేశం నుండి వెళ్ళే ముందు బాబా ఆలింగనం పొందాడు. బాబా ఆజ్ఞ ప్రకారం ఆ రోజు మండలి వారు మధ్యాహ్నం ఒంటి గంట నుండి రాత్రి 12 గంటల వరకు ఉపవాసం చేసారు. సాయంత్రం మండలి వారికి ప్రణమిల్లుట ద్వారా తన పంచ సద్గురువులకు ప్రణమిల్లి తరువాత బాబా తనకు తానే ప్రణామం చేసుకున్నారు. కొంతసేపు ప్రశాంతంగా ఉన్న తర్వాత బాబా ముందుగానే చెప్పినట్లు ఈరుచ్‌తో ప్రార్ధనలు చదివించారు. సరిగా సాయంకాలం 7 గంటలకు బాబా అక్షర ఫలకాన్ని వదిలేసారు.

## పండరిపురి యాత్ర

గాడ్గే మహరాజు ఆహ్వానంపై బాబా 06.11.54 సాయంత్రం పండరి పురికి వెళ్ళారు. బాబాను మౌనం విరమించమని అడగకూడదని, 07.10.54 రోజున త్యజించిన అక్షర ఫలకం మళ్ళీ ఉపయోగించమని అడగకూడదని, భోజనం చేయమని గాని, విశ్రాంతి తీసుకోమని గాని కోరరాదనే షరతులు బాబా

విధించారు. ఆ రోజంతా ప్రేమికులతోను, భక్తులతోను గడుపుతానన్నారు బాబా.

పండరిపురం చంద్రభాగా నదీతీరాన ఉంది. కృష్ణభక్తులకిది పుణ్యక్షేత్రం. ఈ క్షేత్రంలోని కృష్ణుని విఠోబా అని, పాండురంగ విఠల్ అని పిలుస్తారు. విఠోబా ఆలయం ముందు ధర్మశాలలోని ఆరుబయట దర్శన కార్యక్రమం ఏర్పాటుచేసాడు గాడ్గే మహరాజు. బాబాకు ఉన్నతాసనం ఏర్పాటు చేసాడు. ఆరు బయట కూర్చున్న దర్శనార్థులందరికీ విఠోబాకు బదులు ఉన్నతాసనంపై కూర్చున్న మెహెర్ బాబాయే కనబడుతున్నాడు. గాడ్గే మహరాజు బాబా మెడలో పూలహారం వేసి బాబాకు ప్రణామం చేసాడు. మహరాష్ట్రలో గాడ్గే మహరాజును సత్పురుషుడని మిక్కిలి గౌరవిస్తారు. దర్శనార్థులందరితో 'దేవకీ నందన గోపాలా' అని పాడించాడు. 'అవతార్ మెహెర్ బాబా కీ జై' అని జయజయధ్వానాలు చేయించాడు. 'మెహెర్‌బాబా జగద్గురువని, ఆధ్యాత్మికంగా సేవ చేస్తున్నారని ఎందరో ఆయన దర్శనం కోసం వేలమైళ్ళ దూరం ప్రయాణం చేసి వెళ్తారని కాని ఈ రోజు ఆయన తన దర్శనం ఇవ్వడానికి పండరిపురికి రావడం వారి అదృష్టమ'ని జెప్పాడు. చంద్రభాగా నదీతీరాన భక్తులందరూ గాడ్గే మహరాజు భక్తిగీతాలను వినాలని సమావేశమయ్యారు. బాబాను ఆయన జగద్గురువుగా, రూపందాల్చి వచ్చిన విఠోబాగా అందరికీ పరిచయం చేసాడు. గీతాలాపనలతో, భక్తిపారవశ్యంతో జరిగిన ఆ రాత్రి కార్యక్రమంలో బాబా 12 గంటల వరకు పాల్గొన్నారు. ఉదయం మెహెరాబాద్‌కు తిరిగి వెళ్ళేముందు కుష్ఠురోగుల ఆశ్రమానికి వెళ్ళారు. అందరూ భిక్షాటనకు వెళ్ళారు. ఒక కుష్ఠువాడు మాత్రమే ధర్మశాలలో ఉన్నాడు. బాబా అతనికి వేడి నీళ్ళతో స్నానం చేయించి, అతనికి ప్రణమిల్లి, కొత్తబట్టలు బహూకరించారు. గాడ్గే మహరాజు 85 సంవత్సరముల వృద్ధుడు.'బాబా నాకు పని యొక్క శ్రమ ఎక్కువైంది. వృద్ధాప్యం వల్ల భరించలేక పోతున్నాను. నా శిరముపై మీ అమృత హస్తముంచి శ్రమ తొలగించండి' అని గాడ్గే మహరాజు బాబాను వేడుకున్నాడు. ఆ మాటల అంతరార్థం బాబాకు తప్ప మరెవ్వరికీ గోచరం కానిది. బాబా సహవాసం పొందిన గాడ్గే త్వరలో భౌతిక కాయం వదిలి బాబా వద్దకు చేరి శాశ్వతానందాన్ని పొందగలడని బాబా చెప్పారు.

1955 సంవత్సరంలో బాబా ఎక్కువగా సతారాలో ఏకాంతవాసంలోను, కొన్ని రోజులు పాక్షికంగా ఏకాంతవాసంలోను ఉన్నారు. ఈ సమయంలోనే ప్రేమికులకు అంతిమ ప్రకటన గురించి వివరణ మరియు నిర్ధారణ తెలియచేసారు. 24.04.55 తేదీన బాబా ఇచ్చిన సందేశం ఆయన హృదయాంతరాళాల నుండి వచ్చినది. అది అంతిమ ప్రకటన గురించిన ఆందోళన లను తొలగించి దానిని సరిగా అవగాహన చేసుకోవడానికి తోడ్పడుతుంది.

'నేను అన్ని వాగ్దానాలకు, బంధనాలకు, హామీలకు, ఏర్పాట్లకు అతీతుడను. అందుచేత ఎవ్వరూ ఏ సమయంలోగాని ఏ కారణంగానైనా నా నుండి ఎటువంటి భౌతిక, ఆధ్యాత్మిక లబ్ధిని పొందరాదు. సరియైన సమయంలో వ్యక్తిగతంగాను సామూహికంగాను అందరికీ అత్యంత లాభదాయకంగా ఉందని నా అలోచన ప్రకారం నాకు తోచినప్పుడు ఆ విధంగా నేను చేస్తాను'.

## మెహెరాబాద్ సహవాస్

07.11.55 తేదీ నుండి 03.12.55 తేదీ వరకు నాలుగు వారాలు మెహెరాబాద్‌లో బాబా తన ప్రేమికుల కోసం సహవాస కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. గత సంవత్సరాలలో బాబాయే స్వయంగా అన్ని చోట్లకు వెళ్ళి దర్శనాలిచ్చి ప్రసాదంతో పాటు తన ప్రేమను పంచారు. ఇక ఇప్పుడు ప్రేమికులను మెహెరాబాద్‌కు పిలిపించి తన సహవాసభాగ్యాన్ని కలుగజేసారు. భాషాపరంగా ఆయా భాషలవారికి ఒక వారం బాబాతో సహవాసం చేసే అవకాశం కల్పించబడింది. ప్రతి వారం వచ్చే ప్రేమికుల బృందంలో దాదాపు 200 మందికి ఏర్పాట్లు చేసారు. మొదటి వారం బృందంలో గుజరాతీ వారు, రెండవ వారం ఆంధ్రులు, మూడవ వారం హిందీ మాట్లాడేవారు, నాలుగవ వారం మహారాష్ట్రులు పాల్గొనాలని నిర్ణయించారు.

మొదటి బృందం 06.11.55 మధ్యాహ్నం మెహెరాబాద్‌కు చేరుకున్నారు. బాబా దర్బార్ హాలులో కూర్చుని ప్రేమికులను ఆహ్వానిస్తూ ఆలింగనం



చేసుకున్నారు. ఒక ప్రేమికుడు జలుబుతో బాధ పడుతూ వచ్చాడు. అతని ముక్కు కారుచు ఉన్నది. 'నీవు నన్ను కౌగిలించుకుంటే నీ జలుబు నాకు అంటుకోదా' అని బాబా అడిగారు. అతడు వెంటనే వెనక్కి వెళ్ళిపోయాడు. బాబా అతని ననునయిస్తూ 'రేపు నీ జలుబు తగ్గిపోతుంది, రేపు ఆలింగనం చేసుకోవచ్చు' అని చెప్పారు. సహవాసంలో బాబా ఎన్నో విషయాలు చెప్పారు. ప్రేమికులను కన్నతండ్రివలె చూసుకొని ప్రతి చిన్న విషయాన్ని అడిగి తెలుసుకొని వారి అవసరాలను, సమస్యలను తీర్చారు. ప్రేమికులతో కలిసి ఏడు పెంకులాట మొదలగు ఆటలాడారు. జబ్బుపడిన వారికి డా. నీలు, కనకదండి, పాద్రీలతో మందులు ఇప్పించారు. హాస్యోక్తులతో ప్రేమికులను అలరింప జేసారు. ఆలింగన మిచ్చి తన సమక్షంలో కూర్చుండబెట్టుకొని తన దివ్యప్రేమను పంచారు. వారి ప్రేమను స్వీకరించారు. సహవాసంలో పాల్గొన్న ప్రేమికులకు బాబా ఈ ఆదేశాలు, సందేశాలు ఇచ్చారు.

'అమూల్యమైన ఈ వారం రోజులు సహవాసంలో అంతా మరచిపోయి ఉండటానికి ప్రయత్నించండి. మిమ్మల్ని పిలిపించింది వేదాంత విషయాలపై దీర్ఘోపన్యాసాలు వినడానికి కాదు. మీ లోపాలు, బలహీలతలు, పరువు, ప్రతిష్ఠ, పదవి సమస్యలు, దేని గురించి ఆలోచించకండి. భౌతికంగా ఉన్నారు – మానసికంగా కూడా ఇక్కడే ఉండడానికి ప్రయత్నించండి. అప్పుడు మీ హృదయాలు తెరుచుకొని పరిశుద్ధంగా నేను ప్రవేశించడానికి వీలుగా ఉంటాయి. నా యెదుట చేతులు జోడించి యాంత్రికంగా నిలబడి మీ గృహ సమస్యల గురించి ఆలోచిస్తూంటే మీ చేతులు నాకు గాక మీ గృహ సమస్యలకే జోడించనట్లవుతుంది.

ఇక్కడికి వచ్చినందు వలన మీ సమస్యలు, కష్టాలు, తీరుతాయని తలచ వద్దు, మీ ఆరోగ్యం కోసం గాని, ఐశ్వర్యం కోసం గాని, నేను ఆశీర్వదిస్తానని ఆశించవద్దు. అలాంటి సమస్యలకు నా వద్ద పరిష్కారం లేదు. యోగులు, వలీలు, సాధువులు మహాత్ములు ప్రదర్శించి అద్భుతాలు చేస్తారు. నేను యోగిని, వలీని, సాధువును కాను! నాతో సహవాసం చేసిన దానికి ప్రతిఫలంగా అలాంటివి కలుగుతాయని మీరు ఆశిస్తే అలా కలుగక పోగా మీకున్నది కూడా పోతుంది.

మీరు నాకు ప్రణమిల్లడానికి, హారతులివ్వడానికి, మీతో పూజలు చేయించుకోవడానికి, నేను మీ మధ్యకు రాలేదు. ఇవన్నీ సాధువులకు, వలీలకు, యోగులకు మంచివే. నేను మీ నుండి అంతకంటే ఉన్నతమైనది ఆశిస్తున్నాను. మీ ప్రేమను స్వీకరించడానికి, నా ప్రేమను ప్రసాదించడానికి మీ స్థాయికి దిగి వచ్చాను. మీరు భగవంతుని ప్రేమించి, భగవంతుడవటానికి నా ప్రేమను మీకు ప్రసాదించడానికి వచ్చాను. తక్కినదంతా మిధ్య. నా ప్రేమను తప్ప యింక దేనినీ నా నుండి ఆశించకండి. నాకు పూల మాలలు వేయడం, నా పాదములకు ప్రణమిల్లడం, నన్ను కీర్తించడం, ఈ మూడు మిక్కిలి (అముఖ్యమైన) సారము లేని పనులు, భగవదనుభవం పొందే మార్గంలో మిక్కిలి ముఖ్యమైనవి ప్రేమ, విధేయత, సమర్పణ భావము (శరణాగతి) – వీటిలో రాజీ పద్ధతి ఏమీ లేదు.

ప్రేమ భగవంతుని నుండి మానవునకు ప్రాప్తించే వరప్రసాదం. విధేయత సద్గురువు నుండి శిష్యునకు లభించే కానుక. ప్రేమికుడు ప్రియతముని ఇచ్ఛానుసారం నడుచుకోవాలనుకుంటాడు. ప్రియతమునితో ఐక్యం కావాలనుకుంటాడు. ప్రియతముని ఇచ్ఛను పాలించడమే విధేయత. ప్రియతముని సంతోషమునే అభిలషించి ప్రియతముని ఇచ్ఛకు లోబడి యుండి నిరాసక్తుడై ఉండటమే సర్వ సమర్పణము (శరణాగతి)' అని బాబా వివరించి చెప్పారు.

విధేయత గురించి బాబా అయాజ్ కథ చెప్పారు. అయాజ్ ఒక సుల్తాన్ వద్ద బానిసగా ఉండేవాడు. రాజు ఈ బానిసపైనే మిగిలిన వారికంటే ఎక్కువ ప్రేమ

చూపించేవాడు. అందువల్ల అందరికీ అయాజ్‌పై అసూయ కలిగింది. ఒకనాడు నిండు కొలువులో సుల్తాన్ రెండు బరువైన రాళ్ళు పెట్టించాడు. ఒక దానిపై ధగధగ మెరిసిపోతున్న ఒక వజ్రాన్ని పెట్టించాడు. ఒక సామంత రాజును పిలచి రెండవ రాతితో మొదటి రాతిపై నుంచిన వజ్రాన్ని బ్రద్దలు కొట్టమని ఆజ్ఞాపించాడు. అతడు నిశ్చేష్టుడై 'రాజా! ఇదేమి విపరీతం, ఆ వజ్రం చాలా విలువైనది. దానిని నేను బ్రద్దలు కొట్టలేను' అన్నాడు. అలాగే రాజు గారు ఎందరినో పిలిచి వజ్రాన్ని బ్రద్దలు కొట్టమన్నారు. కాని ఎవరూ ఆ పని చెయ్యలేదు. చివరికి అయాజ్‌ను పిలిచి ఆజ్ఞాపించాడు. అయాజ్ క్షణంలో రాతితో ఆ వజ్రాన్ని బ్రద్దలు కొట్టి చూర్ణం చేసాడు. సభలోని వారందరూ హాహాకారాలు చేసారు. ఇంకా పరీక్షించడానికి రాజుగారు ఆయాజ్‌పై ఆగ్రహించి 'అలాంటి పని చేస్తావా, విలువైన ఆ వజ్రాన్ని చూర్ణం చేసావు' అన్నాడు. దానికి అయాజ్ 'అలాగయితే నాదే తప్పు – మీరేది చెప్పితే అదే నాకు శిరోధార్యం' అని బదులు చెప్పాడు అయాజ్. రాజుగారి ఆజ్ఞ ముందు ఆయాజ్‌కు వజ్రం విలువ ఏమీ కనిపించలేదు. అలాగే తప్పు చేసానని కోపగించినప్పుడు మీరు చెబితే చేసాను కదా అని అనలేదు. రాజు గారు తప్పు అని చెప్పగానే తను చేసింది తప్పుగా అంగీకరించాడు. విధేయత అంటే అలా ఉండాలి' అని చెప్పారు బాబా.

బాబా సహవాసం కోసం వచ్చిన ఒక కాషాయాంబర ధారియైన నడి వయస్కుని వంక జూచి 'ఈ దుస్తులెందుకు ధరిస్తున్నావ'ని అడిగారు. 'ఈ సహవాస కార్యక్రమం కోసమే బాబా' అని అతడు చెప్పాడు. 'మనం వైరాగ్య రూపము, విరాగ వర్ణము మన హృదయానికి కలిగించాలి గాని మనం ధరించే దుస్తులకు కాదు' అని చెప్పారు బాబా. ఈ సహవాసంలో బాబా ధుని వెలిగించి సహవాసీయులను ప్రతి ఒక్కరినీ ప్రజ్వరిల్లిన ఆ ధునిలో ఒక సమిధను వేస్తూ దాని ద్వారా ఒక చెడ్డగుణాన్ని లేదా బలహీనతను వదలుకోమన్నారు. వారు ధుని వద్దకు వెళ్ళేముందు బాబా వారిని ఆలింగనం చేసుకొని, వీపు తట్టి చెడ్డ గుణాన్ని వదులుకోవడానికి సిద్ధం చేసినట్లుగా పంపించారు.

రెండవ వారంలో జరిగిన ఆంధ్ర ప్రేమికుల సహవాసంలో బాబా ఇలా చెప్పారు. 'మీరు నా దేహాన్ని (కోటును) మాత్రమే చూస్తున్నారు. బాహ్యంగా మీకు కనిపించే నేను (ఈ కోటు) నిజమైన 'నేను' కాదు. మీరు లేశ మాత్రమైనా నిజమైన నన్ను చూస్తే బంధ విముక్తులౌతారు. కోటి మందిలో ఒక్కనికి అలాంటి చూపు లభిస్తుంది. అలా చూడగలిగిన కోటి మందిలో ఒక్కనికి బ్రహ్మానుభవం కలుగుతుంది. ఇంత కాలానికి కదా ముక్తి లభించేదని నిరాశ చెందకండి. దానికి మూడు పరిష్కార మార్గాలున్నాయి' అంటూ బాబా ఈ మూడు మార్గాలను సూచించారు.

మొదటిది : ధూళి అయిపోయి (సర్వం త్యజించి నాకు అంకితమవడానికి సంసిద్ధులై) నా వద్దకు రావాలి. ఇది చాలా కష్టం. ధూళి అయిపోవడమంటే సులభం కాదు.

రెండవది : ఈ ప్రపంచంలోనే ఉండి నీ కుటుంబ బాధ్యతలను, ఉద్యోగ ధర్మాన్ని నెరవేరుస్తూ ఉండు. కాని ప్రతిరోజు బాబా నామం 14 సార్లు స్మరించు. ఎక్కువా వద్దు, తక్కువా వద్దు. సరిగ్గా 14 సార్లు. అంతటా నా వద్దకు తప్పక వస్తావు. నా సర్వోన్నతాధికారంతో చెప్తున్నాను. ఇది తేలికగా కనిపించ వచ్చును కాని ఇది మొదటిదాని కంటె కష్టం.

మూడవది : నీ ఆఖరి శ్వాస వదలినప్పుడు బాబా నామం స్మరించు. నీవు తప్పక నా వద్దకు వస్తావు. ఇది అన్నింటి కంటే సులభంగా కనిపించవచ్చును. కాని ఇది కూడా కష్టమే. జీవితంలో ప్రతిక్షణం నన్ను ప్రేమించి నా నామం తలచే అలవాటు కలిగియుంటేనే గాని ఆఖరు ఘడియలో నన్ను స్మరించలేవు.

ఈ మూడు మార్గాలు సాధ్యం గాకపోతే నాల్గవది నిస్వార్థసేవ. ప్రతి యొక్కరిలోను బాబా ఉన్నారనే భావనతో అన్ని పరిస్థితులలోను, కష్టాలు సంభవించినా, మెప్పుగాని, బహుమానంగాని ఆశించక నిస్వార్థంగా సేవ చేస్తే అప్పుడుకూడా నీవు నా వద్దకు వస్తావు. సేవలో అసలు స్వార్థం లేకుండా ఉండాలి.

14.11.55 తేదీన బాబాకు ఆ రోజు నెహ్రూ జన్మదినమని సహవాసీయులు చెప్పారు. ఆ రోజు నెహ్రూకు 66 ఏండ్లు వచ్చాయి. బాబా నెహ్రూ గురించి ఇలా అన్నారు 'అతడు నఖశిఖ పర్యంతం మన భారతజాతి కోసం తన శక్తినంతటిని ధార బోసి కృషిచేస్తున్నాడు. అతని శక్తికి మనం గర్వించాలి. తల్లినుండి శక్తి ఆమె గర్భంలోని పిల్లవానికి ప్రవహించినట్లే అతని శక్తి అంతా నా నుండి నా ద్వారానే ప్రవహిస్తుంది'.

తంతి ద్వారా శుభాకాంక్షలు తెలియజేయాలనే సూచనపై బాబా 'నేను ఇక్కడ చెబుతుంటే అతని కక్కడ అందుతుంది. టెలిగ్రాం పంపిస్తే నేను చెప్పిన దాని విలువ అంతా పోతుంది. విచారించకండి. మీరు చెప్పారు. నేను విన్నాను. ఆశీస్సులు వెంటనే అందాయి' అన్నారు.

బాబా సహవాసీయులందరినీ కొండపైకి తీసుకొని వెళ్ళి తన సమాధి చూపించారు. వారికి వ్యక్తిగతంగాను, సామూహికంగాను తన సహవాస భాగ్యాన్ని కలిగించారు. సహవాస కార్యక్రమాలు ముగిసాక బాబా డిసెంబర్ 1955, జనవరి 1956 మాసాలలో భూయింజ్, సతారా, పూనా, కుమ్తా, సాకోరీ, సంగమనీర్, నవసారీ (గుజరాత్) మొదలగు పట్టణాలలో, గ్రామాలలో పర్యటించి దర్శనం యిచ్చారు. 14.01.56 తేదీ సంక్రాంతి రోజున బాబా పూనాలో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం గం. 6.30 ని.ల వరకు దర్శనం ఇచ్చారు. దాదాపు 30,000 మంది దర్శనం చేసుకున్నారు. బాబా రెండు చేతులతో ఏక కాలంలో ప్రసాదం పంచి పెట్టారు. నవసారీలో సోరాబ్జీ దేశాయ్ తమ్ముని కూతుళ్ళు మెహెర్ కాటేజీ పేరుతో ఒక ఇల్లు నిర్మించి బాబాను అందులో ఉండటానికి ఆహ్వానించారు. డా. హెచ్. పి. భరూచా మిగతా ప్రేమికులు బాబా కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. ఆ కార్యక్రమాలను భంగం చేయడానికి తుదకు బాబా దర్శనం ఇచ్చే పందిరికి నిప్పంటించడానికి కొంత మంది పార్సీ కుర్రవాళ్ళు విఫల యత్నం చేసారు. బాబా కృపతో వారు తమ తప్పిదాన్ని గుర్తించి బాబా దర్శనం చేసుకున్నారు.

15.02.56 తేదీనుండి ఒక సంవత్సరం ఏకాంతవాసంలో ఉంటారని తెలియడంతో చాలా మంది ఈ దర్శన కార్యక్రమాల్లో పాల్గొని బాబా దర్శనం చేసుకున్నారు. సహవాస్‌లో పాలొన్న ప్రతిబృందం నుండి ఐదుగురు ప్రేమికుల నెంచుకొని వారు ఐదు రోజులు ఒక గదిలోనే నిద్రాహారాలు లేకుండా భగవన్నామం జపిస్తూ గడపాలని ఆదేశించారు. ఆంధ్ర బృందం నుండి (1) కుటుంబ శాస్త్రి, (2) డా. కనకదండి సూర్యనారాయణ, (3) కోదూరి కృష్ణారావు,(4) వై.వి. రంగారావు, (5) మెహెర్ ప్రసాద్ (హనుమంతరావు) బాబాచే ఎంపిక చేయబడ్డారు.

## పశ్చిమ దేశాలకు ప్రయాణం

15.02.56వ తేదీ నుండి ప్రారంభించిన ఏకాంతవాసంలోనే ఒక నెల విరామం తీసుకొని బాబా పశ్చిమ దేశాలలో పర్యటించడానికి వెళ్ళారు. పాశ్చాత్య ప్రేమికుల కోరికను మన్నించారు. 16.07.56వ తేదీన ఆదీ. కె. ఇరానీ, డా.నీలు, ఈరుచ్, మెహెర్జీ అను నలుగురు మండలి సభ్యులతో బాబా బొంబాయి శాంతాక్రూజ్ విమానాశ్రయంలో బయలుదేరి 17.07.56 సాయంత్రం లండన్‌లో దిగారు. పలువురు బాబా ప్రేమికులు బాబాకు స్వాగతం పలికారు. లండన్‌లో బాబా ప్రేమికుల సంఘం సభ్యుల సమావేశంలో పాల్గొని తన పని అంటే ఏమిటో తెలియజేసే ప్రసంగ పాఠం వారికిచ్చారు. 01.03.54 తేదీన రాజమండ్రిలో బాబా కార్యకర్తల సమావేశంలో ఇచ్చిన సమావేశాన్ని ఇది తలపిస్తుంది. వారి అభిప్రాయ భేదాలను బాబా సరి చేసారు. రెండు రోజులు లండన్‌లో ఉండి అక్కడికి వచ్చిన పలువురు ప్రేమికులకు, దర్శనార్థులకు వ్యక్తిగతంగాను, సామూహికంగాను దర్శనాలిచ్చి 19వ తేదీ సాయంకాలం లండన్ నుండి బయలుదేరి బాబా అమెరికా వెళ్ళారు.

ఎందరో ప్రేమికులు బాబాకు స్వాగతం చెప్పడానికి న్యూయార్క్ విమానాశ్రమానికి వచ్చారు. 1952 తర్వాత అంటే మళ్ళీ 4 సంవత్సరాల తర్వాత బాబా ఆమెరికాకు వచ్చారు. ఇది ఆయన అమెరికాకు రావడం ఐదవ సారి. ఐక్యరాజ్య సమితికి వచ్చిన యూక్రేనియా దేశపు ప్రతినిధి ఒకరు విమానాశ్రయంలో



బాబా తన ప్రేమికులను కలిసే దృశ్యాన్ని చూచి 'ఆయన ఎవరు? ఆధ్యాత్మిక నాయకుడా! కస్టమ్స్ కార్యాలయం నుండి రాగానే ఒక్కొక్కరుగా అందరినీ పలకరించి కలసాడే! ఎంత ఆశ్చర్యము. నా జీవితంలో చూచిన గొప్ప వారందరిలోను ఇలాంటి అద్భుతమైన వ్యక్తిని నేను చూడలేదు' అని చెప్పాడు.

సూఫీయిజమ్ బృందానికి ఆధిపత్యం వహించిన ఐ.వి.డ్యూస్, మిర్టిల్ బీచ్ కేంద్రానికి బాధ్యత వహించిన ఎలిజబెత్ పాటర్సన్‌లు బాబా పర్యటనకు ప్రతినిధులుగా ఉన్నారు. ఆతిధ్య సంఘానికి అధ్యక్షురాలైన మేరియన్ ఫ్లోర్ హీమ్ బాబా పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేసింది. 23.07.56 వరకు న్యూయార్క్‌లో ప్రేమికులకు, వ్యక్తిగతంగాను, సామూహికంగాను దర్శనాలిచ్చి బాబా 24.07.56వ తేదీన మిర్టిల్ బీచ్‌కు ప్రయాణమై వెళ్ళారు. న్యూయార్క్‌లో పత్రికా విలేఖరులతో సమావేశం జరిపారు. మిర్టిల్ బీచ్ సెంటర్‌లో బాబా 6 రోజులు గడిపి అందరికీ తన సహవాస భాగ్యాన్ని కలుగజేసారు. ఒక రోజు ఎన్.బి.సి. టి.వి. వారికి బాబాతో సంభాషణ ఏర్పాటు చేసారు. ఆ రోజు కార్యక్రమాన్ని వారు ఫిల్మ్ తీసారు.

మిర్టిల్ బీచ్ నుండి బాబా లాస్ ఏంజిల్స్ వెళ్ళి ఒక రోజు మెహెర్ మౌంట్‌లో సహవాస కార్యక్రమం ఏర్పాటు చేసారు. లాస్ ఏంజిల్స్ నుండి బాబా శాన్‌ఫ్రాన్సిస్కోకు వెళ్ళారు. అక్కడ బాబా ప్రేమికులకు క్రొత్తవారికి తన దర్శనం ఇచ్చారు. ప్రేమికుల ఇళ్ళకు వెళ్ళారు. అమెరికాలో ఆయన గడిపిన రోజుల్లో ఎన్నో సందేశాలు ఇచ్చారు. ఎందరి హృదయాలనో తన ప్రేమతో ప్రభావితం చేసారు.

శాన్‌ఫ్రాన్సిస్కో నుండి బయలు దేరి బాబా 09.08.56 తేదీన ఆస్ట్రేలియాలో



సిడ్నీలో దిగారు. ఇది ఆస్ట్రేలియాకు బాబా తొలి రాక. బాబా బీకన్ హిల్స్‌పైన నిర్మించిన మెహెర్ ఎబోడ్ అనే కేంద్రంలో సమావేశమైన అందరినీ కలుసుకొన్నారు. పిల్లలతో కొంతసేపు ఆడుతూ గడిపారు. అక్కడి నుండి బాబా మెల్‌బోర్న్ పట్టణానికి వెళ్ళి అక్కడి ప్రేమికులు ఓబ్రయన్ దంపతుల గృహాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాబా దర్శనం కోసం తపించే ప్రేమికులకు తన దర్శనభాగ్యం కలుగజేశారు. బాబా ప్రేమికుల ఇళ్ళకు వెళ్ళారు. మెల్‌బోర్న్ నుండి మళ్ళీ సిడ్నీకి వెళ్ళి అక్కడి నుండి 17.08.56 తేదీన బొంబాయికి చేరుకొని అక్కడి నుండి సతారాకు వెళ్ళారు. 1956 సంవత్సరంలో బాబా మస్తుల సాంగత్యం కోసం అనేక పర్యటనలు చేసారు.

## రెండవ మోటారు ప్రమాదం


అమెరికాలో బాబాకు 24.05.52 తేదీన 'ఓజాయ్' వద్ద కారు ప్రమాదం జరిగింది. ఆయన తన రక్తాన్ని అమెరికా భూమిపై చిందించారు. 02.12.56 ఆదివారం నాడు భారత భూభాగంపై రెండవ ప్రమాదం జరిగింది. బాబా పూనాకు వెళ్ళి మళ్ళీ సతారాకు తిరుగుప్రయాణం చేస్తున్నారు. ఈరుచ్ కారు నడుపుతున్నాడు. ఈరుచ్ బాబాను కారులో చాలా దూర ప్రయాణాలకు తీసుకొని వెళ్ళి 10,000 మైళ్ళకు పైగా కారు నడిపి సమర్ధుడైన డ్రైవర్ అనిపించుకున్నాడు.

సతారాకు 14 మైళ్ళ దూరంలో ఉడతారా అనే గ్రామ సమీపానికి మామూలు వేగంతోనే కారు వచ్చింది. రోడ్డుపైన ఎదురుగా మనుషులు గాని ఇతర వాహనాలు గాని ఏవీ అడ్డుగా రాలేదు. ఏకారణం లేకుండానే కారు అదుపు తప్పి రోడ్డు ప్రక్కన కట్టిన వంతెన గోడకు ఢీకొంది. కారులో ఆసీనుడైన బాబా ఇచ్ఛ ప్రకారమే జరిగే

దానికి ఏ కారణం కావాలి? కారు ఆ ప్రక్కనే గల గోతిలో పడిపోయింది. అప్పుడు సమయం గం. 5.15 ని.లు ఆ తర్వాత ఆ దారిలో పూనా వెళ్తున్న ఒక వ్యక్తి తన కారులో బాబాను, విష్ణుమాస్టర్‌ను సతారాకు తీసుకొని వెళ్ళాడు. ఆ తర్వాత వచ్చిన లారీలో ఈరుచ్, పెండు మరియు డా. నీలును సతారాలోని ఆసుపత్రికి తీసుకొని వెళ్ళారు. నీలు ఈ ప్రమాదంలో మరణించాడు. అతని కోరిక ప్రకారం అతడు బాబాతో ప్రయాణం చేస్తూ బాబా సాన్నిధ్యంలో మరణించాడు. ఈరుచ్‌కు, పెండూకు బాగా గాయాలయ్యాయి. బాబాకు తలకు, ముఖానికి గాయాలయ్యాయి. నాలుక తెగిపోయింది కుడితొడపై భాగంలోని ఎముక విరిగి పోయింది. సతారాలో చేయవలసిన చికిత్స చేసి తర్వాత పూనాకు తీసుకొని వెళ్ళారు. తాననుభవించే బాధ గురించి బాబా ఇలా చెప్పారు.

'మానవులు వారి కర్మ ప్రకారం పడవలసినంత బాధ పడతారు. కొందరు ఇతరులకై బాధ పడతారు. సద్గురువులు ప్రపంచం కోసం బాధ పడతారు'. ప్రమాదాలు గాని ఇతర కారణాల వల్ల గాని అవతారుడయిన బాబా శారీరకంగాను, మానసికంగాను, ఆధ్యాత్మికంగాను మానవ శ్రేయస్సు కోసమే బాధ పడతాడనేది స్పష్టం. బాబా తనకు తగిలిన గాయాలవల్ల కలిగే బాధను గురించి చెప్తూ 'హంగేరీ ప్రజలు ఈ మధ్యన ఎంతో బాధ పడ్డారు. చాలా మంది గాయపడి చూసే దిక్కులేక రోడ్డుపై పడిపోయి ఉన్నారు. మందులిచ్చేవారు, వారికోసం బాధపడేవారు, వారిని ప్రేమించే వారు ఎవరూ దగ్గర లేరు. నేను పరుపుపై పడుకొనియున్నాను, సేవలు చేయడానికి సన్నిహిత ప్రేమికులంతా ఉన్నారు. నా పరిస్థితి వారితో పోలిస్తే ఎంతో నయం' అన్నారు.

ఈ సమయంలో ఒకసారి బాబా విరిగిన తుంటి ఎముక వద్ద ఒక సర్కిల్ ఆకారంలో వ్రేలితో సూచించి, 'ఈ చోటులోనే నేటి విశ్వం యావత్తు పడే బాధ కేంద్రీకృతమై ఉంది. నేననుభవించే విశ్వవ్యాప్తమైన బాధకిది బాహ్యంగా కనపడే స్వల్ప సంఘటన మాత్రమే' అని చెప్పి 'అయినా నేను సంతోషంగా ఉన్నాను, ఎందుకంటే అది నేను కావాలనుకున్నట్లుగానే జరిగింది' అన్నారు. పూనాకు వెళ్ళే



సమయంలోనే బాబా ప్రమాదం జరిగే స్థలం వద్ద కారు ఆపి ఆ స్థలాన్ని కొంతకాలం క్రిందట తాము క్రికెట్ ఆడిన స్థలమని తన మండలి వారికి చూపించారు. కాని ప్రమాదం జరిగిన తర్వాత గాని అసలు విషయం వారికి తెలియలేదు. ఆ తర్వాత డిసెంబర్ మాసం 21, 27 తేదీలలో బాబాకు ప్రీతిపాత్రులైన గాడ్గే మహారాజ్, ఆలీషా అనే మస్తు మృతి చెందారు.

1957 ఫిబ్రవరి 12వ తేదీన బాబా మెహెర్‌బాద్‌కు వెళ్ళారు. 15.02.57 తేదీన ఏకాంతవాసం ముగిసిన సందర్భంగా 800 మంది బీదల పాదాలను స్పృశించి వారికి ప్రసాదం, ధాన్యం చిన్న మూటలలో పంచారు. ప్రమాదంలో తగిలిన గాయాల వల్ల ఉన్న బాధలు కూడా లెక్కించక బాబా ఈ కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భములోనే బాబా 'ఒక కారుమేఘం తనపైన తిరుగుతూ కనిపిస్తోందని అది బ్రద్దలవడానికి సిద్ధంగా ఉందని ఆ విషయమై తాను హెచ్చరిక చేస్తూ ఉన్నానని చెప్పారు. శాస్త్రవేత్తలు తయారు చేసిన మారణాయుధాలు చూడండి. ప్రతిదేశం యుద్ధానికి కవ్విస్తున్నాయని ఇతర దేశాలను నిందిస్తోంది. అకస్మాత్తుగా ఎప్పుడైనా ప్రళయం ముంచుకొని రావచ్చు. నేను ఆంతరంగికంగా చేసే పని ఫలితంగానే ప్రపంచ పరిస్థితులు మారుతుంటాయి. నోవా కాలంలో వచ్చిన వరదల సమయంలో నరకం ప్రపంచంలో విడుదల చేయబడినట్లయింది. సంపూర్ణ ప్రపంచ యుద్ధం సంభవిస్తే ఈ భూగోళం నాశనమవుతుందని శాస్త్రవేత్తలు అంచనాలు వేసి చాటుతున్నారు. వారు నా భావాన్ని ప్రతిధ్వనింప జేస్తున్నారు. అయినా ప్రపంచమంతా నాశనం కాదు. నేను మళ్ళీ 700 సంవత్సరాల తర్వాత రావాలి కదా' అన్నారు బాబా. 'జరగవలసింది నెరవేర్చుటకు

నేను నా సృష్టిలో పనిచేస్తాను. ఆ పని సృష్టించే అద్భుతమైన శక్తి నా అవతారాగమనాన్ని వ్యక్తం చేస్తుంది. అంధకారంలో పెనుగులాడే మానవాళి కాశక్తి ప్రభావం వల్ల అందరికీ మేలుకొలుపు సాధారణంగాను, ఆత్మసాక్షాత్కారం ప్రత్యేకంగాను ఇవ్వబడుతుంద'ని బాబా చెప్పారు.

బాబాకు చికిత్స చేయడానికి అంధుడైన హరి కెన్మోర్ అనే అమెరికా దేశపు 'కీరో ప్రాక్టర్' (ఒక ప్రత్యేకమైన చికిత్స చేయువాడు) వచ్చి బాబాకు వృత్తి పరంగా కాక భక్తి ప్రపత్తులతో చికిత్స చేసాడు. బాబాకు కృపకు పాత్రుడైనాడు. అతడు పర్వర్దిగార్ ప్రార్థన చదివితే సింహగర్జన లాగా ఉండేది. ఆయన స్వరంలో ఆయన హృదయంలోని విశ్వాసం ప్రతిబింబించి అందరి హృదయాలను ప్రేమతో స్పృశించి నట్లుండేది. 'నీవు చేసిన ప్రార్థన భగవంతుడు రూపధారీయై ఇక్కడే ఉన్నాడని కొందరికి అనుభూతి కలిగించింది. ఒకరోజు నా ప్రేమ అందరిలోను భగవంతుడే ఉన్నాడనే అనుభూతి నీకు కలుగ జేయుగాక!' అని బాబా 1962 ప్రాక్పశ్చిమ సమ్మేళనంలో ప్రార్థన చదివిన హరి కెన్మోర్‌కు చెప్పారు.

## మెహెరాబాద్‌లో రెండవ సహవాసం - 1958

ప్రమాదంవల్ల కలిగిన గాయాల బాధలు పూర్తిగా తగ్గకపోయినా బాబా కర్రల సహాయంతో కూడా సరిగా నడవలేకపోతున్నా ఆయన తలపెట్టిన రెండవ సహవాసం ప్రేమ ఇచ్చి పుచ్చుకునే సాన్నిహిత్యం జరుపబడింది. 15.02.58 నుండి 20.02.58 వరకు హిందీ మరియు మరాఠీ మాట్లాడే ప్రేమికులకు, రెండవ దఫాగా 21.02.58 నుండి 26.02.58 వరకు తెలుగు, దక్షిణాది వారికి మరియు గుజరాతీ వారికి సహవాసం ఏర్పరచబడింది. ప్రేమికులలో ఈ సారి పురుషులతో సమానంగా స్త్రీలకు కూడా అవకాశం ఇవ్వబడింది.

24.02.58 రోజున అదే ఆఖరి సహవాసమని ఆ మరునాడు జరిపే తన జన్మదినం కూడా ఆఖరిదే కావచ్చునని తనను అధికాధికంగా ప్రేమించమని, ప్రేమలో నిజాయితీ కలిగి యుండాలని, ఇతరులకు ప్రేమతో సేవ చేయాలని బాబా చెప్పారు.

1955 సంవత్సరంలో నిర్వహించిన సహవాసం లాగానే ఈ సహవాసం కూడా బాబా ప్రేమికులకు బాబా సాన్నిధ్యంలో కొన్ని రోజులు గడిపే మహదావకాశమును కల్పించింది. ప్రాపంచిక విషయాలను, సమస్యలను విస్మరించి ప్రేమసాగరుడైన బాబా సమక్షంలో కన్నులారా ఆయన మందహాసం చిందించిన సుందర వదనమును తిలకిస్తూ ఆయన నుండి ప్రసరించే ప్రేమను పొంది ధన్యులైనారు. బాబా ఎన్నో ఆధ్యాత్మిక విషయాలపై సందేశాలు ఇచ్చారు. అందరినీ ఆలింగనం చేసుకొని పునీతులను గావించారు. ఈ సహవాస్‌లో తాడేపల్లి గూడెంకు చెందిన బాలగోపాల భాస్కరరాజు ఆయన బృందం తెలుగులో బాబా చరిత్రను బుర్రకథ రూపంలో గానం చేసారు.

సహవాసానికి 800–900 ప్రేమికులు ప్రత్యేక రైలులో వచ్చారు. వారి సౌకర్యార్థం తిరుగు ప్రయాణంలో రైల్వే అధికారులు ప్రత్యేక రైలును మెహెరాబాద్ ధుని వద్ద ఆపారు. బాబా ప్రేమికులకు వీడ్కోలు చెప్పడానికి మెహెరాబాద్ కొండ దిగి రైల్వే లైన్ దగ్గరగా వచ్చి 'నన్ను మీతో తీసుకొని వెళ్ళండి, నన్ను అధికాధికంగా ప్రేమించండి. నేను ప్రేమసాగరుడను' అని చెప్పారు బాబా. బాబా చేయి ఊపి వీడుకోలు చెబుతుండగా కలిగిన సంతోషాతిశయంతో, ప్రేమికులు చేసే 'అవతార్ మెహెర్ బాబా కీ జై' అను జయజయధ్వానాలు మిన్నుముట్టగా రైలు కదిలింది.

## పాశ్చాత్య దేశాలలో సహవాసాలు

మెహెరాబాద్‌లో నిర్వహించిన సహవాసాలలో భారత దేశంలోని ప్రేమికులకే ఎక్కువ అవకాశం లభించింది. పశ్చిమదేశ వాసులకు కూడా తన సహవాస భాగ్యాన్ని కలుగజేయుటకు బాబా అమెరికాలోని మిర్టిల్ బీచ్‌లో, ఆస్ట్రేలియాలో సహవాసం యివ్వడానికి మే నెలలో అమెరికాకు వెళ్ళారు. బాబా తనతో బాటు డా.విలియమ్ డాంకిన్స్, ఆదీ. కె. ఇరానీ, ఈరుచ్ మరియు నారీమన్ దాదా ఛాంజీ అను నలుగురిని మాత్రమే తీసుకొని వెళ్ళారు. 'నా ఆరోగ్యం దిగజారిపోతున్నా నా బాధ తీవ్రతరమౌతున్నా నా ప్రేమికులకు సహవాసం ఇవ్వడం కోసమే నేను అమెరికాకు వస్తున్నాను. నేను అమెరికాలోగాని అస్ట్రేలియాలోగాని నా ఆరోగ్యం

గురించి పరీక్షలుగాని, చికిత్సలు గాని చేయించుకోను. అందరు నా సహవాసాన్ని అనుభవించి నా ప్రేమను అధికాధికంగా పొందే ప్రయత్నం చేయండి' అని బాబా చెప్పారు. బాబా 19.05.58వ తేదీ నుండి 29.05.58 తేదీ వరకు 11 రోజులు మిర్టిల్ బీచ్‌లో సహవాసం ఇచ్చారు. అమెరికాలోని పలు రాష్ట్రాల నుండి, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, జర్మనీ, ఇజ్రాయిల్, మెక్సికో మొదలైన దేశాలనుండి 225 మంది ప్రేమికులు ఈ సహవాసంలో పాలొన్నారు. బాబా దర్శనార్థం ఎందరో కొత్తవారు కూడా వచ్చి దర్శించుకున్నారు. సహవాసీయుల కోసం గుడారాలు వేసి, మంచాలు వేసి అన్ని ఏర్పాట్లు చేసారు. బాబా ఆరోగ్యం దృష్ట్యా డా. హరి కెన్మోర్ బాబా ప్రేమికులను ఆలింగనం చేసుకోవద్దని పూలదండలు వేయించుకోవద్దని హెచ్చరించాడు. కాని అనంత కరుణా మయుడైన మెహెర్ బాబా తన ప్రేమికులకు తన సహవాస భాగ్యాన్ని కలుగ జేయడానికి మనస్థాయికి దిగి వచ్చి మనకోసమే బాధలను భరిస్తూ ఉన్నప్పటికీ ప్రేమికులను కలుసుకోకుండా, ఆలింగన మివ్వకుండా ఎలా ఉండగలరు? ప్రతి రోజు బాబా ప్రేమికులను ఆలింగనం చేసుకున్నారు. 'నేను ప్రవచనాలు, దీర్ఘోపన్యాసాలు చేయన'ని బాబా చెప్పారు కాని అతిసహజంగా ప్రేమికుల హృదయాలను ప్రభావితం చేసే విధంగా ఆటపాటలతో బాటు విధేయత, ప్రత్యేకపు అహం, ప్రత్యేకపు నేను, భక్తి యోగం, నల్లమందు అలవాటు (డాంబిక సాధువుల గురించి) ప్రేమ – భక్తి, ప్రేమయే మందు, బాబా పని అంటే ఏమిటి, కర్మ – అకర్మ, తప్పని సరియైన కర్మ శాసనం, దేవుని సర్వ వ్యాపకత్వం, నిజమైన జననం – మరణం, చైతన్య భూమికలు మొదలైన విషయాలపై ఈ 11 రోజులలో ప్రవచనాలు, సందేశాలు యిచ్చారు. ఈ సహవాసంలోనే 24.05.58 రోజు మిర్టిల్ బీచ్‌లో 'నా వాంఛితము' అనే సందేశాన్ని తన ఆదేశంగా యిచ్చి 2 సార్లు చదివించారు. అందులోని ముఖ్యాంశములు ఈ పుస్తకము చివర 2 వ భాగమునందు వివరించబడినవి.

బాబా తన ప్రేమికులకు 'నేను మీ నుండి కోరేది నూటికి నూరు పాళ్ళు ప్రేమ, విధేయత. అలా చేసే వాళ్ళే నాకు కావాలి. జీసస్‌గా వచ్చి నప్పుడు ఇలాగే అన్నీ వదిలి నావద్దకు రండి అని చెప్పాను. కృష్ణుడుగా, జోరాష్టర్‌గా వచ్చినప్పుడు అదే

చెప్పాను. అన్నీ వదిలి రమ్మనగా మీ బాధ్యతలను వదిలి రండి అని అర్థం కాదు. నా ఇచ్ఛయే మీ ఇచ్ఛగా మారాలి. నా ఇచ్ఛయే మీ ఆనందం కావాలి. భగవంతుడనగా అనంతమైన నిజాయితీ, ఆయనను ప్రేమించుటకు మీరు నిజాయితీగా ఉండాలి' అని నొక్కి చెప్పారు.

బాబా వాషింగ్టన్, శాన్‌ఫ్రాన్సిస్కోల ద్వారా ఆస్ట్రేలియాకు వెళ్ళారు. క్వీన్స్‌లాండ్ రాజధానియైన బ్రిస్బేన్‌కు 75 మైళ్ళు ఉత్తరాన గల కీల్ కొండపైన గల 80 ఎకరాల అనాస తోటలో రమణియమైన ప్రకృతి సౌందర్యముతో మనోహరంగా ఉన్న స్థలంలో బాబాకు మండలి వారికి వసతి ఏర్పాటు చేసారు. బాబాతో సహవాసం కోసం విక్టోరియా, న్యూ సౌత్ వేల్స్ మొదలగు రాష్ట్రాల నుండి వచ్చిన ప్రేమికులకు గుడారాలను, వసతి భోజన సౌకర్యాలను ఏర్పాటు చేసారు. బాబా 03.06.58వ తేదీ ఉదయం ఆ సహవాస స్థలానికి చేరుకున్నారు. 03.06.58 తేదీ నుండి 06.06.58 తేదీ వరకు 4 రోజులు బాబా తన సహవాసం కోసం సమావేశమైన ప్రేమికులతో గడిపారు. వారికి వ్యక్తిగతంగాను, సామూహికంగాను దర్శనాలిచ్చి వారి హృదయాలను ప్రేమతో నింపి 07.06.58 రోజు బయలుదేరి 08.06.58 వ రోజు బొంబాయి చేరుకున్నారు. పాశ్చాత్య ప్రేమికులకు ఈ క్రింది సందేశం పంపించారు.



'నన్ను ఉంచుకునే స్థలం హృదయం మాత్రమే. నన్ను మీరు సన్నిహితంగా ఉంచుకోండి. నేను అక్కడ ఎల్లప్పుడూ ఉంటాను'.

09.07.58 తేదీన బాబా మెహెరాబాద్‌లో సమావేశమేర్పాటు చేసారు. దాదాపు 200 మంది ప్రేమికులు పాల్గొన్నారు. బరోడా మహరాణి శాంతాదేవి

కూడా ఆ సమావేశానికి వచ్చారు. ఆ రాత్రి బాబా ధుని వెలిగించగా అనావృష్టితో, కరువుతో కొట్టుమిట్టాడుతున్న ఆ ప్రాంతపు ప్రజలకు ఊరట కలిగిస్తూ వర్షం పడింది. భజన, హారతి తర్వాత పశ్చాత్తాప ప్రార్థన చదివించి బాబా తన విశ్వసందేశాన్ని వ్రాయించి అన్ని భాషలలోకి అనువదింపజేసి చదివించారు. 'నేను బోధించుటకు రాలేదు. మేల్కొల్పడానికే వచ్చాను. అందుకే ఏ నియమాలను ఏర్పరచడం లేదు'. అనే వాక్యంతో ప్రారంభమవుతుంది విశ్వసందేశం.

సహవాస కార్యక్రమం తర్వాత బాబా 1959 నుండి 1962 సంవత్సరం వరకు పర్యటనలు తగ్గించుకున్నారు. మెహెరాజాద్, మెహెరాబాద్, అహమద్‌నగర్‌లలోనే గడిపారు. వేసవి కాలంలో బాబా పూనాలో బరోడా మహరాణి బాబా కోసం ఇచ్చిన విశాలమైన తోటలతో కూడిన 'గురుప్రసాద్' అనే భవనంలో ఉండి ప్రేమికులకు దర్శనార్థులకు దర్శనమిచ్చారు. పూనా గురుప్రసాద్‌లో ప్రతి ఆదివారం బాబా దర్శనార్థుల కొరకు దర్శనాలిచ్చేవారు.

25.02.1959 రోజు తన 65వ జన్మదినం జరుపుకున్నారు. ఆ సందర్భంగా బాబా ఈ క్రింది సందేశం తన ప్రేమికులకు ఇచ్చారు.

'ఈ ప్రంపచం నుండి నీవు పారిపోవద్దు. నీ నీచమైన అహంకారం నుండి పారిపో. ప్రపంచాన్ని నీవు త్యాగం చేయవద్దు. నీ నీచ ప్రవృత్తిని త్యాగం చేయి. ఏకాంతం కోసం బయట ఎక్కడా వెతుకవద్దు. అది నీలోనే దొరుకుతుంది. 'ప్రియతమా! నా నిజమైన అనంతాత్మగా నీవు నాకు కనిపించు' అని నీ ఆత్మలో నీవే మౌనంగా ఆక్రోశించు'.

బాబా ఎల్లప్పుడు రాబోయే విపత్తు గురించి తన మౌన విరమణ గురించి 'నా అంతట నేను మౌన విరమణ చేయను. విశ్వవ్యాప్తమైన విపత్తు నాచే మౌన విరమణ చేయిస్తుంది' అని చేప్పేవారు. మండలి వారి నుద్దేశించి 'నన్ను అవగాహన చేసుకొన యత్నించవద్దు. నా లోతు అగాధమైనది. నన్ను ప్రేమించండి. విధేయులుగా నుండండి' అని చెప్పేవారు.

## అంధులెవరు?

బొంబాయి నగరంలో నుండగా బాబా 13.03.1959 రోజున సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల, వడాల గ్రామంలో దర్శనం ఇచ్చారు. 1400 మంది విద్యార్థులు బాబా దర్శనం చేసుకొని ఆయన ఇచ్చిన ప్రసాదం స్వీకరించారు. మెహెర్ బాబా అనగా 'దయగల తండ్రి' యని; ఆయనను తల్లిగా, తండ్రిగా, సోదరునిగా, స్నేహితునిగా, ఎలాగైనా స్వీకరించవచ్చని చెప్పారు. ఆయన అన్ని స్థాయిలలో ఉన్నందున నీవు ఎలా స్వీకరిస్తే ఆయనను అలాగే పొందగలవు' అని చెప్పారు. అక్కడి నుండి బాబా అంధుల పారిశ్రామిక గృహానికి వెళ్ళారు. ప్రతి ఒక్కరు బాబాకు గులాబీ పువ్వు సమర్పించి ఆయన ఆలింగన భాగ్యంతో హృదయాలలో వెలిగించబడిన కాంతి పుంజాల అనుభూతి పొందారు. అందులో ఒకరు అంధులుగా జీవించాల్సి వచ్చిన వారి దురదృష్టానికి కారణమేమిటని అడిగారు. బాబా ఈ క్రింది సందేశాన్ని ఇచ్చారు.

'అంధులను అదృష్టహీనులుగా ప్రజలు సాధారణంగా భావిస్తారు. మీరు అలాగే అనుకోవచ్చు. కాని కళ్ళు ఉన్నవారే నిజంగా అదృష్టహీనులు. వారు చూసినవన్నీ నిజమే అనుకుంటారు. కాని వారు వాస్తవమైన దేవుని చూడలేరు. భగవంతుని చూడలేని వారే నిజంగా అంధులు. చూడడానికి యోగ్యమైన వస్తువు భగవంతుడొక్కడే. అందుచేత కేవలం బాహ్యనేత్రాలు కలిగినవారు కన్నులున్న గుడ్డివారు. హృదయాలలో భగవంతుని ప్రేమించే గుడ్డివారే ఏదో ఒక రోజున నిజమైన దృష్టితో నన్ను ప్రతిచోట చూడగలరని, ప్రేమతో మిమ్ములను ఆలింగనం చేసుకుంటున్నాను' అని బాబా చెప్పారు. తరువాత 11.04.59 రోజున బాబా పూనాలో కోరేగాంలో గల అంధ బాలుర పాఠశాలకు, ఆ పాఠశాల సూపరింటెండెంట్ అయిన కాలే ఆహ్వానంపై వెళ్ళి విద్యార్థులను, అధ్యాపకులను ఆలింగనం చేసుకున్నారు.

## మానవజన్మ తరువాత జంతుజన్మ రాదు

పూనాలో ఉండే రోజుల్లో బాబా ఈరుచ్ తండ్రియైన జెస్సావాలా యింటికి

(బింద్రాన్ హౌస్‌కు) తరచుగా వెళ్తుండేవారు. ఆ యింటిలో నున్న పనిమనిషి దొంగతనం చేసేదని తెలిసి బాబా ఆమెను దొంగతనం చేయవద్దని చెప్పి మందలించారు. అయినా అమె మళ్ళీ దొంగతనం చేసిందని తెలిసి బాబా ఆమెను తన దగ్గరకు పిలిచి గంభీరంగా ఇలా చెప్పారు. 'నీవు మళ్ళీ దొంగతనం చేస్తే వచ్చే జన్మలో పందివై పుడతావు – జాగ్రత్త' అన్నారు. ఆమె హడలెత్తి మళ్ళీ ఎప్పుడూ దొంగతనం చేయనని చెంపలేసుకుంది. మళ్ళీ దొంగతనం చేయలేదు. ఆ సమయంలో దగ్గర ఉన్న మండలి వారు ఫ్రాన్సిస్ బ్రాబ్‌జాన్‌లను ఉద్దేశించి బాబా ఇలా చెప్పారు. 'ఒకమాటు మానవ శరీరం ధరించిన తర్వాత జీవాత్మకు తిరోగమనం ఉండదు. ఆ జీవుడు జంతు రూపంలోకి మళ్ళీ వెళ్ళడు' అని చెప్పారు.

## మధుసూదన్ – సుభద్రల వివాహం

మధుసూదన్ శ్రీధర్ పుండ్ అనే బ్రాహ్మణ యువకుడు బాబా సమక్షంలో భజనలు, భక్తి గీతాలు పాడేవాడు. 'జహా కల్పనా శబ్ద న పహూంచే' అనే హారతిని మరియు కొన్ని వందల పాటలు హిందీలో వ్రాసాడు. ఆయన గొంతెత్తి పాడితే ప్రేమికులు తమను తాము మరిచి పోతారు. అది మధుసూదన్‌కు బాబా ఇచ్చిన ప్రేమ ప్రసాదము. ఆయనతో బాటు బాబా దర్బారులో సుభద్ర అనే హరిజన యువతి కూడా బాబా భజనలు గానం చేసేది. 14.05.59 రోజున బాబా గురుప్రసాద్‌లో తన సమక్షంలో బాబా ప్రేమికుల సమక్షంలో ఏ కర్మకాండలు లేకుండా నిరాడంబరంగా వారిద్దరికీ వివాహం జరిపించారు. వారిని ఆశీర్వదించారు, తరువాత వారు తమ వివాహాన్ని రిజిష్టర్ చేయించుకున్నారు. వధూవరులు ధన్యులు. ఈ వివాహంతో కర్మకాండలు లేని, కులమత తేడాలు లేని నిరాడంబరమైన వివాహాలకు బాబా శ్రీకారం చుట్టారు.

01.06.1959 రోజున బాబా విశ్వకార్యభారం తనపైన అమితంగా ఉందని చెబుతూ ఇలా అన్నారు 'నా విశ్వకార్య భారం గురించి మీకేమీ తెలియదు. నేను సూచిస్తున్న సమయ మాసన్నమైనది. ఈ విశ్వం నా నుండి ఉద్భవించింది. అది నా వద్దకు రావలసియుంది. ఈ మాటలు నేను వ్యర్థంగా చెప్పేవి కావు. సనాతన

పురుషుడైన నా అనుభవం నుండి అధికారికంగా చెబుతున్నాను. ఒక వైపున అనంత అనుభవానుభూతి, రెండవ వైపు మాయ నన్ను లాగుతున్నాయి. ఇది నా శిలువ వేత. సత్యంపైన నా పట్టు ఎప్పుడు సడలిపోదు'.

07.06.1959 తేదీన డెక్కన్ కాలేజీలోని ఒక ప్రొఫెసర్ బాబా దర్శనానికి వచ్చాడు. ఆయనకు యోగాభ్యాసం పైన అభిరుచి ఎక్కువ. బాబా ఆయనకిలా చెప్పారు. 'యోగమంటే ఏమిటో తెలుసా? దాని వలన ఏమి సాధించాలని చూస్తారు? ఒకటే నిజమైన యోగముంది. అది 'యూ గో' (You go) దీనికంటే వేరొక యోగమేదీ నాకు తెలియదు. యోగమంటే అర్థం అంత సరళంగా ఉంది. మీరు మీకే అడ్డు తెరగా ఉన్నారు. మీలోని నేను అనునది పోయినప్పుడే ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఆ నేను ఎలా పోతుంది? ప్రేమయే దానికి సమాధానం. భగవంతుని యెడల ప్రేమ ద్వారా అహం నాశనమై పోవాలి. అప్పుడే నిన్ను నీవు నిజంగా తెలుసుకుంటావు'.

ఉద్యోగాన్వేషణ చేసే ఒక యువ ప్రేమికుడు బాబాకు ఇలా ఉత్తరం వ్రాసాడు. 'బాబా నీవు ప్రేమికుల బానిసనంటావు కదా! నాకు ఉద్యోగం దొరికేలా ఆశీర్వదించు'. బాబా దానికీవిధంగా జవాబు వ్రాసారు. 'నేను నీకు బానిసను కాదు. నీ (నా ప్రేమికుల) ప్రేమకు దాసుడను. అది గుర్తుంచుకో'.

బాబాకు తరచు ఆయన ప్రేమికులు, వారికి జరిగే అనుభవాలు, అద్భుతాల గురించి ఉత్తరాలు వ్రాసేవారు. దానికాయన ఈ విధంగా తెలియజేసారు.

'భగవంతుడు సర్వవ్యాపకుడు. నిజమైన ప్రేమతో వేసిన కేకను తప్పకుండా వింటాడు. వారికి తప్పక సహాయం చేస్తాడు. ప్రేమ నిన్ను నా వద్దకు తీసుకొని వచ్చినప్పుడు నన్ను ఏమీ అడగవద్దు. ప్రేమలో ఏ ప్రశ్నలు ఉండవు. ఎందుకు, ఎలాగా అనే సందేహాలకు ఆస్కారం లేదు. నేను మౌనంగా ఇచ్చే దేదో మౌనంగా స్వీకరించు'. కలకత్తాలోని ప్రేమికులు ఒక పుస్తకంలో ప్రచురించడం కోసం అడుగగా బాబా ఈ సందేశాన్నిచ్చారు.

'నా మౌనంలో నీ శబ్దాలన్నింటినీ ముంచి వేయి – పదాలకు పదమైన నా మాటను ఆలకించడానికి'.

బాబా పూనాలో గురుప్రసాద్‌లో దర్శనమిచ్చే రోజుల్లో ఎందరో ప్రేమికులు ప్రాక్పశ్చిమ దేశవాసులు, ప్రముఖులు, రాజకీయ వేత్తలు, శాస్త్రవేత్తలు బాబాను దర్శనం చేసుకున్నారు. చాగంటి సుబ్బారావు, నీలం సంజీవ రెడ్డి, ఫాదర్ యాంటోనీ, లక్ సోదరులు జోసఫ్ హార్బ్ బెన్ హేమన్, డా.హారి కెన్మోర్ మొదలగు వారు దర్శనం చేసుకున్నారు. 06.06.1960 తేదీన నీలం సంజీవ రెడ్డి, అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు, బాబా దర్శనం చేసుకున్నప్పుడు బాబా ఈ సందేశం ఇచ్చారు.

'దేవుని ఇచ్ఛకు విరుద్ధంగా నడుచుట కంటే దేవుడు లేడనటమే మంచిది. ఒక్కొక్కసారి దౌర్బల్యాన్ని బలంగా తీసుకొని తెచ్చిపెట్టుకున్న గొప్ప దనంతో మనం మురిసిపోతూ ఉంటాము. దేవుని భక్తుడనని చెప్పుకుంటూ దేవునియందు, ప్రపంచమందు, తనయందు ఆత్మశుద్ధి లేకుండా ప్రవర్తించడం సాటిలేని వంచన, కపటం. కష్టాలు వాటి నధిగమించేందుకు, మన గొప్ప తనాన్ని ఋజువు చేసుకునేందుకు అవకాశం కలుగజేస్తాయి. చంటిబిడ్డకు తల్లిపై నమ్మకం సంపూర్ణంగా ఉంటుంది. ఆ బిడ్డ తన చింతలన్నీ తల్లికే వదిలేస్తుంది. అప్పుడా బిడ్డను సంరంక్షించే బాధ్యత అంతా ఆ తల్లిదే. అలాగే మనకోసం దేవుడు మన బాధ్యతలను తనమీద వేసుకొని బాధపడేటట్లు మనం ఆయనలో విశ్వాసం కలిగియుంటే మనకు తృప్తి, ఆనందం లభిస్తాయి. ఒక దేశ నాయకుడు దేవునిలో సంపూర్ణ విశ్వాసముంచితే జాతిని సరియైన మార్గంలో నడిపే సాధనంగా దేవుడతనిని తీర్చిదిద్దుతాడు. మన చెడు కోరే వారియొక్క మంచినే మనం ఎల్లప్పుడూ కోరాలి'.

హమీర్‌పూర్ జిల్లాలోని నవరంగాలో బాబా విగ్రహం తయారు చేసుకోవడానికి శిల్పకారుడికి కావలసిన భంగిమలో నిలబడి చూపించారు. ఆ ఆలయాన్ని 'ధామ్' అని పిలవాలని అందులో ఏ కర్మకాండలు చేయవద్దని నిజమైన దేవాలయం

ప్రేమికుని హృదయమని, నిజమైన ఆరాధన ప్రేమతో తోటివారికి చేసిన సేవయే' నని బాబా చెప్పారు.

అలాగే కొవ్వూరులో కోడూరు కృష్ణారావు గారు బాబా ఇచ్చిన ప్రేమ, స్ఫూర్తితో 28.02.63 నాడు అంతకు ముందే నిర్మించిన మెహెర్ స్థాన్‌లో బరోడా మహారాణి శాంతాదేవిచే ఆవిష్కరింప బడిన విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా రామలింగేశ్వర రావు, న్యాయవాది అడిగిన ప్రశ్నలకు జవాబుగా బాబా 8 సందేశాలిచ్చారు. వానిని ఈ పుస్తకం చివరలో పొందుపరచడమైనది. 1954లో కొవ్వూరుకు వచ్చినప్పుడే మెహెర్‌స్థాన్‌లో తనను ఆహ్వానించడానికి అందరూ రావాలని సూచించారు. 'నేను ప్రతిష్ఠ రోజునే గాక ఎల్లప్పుడు నన్ను (నా విగ్రహాన్ని కాదు) చూడవచ్చేవారి కోసం ఉంటాను' అని బాబా చెప్పారు. రామలింగేశ్వరరావు గారి ప్రశ్నలకు సమాధానాలిస్తూ బాబా 'కొవ్వూరు మెహెర్ స్థాన్‌లో ఏ కర్మకాండలు, పూజా పద్ధతులు అవసరం లేదని, వేదమంత్రాలతో ప్రతిష్ఠ అవసరం లేదని, బాబాయే మెహెర్ స్థాన్‌లో ఉన్నారనే నమ్మకంతో హృదయంలో బాబాను తీసుకొని వచ్చే ప్రేమికులకు కాంస్య విగ్రహానికి బదులు బాబా సన్నిధానంలో ఉన్న అనుభూతి కలుగుతుందని, అలా నమ్మకం లేనివారికి ఎన్ని మంత్రాలు పఠించినా అది కేవలం కాంస్య విగ్రహంగానే కనిపిస్తుంద'ని బాబా చెప్పారు.

అహమద్‌నగర్‌లో ఆలు అనే ఒక ప్రేమికురాలు ఉండేది. ఆమె కండరముల జబ్బుతో బాధపడుతూ 20 సంవత్సరాల నుండి మంచాన పడివుంది. బాధ ఎక్కువౌతుంటే ఆమెకు బాబా ఎడల ప్రేమ కూడా పెరుగుతూ వచ్చింది. బాబా తన కోసం వచ్చి తనకు దర్శన భాగ్యం కలుగజేస్తారని ఆమె ఎప్పుడూ తన యింటిలోని వారికి చెప్పేది. కాని వారామె మాటలను విశ్వసించక 'బాబా ఏకాంతంలో ఉన్నారు గదా! ఎలా వస్తారు – అది ఆమె భ్రమ' అని అనుకునే వారు. ఒక వారం రోజుల నుండి ఆమె అమితమైన బాధతో బాబాను స్మరిస్తూ గడుపుతూ ఉంది. అనంత కరుణామూర్తియైన బాబా ఆలూ ఇంటికి వెళ్ళి అందరూ ఆశ్చర్య పడుతుండగా ఆమెను తన మృదుస్పర్శతో పునీతురాలుగా చేసి దర్శన భాగ్యం కలుగజేసి వెళ్ళారు.

రెండు రోజుల తర్వాత ఆమె బాబా నామాన్ని స్మరిస్తూ భవబంధాల నుండి విముక్తి పొంది శరీరం వదిలేసింది. నేను నా ప్రేమికుల ప్రేమకు దాసుడను అన్న బాబా మాట యదార్థము గదా! హృదయాంత రాళాల నుండి వచ్చే పిలుపును విన్న తర్వాత బాబా రాకుండా ఎలా ఉండగలరు?

బాబా పూనాలోని గురుప్రసాద్‌లో ఉండే రోజుల్లో (వేసవి 1962 సంవత్సరం) ఒక ఆదివారం ఓ న్యాయవాది బాబా దర్శనానికి అతని కుమారునితో వచ్చాడు. గోవిందు అనే అతని కుమారుడు తన తండ్రిని ఇలా అడిగాడు 'నాన్నా! బాబా ఇన్ని సంవత్సరాల నుండి మౌనంగా ఉన్నారు కదా. ఆయన మౌనం వదలి మాట్లాడినప్పుడు మనకు వినిపిస్తుందా? ఆ మాటలు బాబా చెవిన పడ్డాయి. పిల్లవాడేమి అడుగుతున్నాడని బాబా ఆ న్యాయవాది నడిగి తెలుసుకొని ఇలా సమాధానమిచ్చారు. 'అవును నేను అందరికీ వినిపించేలా మాట్లాడతాను. నేను మౌనవిరమణ చేసి మాట్లాడినప్పుడు నా మాట గట్టిగా స్పష్టంగా వినిపిస్తుంది. కాని అది వీనులకు కాదు – హృదయానికి'.

04.07.1962 రోజు పూనా గురుప్రసాద్‌లో ఒక ప్రేమికుడు బాబా ముందు 'కొందరు ప్రేమికులు సభలు సమావేశాలు, భజనలు, సంకీర్తనలు, ఉత్సవాలు, ఊరేగింపులు నిర్వహించి బాబా నామాన్ని, సత్య ప్రేమ సందేశాలను వ్యాప్తి చేస్తూ ప్రేమను వ్యక్త పరుస్తున్నారు. మరికొందరేమో ఏ కార్యక్రమము చేయక ప్రత్యేక సందర్భాలలో తప్ప ఏ సభలకు, సమావేశాలకు హాజరు కాకుండా ఇంటి దగ్గరే ఉంటూ మిమ్మల్ని అమితంగా ప్రేమిస్తుంటారు. ఈ ఇరు వర్గాలలో ఎవరు గొప్పవారు?' అని తన సందేహం వెలిబుచ్చాడు. మందహాసంతో బాబా అతనికి అక్కడి స్థంభానికి చేరబడి కూర్చున్న ఒక ప్రేమికుని చూపిస్తూ 'అతనిని చూడండి. నన్ను హృదయపూర్వకంగా ప్రేమిస్తాడు. ఎప్పుడో కాని సభలకు, సమావేశాలకు వెళ్ళడు. అయినా అతని ప్రేమ అనన్యమైనది' అని అన్నారు. ఇంకొక వైపున గల మరొక ప్రేమికుడిని చూపిస్తూ 'అతడు తన రోగిష్ఠి దేహాన్ని కూడా లెక్క చేయకుండా అనేక గ్రామాలలోను, పట్టణాలలోను మేళాలు ఏర్పాటు చేస్తాడు. వాటి భారమంతా

తనపై వేసుకొని యువకుల సహాయంతో నా నామాన్ని, సందేశాలను వ్యాప్తి చేస్తాడు. నన్ను అమితంగా ప్రేమిస్తాడు – వారిద్దరూ నాకు సమానులే – వారిద్దరినీ నేను సమానంగా ప్రేమిస్తున్నాను' అని చెప్పారు బాబా.

## మెహెర్ విహార్

24.08.1963 రోజు బాబా ప్రేమాశీస్సులతో విజయవాడలో డా.జి.యస్.యన్. మూర్తి గారిచే స్వామి సత్యప్రకాశ్ మెహెరానంద గారి ఆధ్వర్యంలో మెహెర్ విహార్ ప్రారంభించబడి తర్వాత హైదరాబాద్‌కు మార్చబడింది. హైదరాబాద్‌లో అనేక కార్యక్రమాలు నిర్వహించడమే గాక 'దివ్యవాణి' అనే ఆంగ్ల మాసపత్రికను, 'మెహెర్ జ్యోతి' అనే తెలుగు మాసపత్రికను ప్రచురించి బాబా సాహిత్యాన్ని ఎన్నో పుస్తకాలలో తెలుగులో ప్రచురించి ఈ సంస్థ ద్వారా స్వామి సత్యప్రకాశ్ గారు ఎనలేని సేవ చేసారు.

## ప్రాక్పశ్చిమ దేశవాసుల సమ్మేళనం (1962 & 1965)

తాను ప్రపంచమంతా పర్యటించి దర్శనాలిచ్చి ప్రేమికులను మెహెరాబాద్‌కు వేర్వేరు బృందాలుగా పిలిచి వారికి తన సహవాసభాగ్యము కలిగించిన తర్వాత బాబా ప్రాక్, పశ్చిమ దేశాలలో నున్న తన ప్రేమికులను తన సమక్షంలో ఒకే పందిట్లో కలిపి తన సహవాస భాగ్యాన్ని ఇవ్వడానికి 01.11.62 నుండి 05.11.62 వరకు ఐదు రోజులు మరియు 01.05.65 నుండి 06.05.65 వరకు 6 రోజులు సమ్మేళనాలు ఏర్పరచారు. నవంబర్ 1962 మొదటి వారంలో జరిగిన మొదటి ప్రాక్పశ్చిమ సమ్మేళనం మరువరానిది. ఈ సమ్మేళనంలో యోగి శుద్ధానంద భారతి, బరోడా మహారాణి శాంతాదేవి వేదికపై బాబాకు ఇరువైపుల ఆశీనులైనారు. దేశ విదేశాల నుండి, దూర తీరాల నుండి, ప్రయాణం చేసి ప్రేమ నిండిన హృదయాలతో వచ్చిన ప్రేమిక సందోహాలతో పూనా నగరంలో ప్రేమ ప్రవాహం వెల్లి విరిసింది. సుమారు 141 మంది పాశ్చాత్య ప్రేమికులు, కొన్నివేల మంది మిగిలిన ప్రేమికులు పాలొన్నారు. అందరికీ అనిర్వచనీయమైన ఆనందాన్ని

పంచిపెట్టించిందా సమావేశం. తన ప్రేమికుల ప్రేమతో స్పందించిన ప్రేమ మూర్తి సనాతన దైవం బాబా తన ప్రేమాశీస్సుల నందరిపై వర్షింపజేసారు.

01.11.62 రోజు సాయంత్రం సహవాసం మొదటి రోజు. బాబా వర్షింపజేసిన ప్రేమ వ్యక్త రూపం దాల్చి వర్షించింది. సమ్మేళనంలో పాల్గొన్న



ప్రేమికులంతా తడిసి ముద్దయిపోయారు. కాని ఎవ్వరూ పందిరి విడిచి బయటకు వెళ్ళలేదు. ఆ సమ్మేళనంలో పాల్గొన్న బాలక్ భగవాన్ అను సాధు పురుషుడు దోసిళ్ళతో వర్షపు నీటిని త్రాగి వర్షాన్ని ఆపుజేయాలని ప్రయత్నించాడు. బాబా అతని ప్రయత్నాన్ని వారించారు. అది బాబా కురిపించిన ప్రేమ వృష్టి కదా! ఈ సమ్మేళనంలో బాబా తనను తనివి తీరా చూడటానికి అందరికీ అవకాశం కల్పించారు. ప్రాక్పశ్చిమ దేశాల్లోని ప్రేమికులు సన్నిహితమవటానికి వీలు కల్పించారు. అందరికీ ఆలింగన భాగ్యం కలుగచేసారు. బాబా సమక్షంలో భజన గీతాలు, ఖవ్వాలీ గానం చేయబడ్డాయి. కొన్నింటికి బాబా వివరణల పూర్వకంగా అర్థాలు చెప్పారు. ఆటలతో పాటలతో అందరినీ అలరింప జేసి తమ తమ కుటుంబ సమస్యలను, చింతలను మరిచి బాబా సాన్నిధ్యాన్ని, దివ్యత్వాన్ని అనుభవించడానికి మహదవకాశం లభించేటట్లు చేసారు బాబా. గంభీరోపన్యాసాల ద్వారా కాకుండా కన్న తల్లిదండ్రులు తమ బిడ్డలకు చెప్పినట్లు ఆధ్యాత్మిక విషయాలను, ప్రవచనాలను అతి సహజంగా ఆట పాటల ద్వారా హృదయాలలో చెరగని ముద్రలు వేసుకునే విధంగా చెప్పారు. 'అన్ని మతాలు దేవుడొక్కడేనని, అతడే సృష్టికి తండ్రియని ఘోషిస్తున్నాయని, ఆ తండ్రిని తానే' నని బాబా ఈ సమ్మేళనంలో స్పష్టంగా ప్రకటించారు. ఈ అవతారంలో తల్లీ, తండ్రీ

రెండూ తానొక్కడినేనని కూడా చెప్పారు.

1965 మే మాసంలో జరిపిన రెండవ ప్రాక్పశ్చిమ సహవాసంలోని మొదటి రోజు కార్యక్రమాలు పూనా సెంటర్‌లో జరుపబడ్డాయి. పూనా సెంటర్ హాలు ఒక సంవత్సరం క్రితం అనగా 01.05.64 తేదీన ప్రారంభించబడింది. బాబా స్వయంగా తన స్వహస్తాలతో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. మిగతా ఐదు రోజుల సమావేశాలు గురుప్రసాద్‌లో జరిగాయి. ఈ ప్రాక్పశ్చిమ సమావేశాలకు దాదాపు 6000 మంది ప్రేమికులు హాజరైనారు. ఆంధ్ర నుండి దాదాపు 1500 మంది ప్రేమికులు హాజరైనారు. దర్శనానికి ముందు బాబా ఈ సందేశాన్ని చదివి వినిపించారు.



'ఇంత వరకు నేను నా ప్రేమికులైన మిమ్మల్ని ఆలింగనం చేసుకుంటూ వచ్చాను. మరియు మీ ప్రేమకు నా జోహార్లు. ఇప్పుడు నేను మిమ్మల్ని ఆలింగనం చేసుకోలేను కావున మీపై గల నా ప్రేమకు మీరు వంగి నమస్కరించడానికి అనుమతినిస్తున్నాను'.

అందరు వారి శిరస్సులను బాబా పాదాలపై ఆనించి ప్రణామం చేసే అవకాశాన్ని పొందారు. ముకుళిత హస్తాలతో బాబా వారి ప్రణామాలను స్వీకరించారు. ఈ సమావేశాల్లో బాబా దర్శనం చేసుకున్న వారి సంస్కారాలన్నీ తుడిచి పెట్టి నిర్మూలింపబడ్డాయని ఇకపై ఏర్పడే సంస్కారాలకు ఎవరికి వారే బాధ్యులని బాబా ప్రకటించారు. ఎన్నో జన్మల కఠోర తపః ఫలితంగా కూడా సిద్ధించని ఇట్టి సంస్కార రాహిత్యం పొందగలిగిన ఆ ప్రేమికుల భాగ్యం వర్ణనాతీతమైనది. 1966 సంవత్సరం నుండి 1968 సంవత్సరం వరకు బాబా తన బాహ్య కార్యక్రమాన్ని తగ్గించుకొని ఏకాంతవాసాన్ని గడిపారు. అయినా

కరుణామయుడైన కారణంగా ఆర్తితో బాబా దర్శనార్థం వచ్చిన ప్రేమికులకు దర్శనం ఇస్తూ వచ్చారు. తన 74వ జన్మదినాన్ని 25.02.1968 రోజున ఘనంగా జరుపుకోవలసిందిగా బాబా ప్రేమికులందరినీ 09.02.68 రోజున ఆదేశించారు. ప్రపంచమంతటా బాబా 74వ జన్మ దినోత్సవాలను బాబా ప్రేమికులు కడు వైభవంగా జరుపుకొన్నారు. బాబా భౌతికంగా మన మధ్య ఉండగా జరుపుకొన్న ఆఖరి జన్మదిన మదే.

01.03.68 తేదీన బాబా ఏకాంతంలో చేసే పనిని గురించి తెలియజేస్తూ ఇలా అన్నారు. 'నేను ఏకాంతంలో చేసే విశ్వకార్యక్రమం గురించి ఎవరికీ కించి దవగాహన కూడా సాధ్యం కాదు. ఆ కార్యం గురించి సూచన ప్రాయంగా చెప్పాలంటే నేను ఏకాంతంలో చేసే పనితో పోలిస్తే ప్రపంచంలో అన్ని రంగాల్లో జరిగే అతి ప్రాముఖ్యమైన పనులన్నింటినీ కలిపినా అది చాలా స్వల్పమైనదిగా ఉంటుంది. ఆ పని యొక్క భారం నన్ను పిండి చేస్తున్నట్లుగా ఉన్నా దాని ఫలితాన్ని సర్వమానవాళి అనుభూతి నొందుతారు'.

13.10.1968 రోజున బాబా తన అవతార కార్యము నూటికి నూరు పాళ్ళు పూర్తి చేసానని దాని ఫలితము కూడా నూటికి నూరు పాళ్ళు ఉంటుందని అది సర్వ మానవులకు చేకూరుతుందని తెలిపారు. తాను భౌతికంగా మనమధ్యన జీవించి చేసిన కార్యక్రమాన్ని పవర్ హౌస్ నిర్మించడం, ఆ విద్యుచ్ఛక్తిని అందరికీ అందించడం కోసం వేసే లైన్లు, సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు నిర్మించడంతో పోల్చారు. ఇక కేవలం మీట నొక్కే పనిని మాత్రం అలా ఉంచానని ఆ మీట నొక్కిన క్షణంలో ఏకకాలంలోనే తనతో సంబంధం పెట్టుకొనియున్న ప్రతివారికి వారివారి అర్హతను బట్టి ఆధ్యాత్మిక ప్రయోజనం సిద్ధిస్తుందని బాబా తెలియజేసారు.

ఈ విశ్వం యొక్క భవితవ్యం తన ఏకాంతవాసం పైననూ, మానవాళి యొక్క విమోచనము తన అవతార ప్రకటీకరణ పైననూ ఆధారపడి ఉన్నాయని బాబా చెప్పారు. తన ఆంతరంగిక కార్యక్రమం వల్ల చాలా అలసిపోయానని, తన భౌతిక శరీరం తన విశ్వకార్య భారాన్ని మోయలేకుండా ఉన్నదని, విశ్రాంతి




తీసుకోవలసియున్నా తన ప్రేమికుల కోసం 1969 వ సంవత్సరం ఏప్రిల్ 10వ తేదీ నుండి జూన్ 10వ తేదీ వరకు తన దర్శనం కోసం తపిస్తున్న ప్రేమికులకు దర్శన భాగ్యం కలుగజేయడం కోసం పూనా గురుప్రసాద్‌లో (మౌనంలో) తన ఆఖరి ప్రజా దర్శనం ఇస్తానని బాబా 13.10.68 రోజున ఏర్పాటు చేసిన సమావేశంలో చెప్పారు. అన్ని చైతన్య భూమికలలో పనిచేసే తనకు తన భౌతిక శరీరం ద్వారా భౌతిక ప్రపంచంతో సంబంధాన్ని కలిగియుండటం కఠినతరమైందని దానికోసం ఎప్పుడూ తన కుడితొడపై ముష్టితో బాదుకొనాల్సి వచ్చేదని బాబా చెప్పారు. ఈ సహవాసం కోసం బాబా విస్తృతమైన ఏర్పాట్లు చేయించారు. బాబా ఆరోగ్యం గురించి వైద్యులు, మండలి వారు ఆందోళన బాధపడుతుంటే 'పడుకోనైనా నేను దర్శనమిస్తాను. నా ప్రేమికులను కలవడానికి నా ఆరోగ్యం ఎప్పుడూ అవరోధం కాదు' అన్నారు బాబా. 'నేను పడుకొని దర్శనం ఇచ్చినా చాలా శక్తివంతంగా ఉంటాన'ని చెప్పారు. ఆ దర్శనం తన మౌనంలో ఆఖరి దర్శనమని చెప్పారు. బాబా ఇంకా ఇలా చెప్పారు.

'ఇది నా ప్రేమికుల సమయం. నేను నా మౌనవిరమణ చేసినప్పుడు, నా దివ్యత్వ ప్రకటీకరణ జరిగినప్పుడు జనం తండోపతండాలుగా నా వద్దకు వస్తారు. కాని కొద్ది రోజుల పాటు నేను విశ్రాంతి తీసుకుంటాను. శారీరక శ్రమ నుండి తేరుకోవాలి. నా వద్దకు వచ్చే జనసందోహాల రద్దీకి నేను తట్టుకోవాలి గదా! నేను మౌనవిరమణ చేసినప్పుడు, నా అవతార ప్రకటీకరణ జరిగినప్పుడు ఇక దర్శన కార్యక్రమాల అవసరం ఉండదు. అందరూ అంతరంగంలో నన్ను తెలుసుకుంటారు. అప్పుడు నేను ఒక చోటు నుండి ఇంకొక చోటుకు తిరగవలసిన అవసరం ఉండదు. గత అవతారాలలో శరీర త్యాగానంతరం ప్రజలు నన్ను

పూజించారు. ఈ మారు నేను శరీరంలో ఉండగానే ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు నన్ను తెలుసుకుంటారు'.

1968 సం. డిసెంబర్ మాసంలో బాబా ఆరోగ్యం క్షీణిస్తూ వచ్చింది. రక్తం చాలా తగ్గిపోయింది. 15.12.1968 నాడు బాబాకు రక్తం ఎక్కించారు. డా.రాం గిండే బొంబాయి నుండి వచ్చి చూచి బాబా ఆరోగ్యం చాలా క్షీణించిందని చెప్పారు. 22.12.68 నాడు మెహెరా పుట్టిన రోజు జరుపుకొన్నారు. 23.12.68 తేదీన బాబా తమ్ముడు జూనియర్ ఆదీ కుమారుడైన దారాకు శత్రుఘ్న కుమార్ కూతురు అమృత్‌తో బాబా తన సమక్షంలో వివాహం జరిపించారు. నవంబర్, డిసెంబర్, జనవరి మాసాల్లో ఎందరో



ప్రేమికులకు ఎన్నో విచిత్రానుభూతులు కలిగాయి. కొందరు స్వప్నంలోను, మరికొందరు జాగరూక స్థితిలోను బాబా దర్శనం చేసుకున్నారు. బల్గేరియా నుండి అమెరికాకు వలస వచ్చి ఎన్నో కష్టాలనుభవించిన ఒక వ్యక్తికి నవంబర్ 26, 27 తేదీ రాత్రి ఒక వింత అనుభవం కలిగింది. దానినతడు బాబాకు ఒక లేఖలో వ్రాసి పంపాడు.

'ఆ రాత్రి నిద్రపోతున్న నా కన్నులు మిరుమిట్లు గొలిపే ప్రకాశంతో నిండిపోయాయి. నా యెదుట ఒక మానవ రూపం ప్రత్యక్షమై బల్గేరియా భాషలో 'నీవు భయపడకు – నన్ను గుర్తించావా?' అని అడిగింది. సమాధానంగా నేను 'గుర్తించాను – మీరు మెహెర్ బాబా' అని పలికాను. (ఆ పేరు నాకు తెలియదు. నాలుగు నెలల క్రిందట ఆ పేరు ఎవరి ద్వారానో విన్నాను గాని నాకు ప్రత్యక్షమైన రూపం మెహెర్ బాబాదే అని నేనెలా గుర్తించానో, ఆ పేరు నేనెలా చెప్పానో నాకే తెలియదు అని అతడు వ్రాసాడు) 'గట్టిగా నమ్ము. నేను నీకు సహాయం చేస్తాను' అని

చెప్పి ఆ మానవ రూపం అంతర్ధానమయ్యింది. గది అంతా చీకటి అలుముకుంది. మళ్ళీ రెండవ మారు వింత ధ్వని అయ్యింది. నా భార్యకు కూడా మెలుకువ వచ్చింది. ఈ దృశ్యంతో కలిగిన ఉద్వేగంతో తన్మయత్వంలో రెండు రోజులు విభ్రాంతుడనై యున్నాను'.

జనవరి మాసంలో బాబాను చూడటానికి పాద్రీ వచ్చాడు. ఆయన బాబాతో ఇలా అన్నాడు 'బాబా మండలి అంతా పెద్దవాళ్ళమై పోయాము. ఇంక ఈ దుకాణం మూసివేస్తే మంచిదేమో!' దానికి బదులుగా 'కాదు, ఇప్పుడే అసలు ఈ దుకాణం తెరువబడుతుంది' అని బాబా చెప్పారు.

బాబా ఆరోగ్యం గురించి ఆదుర్దా పడే మండలి వారికి తరచూ బాబా ఇలా చెప్పేవారు 'నేను ఈ శరీరాన్ని కాదు – నేను దేవుడనని మరిచిపోకండి – జరిగేది జరుగబోయేది అన్నీ నాకు తెలుసు. మానవుల బాధలను తీసుకోవడానికే ఈ మానవ శరీరం దాల్చాను. అన్నీ నా ఇచ్ఛ ప్రకారమే జరుగుతాయి'.

'నా సమయం వచ్చింది. ఇక ఏ మందులు పనిచేయవు' అని బాబా చెప్పారు. 27.01.69 నుండి బాబాకు కుదుపులు (ఈడ్పులు) ఎక్కువయ్యాయి. బొంబాయి నుండి డా. గిండేను పిలిపించారు. కాని ఆయన బాబా ఆఖరి శ్వాస వదిలిన తర్వాతనే చేరుకున్నాడు. బాబా ఇచ్ఛ ప్రకారమే అంతా జరిగి తీరుతుంది. 30.01.69 రోజు పాద్రీ వచ్చాడు. ఆయనతో బాబా 'నీ గదిలోకి వెళ్ళు. రేపు నీకు పని ఉంటుంది' అని అన్నారు. 31.01.69 రోజు బాబా శరీరంలో కుదుపులు ఎక్కువగా వచ్చాయి. పాద్రీ హోమియో మాత్రలు ఇస్తూ వచ్చాడు. 'ఈ రోజు నా శిలువ వేత' అని చెప్పారు బాబా కాని మండలి వారు ఆ మాటను తేలికగా తీసుకున్నారు. బాబా అలోబాను పిలిచి హాఫీజ్ చెప్పిన మూడు సూక్తులు వ్రాయబడి యున్న బోర్డును తెప్పించి తన దగ్గర పెట్టించారు. దానిలోని సూక్తులు ఇలా ఉన్నాయి –

1. అదృష్టవంతుడైన బానిసను తలపిస్తూ, ఎందుకు? ఏమిటి? అనే ప్రశ్నలు వేయకుండా గురువుయొక్క ఆజ్ఞలన్నిటినీ ఆచరించు.

2. నీగురువునుండి విన్న దానినెప్పుడూ తప్పని భావించవద్దు. ఎందుకంటే – ఓ ప్రేమికుడా! తప్పుగా తోచే లోపము ఆయన నవగాహన చేసుకోలేని నీ అసమర్థతలోనే ఉంది.

3. నన్ను అజ్ఞానము నుండి విముక్తుణ్ణి చేసిన నా గురువుకు నేను బానిసను. నా గురువు ఏమి చేసినా సంబంధం గల వారందరికీ అధికమైన ప్రయోజనము చేకూర్చుటకే.



31.01.1969 శుక్రవారం మధ్యాహ్నం గం. 12.15 ని.లకు ప్రియతమ అవతార్ మెహెర్ బాబా తన తుది శ్వాస విడిచి భౌతిక శరీరానికి తన విశ్వ కార్య భారం నుండి విశ్రాంతిని ప్రసాదించారు.

బాబా ఆజ్ఞ ప్రకారంగా మండలి వారు బాబా భౌతిక కాయాన్ని 31.01.69 రాత్రి 7 గంటలకు మెహెరాబాద్‌లో బాబా స్వయంగా నిర్మించుకున్న సమాధికి తీసుకొనివెళ్ళారు. బాబా భౌతిక కాయంలో మామూలు మనుషులకు మరణానంతరం కలిగే మార్పులేవీ గోచరించలేదు. 07.02.1969 వరకు ప్రేమికుల దర్శనార్థం సమాధిలో బాబా భౌతిక కాయాన్ని ఉంచారు. పాశ్చాత్య ప్రేమికులు, ప్రాగ్దేశ ప్రేమికులు ఆకాశవాణి ద్వారా ఆదీ. కె. ఇరానీ పంపిన తంతి ద్వారా బాబా అందరి హృదయాలలో శాశ్వతంగా నివసించడానికి తన భౌతిక కాయాన్ని త్యాగం చేసారనే వార్త విని బాబాను ఇకపై చూడలేము కదా అనే దిగులుతో ఆయన సుందర రూపమును, కరుణా వీక్షణాలను ఇకపై ఎలా చూడగలము, మందహాసంతో చేసే పలకరింపులను, ఇకపై ఎలా అనుభవించగలమని, వ్యయ ప్రయాసలను లెక్కించకుండా మెహెరాబాద్ చేరుకొని

దివ్య ప్రియతముని భౌతిక కాయానికి నివాళులర్పించుకున్నారు.

07.02.1969 రోజున బాబా భౌతిక కాయాన్ని ప్రియతముని ఎడబాటు భరించలేక బాధాతప్త హృదయాల నుండి ప్రతిధ్వనించిన 'అవతార్ మెహెర్ బాబా కీ జై' అనే జయజయధ్వానాల మధ్య సమాధిలో నిక్షిప్తం చేసారు. ఆ రోజు పార్శీ పంచాగం ప్రకారం బాబా జన్మదినమైనది.

బాబా తన భౌతిక కాయాన్ని త్యజించిన రోజు ఎందరికో ఎన్నో వింత సంఘటనలు, అనుభూతులు కలిగాయి. ఎందరో బాబాను భౌతికంగా చూచి దర్శించుకొనిన ఆనందానుభూతిని పొందారు.

ఆఫ్రికాదేశ తూర్పు ప్రాంతంలో గల మొంబాసా నగరంలోని బాబా ప్రేమికులు 31.01.1969 మధ్యాహ్నం గం. 12.15 ని.లకు పట్టపగలు అర్థరాత్రి వలె చీకటి అలుముకొని 'సంపూర్ణ సూర్యగ్రహణం సంభవించిందా' అన్న భ్రమ, అనుభూతి పొందారు. వారికి ఆ అనుభూతి కొన్ని నిముషాల దాకా ఉన్నది.

మహమ్మదీయులకు పవిత్ర యాత్రాస్థలమైన మక్కాలో 31.01.1969 నుండి 07.02.69 నాడు బాబా శరీరం సమాధిలో నిక్షిప్తం చేసే వరకు ఎడతెరిపి లేకుండా కుంభవృష్టి కురిసి కాబా ఆవరణ అంతా నీటితో నిండి పోయింది. ఆ ఎనిమిది రోజులు ఎవ్వరూ కాబా వద్దకు వెళ్ళే వీలులేకుండా పోయింది. మక్కా చరిత్రలోనే ఇది అపూర్వమైనది.

బాబా దివ్యత్వంలో నమ్మకం లేని పార్శీల ముఖ్య పురోహితునకు బాబా 31.01.69 రోజు ఉదయాన్నే ప్రకాశంతో పరివేష్ఠింపబడిన శిరస్సుతో తెల్ల గుర్రంపై స్వారీ చేస్తూ కనిపించి 'నేను నా మంజిల్‌కు వెళ్ళి పోతున్నాను' అని చెప్పారట. అతడు మరునాడు వచ్చి బాబాను సమాధిలో దర్శించుకున్నాడు. వెనుదిరిగి పోతూ మళ్ళీ బాబాను చూడాలనే కోరిక కలుగగా తిరిగి సమాధిలోకి చూచాడు. కాని బాబా ముఖం కనబడలేదు. వెంటనే బాబా తన శిరస్సును పైకెత్తి మందహాసంతో అతనిని పలకరించినట్లు తనకు కలిగిన అనుభూతిని చెప్పాడా పురోహితుడు.

నాగపూర్‌లో సేల్స్‌టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే ఒక గుమాస్తా 03.02.69 రోజు ఆఫీసుకు వెళ్లడానికి సిద్ధమవుతుంటే వాకిటిలో ఒక జీపు వచ్చి నిలబడింది. దానిలో నుండి బాబా కొందరితో కలిసి దిగి వారితో మాట్లాడుతున్నారు. మెహెర్ బాబా వచ్చారని కేకలు వినబడి తన పడక గదిలో నుండి వచ్చి బాబాను చూచి ఆయనకు ప్రణామం చేసాడు. బాబా అతని వైపు తిరిగి చిరునవ్వు చిందించారు. అతడు మెలకువగానే ఉన్నాడు. ఆ దృశ్యం కనుమరుగయ్యే వరకు నిజంగా బాబా వచ్చారనే నమ్మాడు.

రామభక్తుడైన డిప్యూటి కలెక్టర్ గారొకరు అలవాటు ప్రకారం 07.02.69 రోజు రాముని పటం ముందు కూర్చుని స్తోత్రం చేస్తుంటే ఆ గది అంతా అకస్మాత్తుగా ప్రకాశంతో నిండిపోయింది. అతని ముందు బాబా సాక్షాత్కరించారు. అతనికి వర్ణనాతీతమైన ఆనందం కలిగింది. భక్తితో తన్మయత్వంతో బాబా వేపు చూస్తూ ఉన్నాడు. బాబా చాలా సేపటి వరకు అతనికి వివిధ దుస్తులతో దర్శనమిచ్చారు. అతని భార్య అతనిని భోజనానికి పిలువ రాగా తన భర్త తన్మయత్వాన్ని చూసింది కాని ఆమెకు బాబా కనిపించలేదు. 'మెహెర్ బాబా అవతారుడు. ఆయనే రాముడు. ఎప్పుడూ ఉండే దేవుడు' అని చెప్పేవాడు.

బాబా పిలుపు మేరకు ఏప్రిల్ 1969 నుండి జూన్ 1969 వరకు ఏర్పాటు చేసిన దర్శన కార్యక్రమానికి ప్రాక్పశ్చిమ దేశాలనుండి ప్రేమికులు అధిక సంఖ్యలో పూనాలోని గురుప్రసాద్‌లో హాజరైనారు. 'బాబా భౌతికంగా లేరనే లోటును కూడా మరిపించే దివ్య ప్రేమానుభూతులెన్నో కలిగాయి. మన హృదయాలలోని బాబాను దర్శించడానికి ఖండాంతరాల నుండి ప్రేమికులను తాను భౌతికంగా రప్పించిన ఘనత బాబాకే చెల్లింది' అని ఫ్రాన్సిస్ బ్రాబజాన్ వర్ణించారు. 'మాయాప్రపంచం పరిధులను దాటి హృదయాలలో దివ్య ప్రియతముని దర్శించుకోవడానికి బాబా అందరికీ అవకాశాన్ని కలిగించారు. కాని మీరు కూడా ప్రారంభించిన ఈ మహా ప్రయాణంలో మీ వంతు నెరవేర్చాల్సి ఉంది. మొత్తం ప్రయాణాన్ని ప్రియతమునికే వదిలి వెయరాదు. ప్రేమికుడు వేసే ప్రతి అడుగుకు ప్రియతముడు ప్రేమికుని వైపు

10 అడుగులు వేస్తాడు. ప్రేమికుడు మాత్రం ఆ ఒక్క అడుగు ఆగకుండా వేస్తూ ప్రియతముని వైపు వెళ్ళాలి. మన హృదయంలోనే ప్రణమిల్లి ప్రియతముని నిరంతరం దర్శించుకునే అలవాటు చేసుకోవాలి. ఎప్పుడూ నిరంతరాయంగా ఆయనను దర్శించుకునే అనుభూతి కలిగే వరకు అలా చేయాల్సిందే'నని ఫ్రాన్సిస్ సూచించారు. బాబా తన దివ్య ప్రణాళికను అనుసరించి నిర్విరామంగా తన విశ్వ కార్యాన్ని అతి సహజంగా నిరాడంబరంగా నిర్వహించారు. 1925 నుండి 1954 వ సంవత్సరంలో అంతిమ ప్రకటన చేసే వరకు అనితర సాధ్యమైన పర్యటనల ద్వారా ఆయన పని అవిశ్రాంతంగా మౌనంలోనే జరిగింది. మూర్తీభవించిన ప్రేమకు నిలయమైన దివ్య సుందర వదనం నుండి చిందించే చిరునవ్వులతో దివ్య ప్రకాశము వెదజల్లుతూ మంత్ర ముగ్ధులను చేసిన ఆయన కటాక్ష వీక్షణాలకు ప్రేమికులు సూదంటు రాయిని (అయస్కాంతమును) చేరే ఇనుప రజనులా ఆకర్షింపబడి ఆయన ప్రేమను పొందే అవకాశము కలుగజేయడానికి ఆయనే స్వయంగా ప్రపంచమంతా పర్యటించారు. ఎరుకతో గాని, ఎరుక లేక కాని జన్మజన్మాల నుండి ఏర్పడిన తపనతో ప్రియతముని సాంగత్యానికై బీటలు వారిన ప్రేమిక హృదయ క్షేత్రాలలో తొలకరిలా తన ప్రేమ జల్లును వర్షింపజేసి ఊరట కలిగించి తన దరికి చేర్చుకున్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో సంక్రమించిన దివ్యానుభవాల మత్తులో పైకి ఎదగలేక బాహ్య ప్రపంచ స్మృతి కోల్పోయిన మస్తులను దరిజేర్చి, స్వయంగా సేవజేసి, వారు ఉన్నత స్థితులకు పయనించే మార్గాన్ని సుగమం చేయడమే కాకుండా వారిని తన విశ్వకార్యంలో పాల్గొనేటట్లు చేసారు. కుష్ఠురోగులకు, బీదలకు కాళ్ళు కడిగి వారి ఉద్ధరణకు విశ్వమానవ జాతిలో ప్రేరణ కలిగించారు. ఇక యావద్ప్రపంచంలోను మానవాళి గమ్యాన్ని అది భౌతికం నుండి ఆధ్యాత్మికం వైపుకు మరల్చుటకు వారిని జాగృతం చేసి వారిని సిద్ధం చేసే కార్యక్రమం ఉధృతం చేసారు. దాని పర్యవసానంగా బాబా భౌతిక శరీరంపై ఎనలేని భారం పడింది. అక్షర ఫలకాన్ని వదిలివేయడం; నెలలు, సంవత్సరాల తరబడి ఉపవాసాలు, ఏకాంతవాసాలు, చేయడం; కావాలని చేసుకున్న రెండు కారు ప్రమాదాల వల్ల కలిగిన గాయాలు; ఆ

భారాన్ని సూచించే బాహ్య ప్రక్రియలుగా మామూలు మానవులకు గోచరించే సంఘటనలు - బాబా అంతరంగిక కార్యక్రమం అవగాహన కందనిది. ఆఖరి ఘట్టంగా తన భౌతిక కాయాన్ని 31.01.69 రోజున త్యజించి తాను చేయబోయే విశ్వమానవ కళ్యాణ కార్యక్రమానికి స్థూల శరీర పరిధుల నధిగమించి సూక్ష్మ మనో లోకాల నుండి అందరినీ సన్నద్ధులను చేసే కార్యం నిర్వర్తించబూనుకున్నాడు. బాబా యుగావతారుడు. ఆయన అవతరించిన కార్యం నెరవేర్చడం, దాని ప్రయోజనాన్ని మానవాళి యావత్తుకు కలుగజేయడం ఆయన దివ్య ప్రణాళిక ప్రకారం జరిగిపోతాయనేది నిస్సందేహం, నిర్వివాదాంశం. దానికై ఆయన ఎంచుకున్న మార్గాల గురించి, ఏర్పరచుకున్న ప్రణాళికల గురించి, జరగబోయే సంఘటనల గురించి పరిమితమైన మన మనస్సులతో వ్యాఖ్యానించ యత్నించడం మన శక్తికి మించినదిగా తోస్తుంది. బాబా విశ్వకార్యం వాక్కుకు, మనుస్సుకు గోచరము కానిది కనుక బాబా దివ్యత్వంలో అచంచలమైన విశ్వాస మేర్పరచుకొని ఆయన ఇచ్ఛకే సర్వం వదిలి హృదయ పూర్వకంగా ఆయనను ప్రేమించి, అమితమైన ప్రేమతో మనకు దైవ ప్రేమను పంచడానికి వచ్చిన ఆయన ప్రేమను పొందుటయే మన కర్తవ్యం.

'నన్ను నిరంతరం హృదయ పూర్వకంగా స్మరించండి. నన్ను మీ నిత్య సహచరుడిగా చేసుకోండి. నేను మీ శ్వాస కంటే దగ్గరి వాడను' అన్నారు బాబా. బాబా తన ఆఖరి జన్మదినం కోసం జనవరి 1969లో తన భౌతిక కాయాన్ని త్యజించడానికి ముందు ఇచ్చిన ఈ క్రింది సందేశం అందరికీ శిరోధార్యమైనది.

'నేను ఏదో ఇస్తాననే ఆశతో నన్ను ప్రేమిస్తే అది ప్రేమిచడం కానే కాదు. ఏదో లబ్ధి పొందడానికి నా పనిలో చేసే త్యాగం, ఒక గుడ్డివాడు దృష్టికోసం తన పనికిరాని కళ్ళను త్యాగం జేయడం లాంటిది. నేను ప్రేమించ బడదగిన దివ్య ప్రియతముడను. ఎందుకంటే నేను మూర్తీభవించిన ప్రేమయే గనుక ఆ అవగాహనతో నన్ను ప్రేమించే వారు అపరిమితమైన దృష్టి ప్రసాదింపబడిన వారై నా నిజ స్వరూపాన్ని చూడగలుగుతారు'.

అవతార్ మెహెర్ బాబా కీ జై

## 1. విశ్వ సందేశం

(09.07.1958 – మెహెరాబాద్)

'నేను బోధించుటకు రాలేదు – మేల్కొల్పుటకు వచ్చాను. అందువలన నేనెట్టి నియమములను విధించుట లేదు.

అనాది నుండి నే ననేక నీతులను, నియమాలను (ధర్మాలను) విధించియున్నాను. కాని మానవాళి వాటిని పాటించలేదు. భగవంతుడు చెప్పినది మానవుడాచరించక పోవుట చేత అవతారుని బోధలు అపహాస్యమునకు గురియగుచున్నవి. అవతారుడు బోధించిన కరుణను ఆచరణలో పెట్టుటకు మారుగా అతని పేరుతో మానవుడు మారణ కాండను సాగించాడు. వినమ్రత, పవిత్రత, సత్యము, జీవిత మందు ఆచరించుటకు బదులుగా మానవుడు ద్వేషము, దురాశ, హింసలకు లోనగుచున్నాడు.

గతంలో భగవంతుడేర్పరచిన నీతి, ధర్మములను మానవుడు పెడచెవిన పెట్టుటచే ఈ అవతారంలో నేను మౌనం వహించియున్నాను. మీరు అడగటం, అవసరమైన మాటలు చెప్పడం జరిగింది. ఇప్పుడా మాటలను జీవితాలలో ఆచరించాల్సిన సమయమాసన్నమైనది. భగవంతునికి సన్నిహితంగా చేరుటకు 'నేను', నా యొక్క', 'నాది' అనువాటికి దూరముగా పోవలసి ఉంది. నీవు దేనిని త్యజించినవసరం లేదు. నీ స్వార్థాన్ని మాత్రం వదిలితే చాలు. అది ఎంత కఠినంగా కన్పిస్తుందో అంత సులభమైంది కూడా. పరిమితమైన నీ అహంకారం త్యజించుట నా యనుగ్రహముతో సాధ్యపడుతుంది. ఆ యనుగ్రహమును ప్రసరింపజేయుటకే నేను వచ్చియున్నాను.

నేను నియమాలను విధించుట లేదు మళ్ళీ చెప్పుచున్నాను. నేను విడుదల చేయదలచిన సత్యప్రవాహమును వదిలినప్పుడు మానవ జీవితాలు ధర్మబద్ధములై ఉంటాయి. నా మాటలు వారి జీవితాలలో జీవం పోసుకొని ప్రతిఫలిస్తాయి. మానవునకాతని అజ్ఞానమనే తెర వల్లనే నేను మరుగున పడియుంటాను. నా వైభవాన్ని కొందరికి మాత్రమే వ్యక్తం చేస్తాను. ఈనాటి నా అవతార రూపం ఈ

యుగ విభాగంలోని ఆఖరి అవతారం. అందుకే నా ప్రకటీకరణ గత అవతారాలలో కన్నా ఘనంగా ఉంటుంది. నేను నా మౌనము విరమించి నప్పుడు దాని ప్రభావం విశ్వవ్యాప్తంగా ఉంటుంది. సృష్టిలో జీవకోటి యంతా దానిని గుర్తించి, అనుభవించి, స్వీకరిస్తుంది. ప్రతివ్యక్తి తాననుసరించే మార్గాన బంధనాలనుండి స్వేచ్ఛను పొందుటకు అది సహకరిస్తుంది. ఎప్పుడూ నిన్ను నీవు ప్రేమించుకునే దాని కన్నా మిన్నగా ప్రేమించే దివ్య ప్రియతముడను నేనే. నీ నిజస్వరూపాన్ని తెలుసుకోవడానికి నీ ప్రయత్నంలో నా మౌన విరమణ నీకు సహాయపడుతుంది.

ప్రపంచంలో నెలకొన్న ఈ గందరగోళము, కల్లోల పరిస్థితులు అనివార్యమైనవే. దానికెవ్వరినీ నిందింప పనిలేదు. జరగవలసినది జరిగింది. జరగబోయేది జరిగి తీరుతుంది. నేను మీ మధ్యకు రావడం కన్నా వేరే గత్యంతరం లేకపోయింది. నేను రావలసియుండింది, వచ్చియున్నాను. నేను పురాణ పురుషుడను'.

## 2. ఉన్నతోన్నతుడు – మెహెర్ బాబా

(07.09.1953 – డెహ్రాడూన్)

'తెలిసి అయినను, తెలియక అయినను, ప్రత్యక్షముగా నయినను, పరోక్షముగా నయినను, ప్రతియొక్క జీవజంతువు, ప్రతియొక్క మానవుడు – ఏదో ఒక రూపములో – తన వ్యకిత్వమును, స్థిరీకరింప జూస్తాడు. తుదకు మానవుడు తాను అనంతుడని, శాశ్వతుడని, అవిభాజ్యుడని తెలిసి అనుభవం పొందినపుడు, అతడు పూర్ణచైతన్యముతో తన వ్యక్తిత్వముతో తానే భగవంతుడనని తెలుసుకొని, అనంత జ్ఞానశక్తి, ఆనందములను అనుభవిస్తాడు. కావున మానవుడు భగవంతుడవుతున్నాడు; పూర్ణమానవుడని, సద్గురువు అని, కుతుబ్ అని గుర్తింపబడుతున్నాడు. ఇట్టి మానవుని ఆరాధించుట భగవాదారాధనయే అవుతోంది. భగవంతుడు మానవ రూపంతో ఈ భూమి మీద ప్రభవించి ఆయన దివ్యత్వము మానవ కోటికి ప్రకటించినపుడు, ఆయన అవతార పురుషుడుగా, మెస్సయ్యగా, ప్రవక్తగా గుర్తింపబడతాడు. ఆ విధంగా భగవంతుడు మానవుడవుతున్నాడు.

యుగయుగాలలోను అనంత పరమాత్మ తన అపార కరుణతో మానవ కోటి మధ్యకు మానవుల స్థాయికి దిగి మానవ రూపంలో అవరోహణ చేయుటకు నిచ్చగించును. కానీ మానవులలో ఒకడుగా మానవ శరీరముతో వచ్చియుండి నందున సాధారణ ప్రపంచ మానవుడే అని అనుకుని మానవులు అతనిని గుర్తించలేరు. కాని ఆ యుగావతారుడుగా తన దివ్యత్వమును ప్రకటించినపుడు కొంతమంది ఆయనను భగవంతుడుగా అంగీకరించి పూజిస్తారు. భూమి మీద అవతరించిన దేవుడని తెలిసికొనిన కొద్ది మంది ఆయన మహిమను కొనియాడతారు. కాని సర్వ సాధారణముగా మిగిలిన మానవులందరూ అతడు ఇంకా శరీరధారియై యుండగానే అతనిని దుయ్యబట్టి నిందించి తిరస్కరిస్తారు.



కావున మానవుడుగా నున్న భగవంతుడు అవతారుడనని ప్రకటించుకొని తాను ఎవరికొరకు అత్యంత ప్రేమతో తన మహోన్నత స్థానము నుండి క్రిందికి దిగి వచ్చెనో ఆ మానవుల చేతులలోనే బాధలు పడుటకు, హింసింపబడుటకు, వారిచే అవమానింపబడుటకు, నిందింపబడుటకు స్వచ్ఛందంగా ఉద్యుక్తుడౌతున్నాడు. మానవులు అవతార పురుషుని నిందించినను అనంత శాశ్వత స్థితిలో నున్న భగవంతుని యొక్క అస్థిత్వమును పరోక్షంగానైనను స్థీరీకరించిన వారవుతున్నారు.

అనంతుడు, శాశ్వతుడు, అవిభాజ్యుడు అయిన భగవంతుడొక్కడే గావున మానవ రూపంలో అవతారుడిగా, మెస్సయ్యగా, ప్రవక్తగా, సనాతన పురుషుడుగా, ఉత్తమోత్తముడుగా ఉన్నప్పుడు కూడా ఒక్కడే, నిత్యుడగు అవతారుడే యుగ యుగములందు వేరువేరు మానవ రూపములతో, వివిధ నామములతో, విభిన్న ప్రదేశములందు ప్రభవించి సత్యమును విభిన్న భాషలలోనూ, స్వరూపములలోనూ

ప్రకటించి మానవుల నజ్ఞాన కూపము నుండి ఉద్ధరించి వారిని మాయాబంధ విముక్తుల గావించును.

ప్రపంచమునందు అసలైన వారి సంఖ్య చాలా చాలా తక్కువగా నున్నను సాధువులు, సన్యాసులు, మహాత్ములు, మహాపురుషులు, యోగులు, వలీలు అసంఖ్యాకముగా ఉన్నారు. నిజాయితీ గల కొద్దిమంది వారి ఆధ్యాత్మిక స్థితిని బట్టి ఒక ప్రత్యేక స్థాయిలో ఉంటారు. వారు మామూలు మానవుల స్థితిలోనూ ఉండరు. నేను మహాత్ముడనూ కాను, మహాపురుషుడనూ కాను, సాధువునూ కాను, సన్యాసినీ కాను, యోగినీ కాను, వలీని కాను – ఐశ్వర్యము కావలెనని, ఆస్తులను నిలబెట్టుకోవాలని నా దగ్గరకు వచ్చేవారు; ప్రాపంచికపు కోరికలు తీర్చుకోవాలని నా సహాయమును అర్థించేవారు – వారికి నేను సాధువును, మహాత్ముడిని, మహా పురుషుడిని, సిద్ధుని, యోగిని కానని ఇంకొక మారు చెప్పదలిచాను. ఎందుచేతంటే ఈ కోరికలతో నా వద్దకు వస్తే వారికి ఆశాభంగం కాక తప్పదు. అయినప్పటికీ ఈ ఆశాభంగం సర్వసాధారణంగా ఐహికపు కోరికలను, వాంఛలను పూర్తిగా మార్చివేయగలదు.

మార్గమధ్యమునందున్న సాధువులు, సిద్ధులు, యోగులు, ఇతరులు అద్భుతముల నొనర్చి అనేకులను ఆకర్షించి వారిని ఆశ్రయించిన వ్యక్తులు యొక్క ఐహికావసరములను తీర్చగలరు.

అయితే, నేను సాధువునీ గాక, సిద్ధుడనూ గాక, మహాత్ముడనూ గాక, యోగినీ, గాక, మహాపురుషుడనూ గాక, వలీనీ కాకపోతే ఇంక నేనెవరిని? – అనే ప్రశ్న ఉదయిస్తుంది. నేను మామూలు మనిషినయినా అయి ఉండాలి లేకపోతే సర్వోత్తమ పురుషుడనైనా అయి ఉండాలి అని సహజంగా ఊహించుకోవచ్చును. ఒక్కటి మాత్రం నేను స్పష్టంగా చెబుతున్నాను – అదేమిటంటే నేను మధ్యస్థాయిలలో నున్న నిజమైన సాధువులు, సిద్ధులు, యోగులు ఇంకా అలాంటి ఇతరులలో మాత్రం నేను ఎప్పటికీ చేర్చబడలేను.

ఇప్పుడు నేను వట్టి మామూలు మనిషినే అయితే నా సమర్థతలు, శక్తులు పరిమితంగానే ఉంటాయి. నేను మామూలు మనిషికి భిన్నమూ కాదు, అంతకంటే

ఎక్కువా కాదు. ప్రజలు నన్ను అలాగే తీసుకుంటే నావలన అద్భుతాల ద్వారాను, ఆధ్యాత్మిక సహాయ రూపంలోను, ప్రకృతి కతీతమైన అసమాన్యమైన ఉపకారం పొందుటకు ఆశించరాదు. వారికోరికలను తీర్చమని నా వద్దకు రావడం కూడా నిష్ప్రయోజనం అవుతుంది.

మరి నేను మామూలు మనిషి స్థాయి కంటె సాధువులు, సిద్ధులు, యోగుల స్థాయి కంటె ఇంకా ఎంతో పైన ఉంటే నేను ఉత్తమోత్తముడనగు సర్వేశ్వరుడనే కావాలి. అలాంటప్పుడు మీ సాధారణ మానవ బుద్ధితో నన్ను తెలుసుకుందామంటే మీ పరిమిత మనస్సుతో అర్థం చేసుకుందామంటే అంతకంటే అవివేకం ఉండబోదు. అంతకంటే అజ్ఞానం ఉండబోదు. ఎందుచేతంటే మానవ మేధస్సు ఎన్ని విధాలుగా పల్టీలు కొట్టినా, ఎంత గింజుకున్నప్పటికీ నా రీతులు అవగాహన కాబడవు; నా అనంత స్థితి నిర్ణయించబడ శక్యముగాదు.

నేను సర్వోత్తముడనే అయితే నా ఇచ్ఛయే శాసనం అవుతుంది; నా కోరిక ప్రకారం శాసనం చేయబడుతుంది. నా ప్రేమ చేతనే ఈ విశ్వం నిలుస్తుంది. బాహ్యంగా మీకు కలిగే క్లేశాలు, క్షణ భంగురాలగు మీ బాధలు – అవన్నీ మీ యొక్క అంతిమ శ్రేయస్సు కొరకు నాప్రేమ వల్లనే కలుగుతున్నాయి. కావున మీ చిక్కులు విడదీయుటకు నా దగ్గరకు రావడం, మీ ప్రాపంచిక కోరికలు తీర్చమని నన్ను కోరడం, నన్ను అసాధ్యమైన పనులు చేయమనడం అవుతుంది; నేనిది వరకు నిర్ణయించిన దానికి విరుద్ధంగా చేయమనడం అవుతుంది. మీ బాబాను నిజంగా పూర్ణమైన విశ్వాసంతో ఉత్తమోత్తముడుగా మీరు అంగీకరించినట్లయితే, క్షుద్రమైన మీ కోరికలను తీర్చమనడం కంటే, బాబా పాదముల చెంత మీ ప్రాణాలర్పించడం మీకు తగిన పని అవుతుంది. బాబా యొక్క అపరిమితమైన ప్రేమయే మిమ్ములను తప్పకుండా మీ నశ్వర జీవితపు అంధకారయుతమైన సందుగొందుల నుండి సురక్షితముగా గమ్యస్థానమును చేర్చగలదు. అందువలన బాబా వంటి సర్వోత్తముని పాదపద్మముల కడ ధారపోయుటకు మీ యొక్క ఒక్క జీవతమే గాదు, మీ జీవిత సహస్ర పరంపర త్యాగము చేసినా అది కూడా అల్పమైన త్యాగమే కాగలదు.

ఎప్పుడో ఒకప్పుడు వీడిపోవలసిన శరీరము, మనస్సు, ఆస్తులు – అన్నీ నాకు ఎవరైనా సమర్పణ చేసినప్పటికి, ఒక ప్రయోజనం కొరకు వాటిని సమర్పించినచో– శాశ్వతమైన ఆనంద ధనమును సంపాదించుటకై అశాశ్వతమైన ప్రాపంచికపు ఆస్తులను వదిలివేయ వలయునని తెలుసుకొని వాటిని సమర్పిస్తున్నారు కాబట్టి దానితో నన్ను వారు ఋణపడి ఉండేలా చేయలేరు. మీ సమర్పణ వెనుక ఇంతకంటే ఎక్కువైన (ఆధ్యాత్మిక) లాభమును పొంద వచ్చుననే కోరిక ఉన్నది కాబట్టి ఈ సమర్పణ సంపూర్ణము కాజాలదు.

నేను సర్వోత్తముడనైనచో, నా పాత్ర మీ అందరియొక్క ఆస్తులను, కోరికలను లేకుండా చేసి, మీ వాంఛలను నిర్మూలింపజేసి, మీ కోరికలను తీర్చడము కంటే మిమ్ములను వాంఛా రహితులుగా చేయవలెనని ఉద్దేశింప బడినదని మీరందరూ తెలుసుకోవాలి. సాధువులు, సిద్ధులు, యోగులు, వలీలు మీరు కోరుకున్నది యివ్వగలరు కాని నేను మీ కోరికలను తీసివేసి మిమ్ములను ఈ మమకారముల నుండి, ఈ అజ్ఞాన బంధనముల నుండి విముక్తుల గావిస్తాను. నేను మీరు కోరినప్పుడెల్లా మీరు కోరినవన్నియు మీకు ఇచ్చేవాడను గాను. నేను తీసుకొనే వాడినే. కేవలం బుద్ధిమంతులు వారి బుద్ధి ద్వారా ఎప్పటికి నన్ను అర్థం చేసుకోలేరు. నేను ఉత్తమోత్తముడనైతే బుద్ధికి నన్ను తెలుసుకొనుట దుస్సాధ్యము. పరిమితమైన మానవుని మనస్సు చేత నా అగాధమైన విధానాలను అవగాహన చేసుకోవడం సాధ్యంకాదు.

నన్ను ప్రేమిస్తూ, అత్యంత ఆశ్చర్యముతో ప్రక్కన నిలబడియున్న వారిచేత నేను తెలియబడను. నన్ను అపహాస్యము చేస్తూ నన్ను నిందించే వారి కొరకు నేను రాలేదు. కోట్ల కొలది మానవులు నా చుట్టూ మూగుట కొరకు నేను రాలేదు. జన సమూహాలలో అక్కడక్కడా ఉండి మౌనముగా, నిరాడంబరముగా వారి యొక్క తను మన ధనాలను సమస్తమును నాకు అర్పణ జేసియున్న ఎన్నిక అయిన కొద్ది మంది కొరకు నేను ఉన్నాను. నాకు సర్వమును సమర్పణ జేసి అట్టి సమర్పణ గురించి ఏమాత్రమూ ఎప్పుడూ ఆలోచించకుండా ఉన్నవారి కొరకు నేనింకా ఎక్కువగా

అటువంటి వారికొరకే ఉన్నాను. నా నుండి ఒక సైగ రాగానే, నేను ఒక్క చూపుతో చూడగానే సత్యము కొరకు వారి ప్రాణాలర్పించుటకు వారి వంతు కొరకు వేచి యుండి వెయ్యి పనుల మధ్యనున్నను అప్రమత్తులై యుండి నా కొరకు సమస్తము త్యాగము గావించామన్న భావం కూడా వదిలి వేయడానికి ఎవరైతే సిద్ధంగా ఉన్నారో వారందరూ నావారు. ఎవరూ అజేయమైన తమ ధైర్యముతో ఎటువంటి విపత్తులనైనా సంతోషముతోను, ఇష్టముతోను ఎదుర్కొంటారో, ఎవరు నా యందు అచంచలమైన విశ్వాసమును కలిగియున్నారో వారికి కష్టము కలిగినా, వారి సుఖమును పోగొట్టుకొని నా అభీష్టలేశమును నెరవేర్చుటకు ఆత్రుత పడుతున్నారో వారే నిజముగా నన్ను ప్రేమించేవారు. భగవంతునిలో నమ్మకము గాఢముగా నున్నదనుకొంటూ దైవ నిర్ణయము ప్రకారము, అతనికి విధింపబడిన బాధ్యతలను నిర్వహింపక సాధువులు, సిద్ధులు, యోగుల వెనుక పరిగెత్తి చివరకు తనకు శాశ్వత విముక్తిని కలిగింప జేయుటకే తనకు కలిగిన బాధలను నివారణ చేయమని కోరేవాని కంటే, ప్రాపంచక బాధ్యతలను, తనకు విధించిన గౌరవ విధులను ధైర్యముగాను, చక్కగాను నిర్వహించునట్టి నాస్తికుడు ఇంకా ధన్యతగాంచినవాడని నేను చెప్పగలను.

ఒక కంటితో శారీరకమగు మోహముల కొరకు చూస్తూ, ఇంకొక కంటితో శాశ్వతానంద కిరణ ప్రసారము కొరకు ఆశించుట దుస్సాధ్యమే గాక అది అత్యంత కపట వర్తన మవుతుంది కూడా.

మీరు తెలుసుకొనవలెనని నేను కోరునది అంతా ఒక్కమాటుగా మీకు అర్థమవుతుందని నేను అనుకోలేను. యుగయుగాలనుండి పరిమితాలైన మీ మనోక్షేత్రాల యందు బీజాలను నాటి అవి మీ కృషివలన మీ జాగ్రత్త వలన మొలకలెత్తి పెరిగి పండ్లు కాచే జ్ఞాన వృక్షాలగునట్లు, వాని ఫలితం మీరు పొందగలిగేలా మిమ్ములను మేల్కొల్పునట్లు చేయుట నా పనియైయున్నది.

అలా కాకుండా, అజ్ఞానముచేత మీ మార్గముననే పోవుటకు పట్టు పట్టినచో, మీరు ఎన్నుకొన్న అభివృద్ధి మార్గమును ఎవరూ నిరోధింపజాలరు. బాధాయుతము,

ఆలస్యము అయినా అది కూడా అభివృద్ధియే అవుతుంది. నేను మిమ్ము ఇప్పుడే తెలిసికొన గోరునది మీకు అసంఖ్యాకములైన జన్మలయిన తర్వాత తెలియగలదు. నిజమైన లక్ష్యము తెలియక మీ అజ్ఞానము కొలది ఆత్మకృతమైన బాధలనుండి రక్షించుకొనుటకు, ఇంకను భ్రాంతి సంజనితమైన అయోమయ స్థితిలో చిక్కుకొనకుండా రక్షించుకొనుటకు ఇప్పుడే మేలుకొనండి. అజ్ఞానమును (తత్కారణముగా వచ్చిన బాధలను) దాని నిజమైన దృక్పథముతో అనుభవించుట చేత స్వేచ్ఛకొరకు ప్రయత్నించండి.

భగవంతుని యెడల, మీ యెడల నిజాయితీతో ప్రవర్తించండి. ఎవరైనా ప్రపంచమునూ యిరుగు పొరుగు వారినీ మోసగించ వచ్చును. కాని సర్వజ్ఞుడయిన పరమేశ్వరుని ఎరుక నుండి తప్పించుకోలేరు. అది దైవ నిర్ణయం.

నా వద్దకు వచ్చే మీ కందరికీ, నన్ను ఉత్తమోత్తముడనని నమ్మి నా చెంతకు వచ్చెడి మీకు నేను స్పష్టముగా చెబుతున్నాను – మీ హృదయంలో ఐశ్వర్యం కోసం, ప్రాపంచిక లాభాల కోసం, కోరికలను పెట్టుకొని ఎప్పుడూ నా వద్దకు రావద్దు. మీ తను మన ధనాలను, మీ సమస్తమును వాటిమీద ఉన్న మమ కారములతో యిచ్చి వేయాలనెడి తీవ్రమైన వాంఛతో మాత్రము రండి. మీ చిక్కులనుండి విడదీయమని నన్ను వెదుకుతూ రావద్దు. నా ఇచ్ఛకు హృదయ పూర్వకంగా సమర్పణ మగుటకు నన్ను కనుగొనండి. ఐహిక సుఖము కొరకు క్షణభంగురమగు సదుపాయముల కొరకు నన్ను అంటిపెట్టు కొని ఉండవద్దు. కష్టమైనా, సుఖమైనా, మీ సంతోషమును, మీ సుఖమును నా పాదముల కడ త్యాగము చేసి నన్ను చేరి యుండండి. నా సుఖమే మీ సంతోషమగుగాక. నా సదుపాయమే మీకు విశ్రాంతియగుగాక.

మంచి ఉద్యోగము లభించునట్లు ఆశీర్వదించుమని నన్ను అడగకండి. కాని ఇంకా ఎక్కువ శ్రద్ధతోను, నిజాయితీతోను, ఫలాపేక్ష లేకుండా నన్ను సేవించుటకు కోరుకొండి. మీ ప్రాణములు కాని, మీకు ప్రియమైన వారి ప్రాణములు కాని రక్షించుమని నన్ను వేడుకొనవద్దు. మిమ్ము అంగీకరించి నా కొరకు మీ ప్రాణములు

నర్పించుటకు అనుమతించమని నన్ను యాచించండి. మీ శారీరక రోగములను కుదర్చమని నన్ను అడగవద్దు కాని మీ అజ్ఞానము పోగొట్టమని నన్ను ప్రార్థించండి. ఏదైనా నా వద్ద నుంచి తీసుకొనుటకు చేయి చాచవద్దు. కాని ఉత్తమోత్తముడనగు నన్ను చేరితిమని మీ చేతులెత్తి స్తోత్రం చేయండి.

నేను సర్వోత్తముడనయితే నాకు అసాధ్యమైన దేదీలేదు. వ్యక్తుల అవసరాలను తృప్తి పరచుటకు నేను అద్భుతములను చేయనప్పటికిని, అవి చేయుట వలన అశాశ్వతమైన ఈ జీవితమనే వలలో యింకా ఎక్కువగా ఆ వ్యక్తులు చిక్కుకొనునట్లు చేయుటయగును. కొన్నికొన్ని సమయముల యందు అద్భుతముల ద్వారా, సర్వ జీవరాసుల యొక్కయు మానవకోటి యెక్కయు ఆధ్యాత్మికాభ్యుదయము కొరకు మాత్రమే నా అనంతమయినశక్తిని ప్రదర్శిస్తూ ఉంటాను.

అయినప్పటికీ, నాయందు అచంచల విశ్వాసము కలిగి నన్ను ప్రేమించు వ్యక్తుల చేత అద్భుతములగు అనుభూతులు అనుభవించ బడుతూనే ఉన్నాయి. నా యొక్క కృపావిశేషమే, నా అనుగ్రహమే, నాయొక్క కటాక్ష వీక్షణమే వీటికి కారణమని చెప్పబడుతోంది. కాని అటువంటి అద్భుతానుభవాలు నా ఉన్నతోన్నత స్థితికి సంబంధింపజేయుట నా ప్రేమికులకు తగదని మిమ్ముల నందరను తెలుసుకోమని కోరుతున్నాను. నేను సర్వోత్తముడనైతే దైవనిర్ణయములో ఈ మాయా విలాసాలకు అతీతుడనై ఉన్నాను. కావున నన్ను ఆ విధంగా గుర్తించి నా ప్రేమికులకు, లేక నన్ను తెలుసుకొనకుండా ఇతర మార్గాల ద్వారా నన్ను ప్రేమించే వారికి ఏవైనా అద్భుతానుభవాలు కలిగియుంటే నాలో వారికున్న దృఢమైన నమ్మకం వల్లనే అవి కలుగుతున్నాయి. వారి అచంచల విశ్వాసం తరుచుగా మాయను అధిగమించి వారికి అద్భుతాలని చెప్పబడే అనుభవాలు కలుగచేస్తూ ఉంటుంది.

వారి దృఢవిశ్వాసము ద్వారా ఏర్పడిన అద్భుతానుభవాలు అనుభవించే వారిని ఇంకా ఎక్కువ మాయా బంధంలో చిక్కుకోకుండా చేసి తుదకు వారికి మంచినే కలిగిస్తాయి. నేను ఉత్తమోత్తముడనైతే ఒక్క క్షణంలో అందరికీ భగవత్సాక్షాత్కారము కలిగించి సృష్టియందలి ప్రతీ జీవిని అజ్ఞాన శృంఖలాలనుండి విమోచనము

కలిగించడానికి విశ్వనాథుడనైన నా ఇచ్ఛ చాలును. కాని దైవ నిర్ణయం ప్రకారం అజ్ఞానపు అనుభవాల ద్వారా సంపాదించిన జ్ఞానం ధన్యమైనది. అజ్ఞానం మధ్యలోనే ఈ జ్ఞానం పొందడానికి సద్గురువు యొక్క సహాయము చేతను, సర్వోత్తమునికి చేసే సమర్పణ ద్వారాను సాధ్యమవుతోంది.

## 3. ఆంధ్ర పర్యటనలో బాబా ఇచ్చిన సందేశాలు

(21.02.54 – విజయవాడ)

1. 'మనసు చెప్పిన మాట వినవద్దు. హృదయం చెప్పేదే చెవి యొగ్గి విను. మనస్సు చలిస్తుంది – హృదయం చలించదు. మనస్సు భయపడుతుంది – హృదయం స్థైర్యం కలిగియుంటుంది. మనస్సు సందేహాలకు, తర్కాలకు, సిద్ధాంతాలకు పుట్టినిల్లు – పరిశుద్ధమైన హృదయం ప్రియతముని నివాస స్థానం అవుతుంది. కావున నీచమైన కోరికలను, దుష్కృత్యాలు చేయడానికి ప్రేరణలను, స్వార్థ పరత్వమును పోనాడినచో భగవంతుడు నీలో, నీ ఆత్మలో సాక్షాత్కరించ గలడు'.

2. 'పేదవాడవైనా, భాగ్యవంతుడవైనా, సుఖంగా ఉన్నా, దుఃఖంగా ఉన్నా నీకు కలిగిన దానితో సంతృప్తి పడాలి. అది భగవంతుడు నీ మంచికే కల్పించాడని తెలుసుకొని ఆయన ఇచ్ఛకు అంతా వదిలివేసి నిశ్చింతగా ఉండు. నీవు శాశ్వతంగా ఉన్నావు. నీవు ఎల్లప్పుడూ ఉందువు. నీవు అనేక రూపాలలో స్త్రీగాను, పురుషుడుగాను, రూపసిగాను, కురూపిగాను, బలవంతుడవుగాను, బలహీనుడవుగాను, ఆరోగ్యవంతుడవుగాను, రోగగ్రస్తుడవుగాను, శక్తివంతుడవుగాను, నిస్సహాయుడవుగాను అనేక విధాలుగా అనేక జన్మలెత్తి ఇప్పుడు అటువంటిదే ఏదో ఒక రకమైన మరొక శరీరంతో పుట్టియున్నావు'.

'నీవు ఆధ్యాత్మిక స్వేచ్ఛ బడయునంత వరకు, ఇంకను అనేకమైన ఇతర రూపాలతో జన్మించాల్సి ఉంది. కావున ఇంకా నీవు ఇహలోక బంధాలనెక్కువ జేసే తాత్కాలిక ఉపశమనాల కోసం అన్వేషింపనేల? ధనము, కీర్తి, పదవి, ఆరోగ్యము,

సంతానము ఇత్యాదుల కోసము దేవుని కోరవద్దు. ఆయన యొక్క ప్రేమను, ఆయన యొక్క అనుగ్రహము కోరుకోవాలి. అవి నీకు శాశ్వతానందం కలుగజేస్తాయి'.

3. 'భాగ్యవంతులలో నేను అందరికన్నా భాగ్యవంతుడను. నేను బీదవారిలో అందరి కన్నా బీదవాడిని. చదువుకున్న వారిలో నేను అందరి కన్నా పండితుడను. నేను మీ వాడను: మీ తోడి వాడను: మీలో నొక్కడను, మనమందరమూ ఒక్కటే. ఈ ఏకత్వమును పొందుటకు హృదయ పూర్వకంగా నిజాయితీతో భగవంతుని ప్రేమించు. నీవు పరమ ప్రేమ కొరకు సర్వము త్యాగము చేసినచో ప్రియతముని నీలోనే నీవు కనుగొనగలవు'.

## 4. భగవంతుని ప్రేమించుట యెట్లు?

(12.09.1954 – అహమద్‌నగర్)

'మన తోటి మానవులను ప్రేమించుటయే భగవంతుని ప్రేమించుట. మన ఆత్మీయుల పట్ల మనకెట్టి సద్భావం ఉండునో ఇతరుల పట్ల కూడా అట్టి భావమే యున్నచో మనము భగవంతుని ప్రేమించుచున్నట్లే'.

'పరుల దోషము లెంచుటకు మారుగా మనలో నున్న దోషములను పరికించినచో మనము భగవంతుని ప్రేమించుచున్నట్లే'.

'మన సహాయమునకై పరులను దోచుకొనుటకు మారుగా పరుల సహాయమునకై మన స్వార్థములనే దోచి పెట్టినచో మనము భగవంతుని ప్రేమించుచున్నట్లే'.



'పరుల కష్టములలో కష్టానుభూతిని, పరుల సుఖములలో సుఖానుభూతిని పొందినచో మనము భగవంతుని ప్రేమించుచున్నట్లే'.

‘మన స్వీయ దుర్దశలను గూర్చి వాపోవుటకు మారుగా మనమెందరెందరి కంటేనో మిక్కిలి అదృష్టవంతులమని భావించినచో మనము భగవంతుని ప్రేమించుచున్నట్లే’.

‘మనకు ప్రాప్తించినది ఈశ్వరేచ్ఛగా అంగీకరించుచు అద్దానిని ఓర్మితో, సంతృప్తితో సహించుకొన్నచో మనము భగవంతుని ప్రేమించుచున్నట్లే’.

‘మనము భగవంతుని ప్రేమించవలసిన రీతిగా ప్రేమించ వలెనన్నచో భగవంతుని ప్రేమించుటయే జీవిత గమ్యమని ఎఱింగి మనము భగవంతుని కొరకే జీవించవలెను; భగవంతుని కొరకే మరణించవలెను. అప్పుడు మనమే పరమాత్మగా వానిని కనుగొందుము’.

## 5. మెహెర్ బాబా పిలుపు

(12.09.1954 – అహమ్మద్‌నగర్)

‘యుగయుగాంతరాలలో ధర్మజ్యోతియొక్క ప్రకాశము తగ్గిపోతున్నప్పుడు సత్య ప్రేమ దీపికను మరల వెలుగొందజేయుటకు భగవంతుడు పదే పదే అవతరిస్తున్నాడు. యుగయుగాంతరములందు కలుగుతూ ఉండే ప్రజా సంఘర్షణలకు, యుద్ధాలకు, భయోత్పాతములకు, భీభత్సమైన కృత్యాలకు సంబంధించిన నినాదాల మధ్య ‘అందరూ నా వద్దకు రండి’ అనే అవతార పురుషుని పిలుపు మారుమ్రోగుతూనే ఉంది’.

‘మాయావరం ఫలితంగా పురాణపురుషుని ఈ పిలుపు అరణ్యరోదనం వలె కనిపించినా కాలక్రమంలో దాని మార్మోతలు ప్రతిధ్వనులు దేశ కాలములను ఆవరించి ప్రారంభములో స్వల్ప సంఖ్యాకులకు రానురాను లక్షలాది ప్రజలకు మాయాసుషుప్తి నుండి జాగృతిని కల్గించగలిగి ఉంటుంది. మరియు ఈ పిలుపు ప్రజావాణికి అతీతమైన దివ్యవాణిగా నేర్పడి మానవుల మధ్య అవతరించిన భగవంతుని గుర్తించేటందుకై మాయలో చిక్కుకున్న ప్రజలను అది మేల్కొల్పగలిగి ఉంటుంది’.

‘తరుణం సమీపించింది. నేను పిలుస్తున్నాను. అందరినీ నా వద్దకు రమ్మని ఆజ్ఞాపించుతున్నాను. కాలానుగుణ్యంగా నేను పిలిచే ఈ పిలుపు భగవత్ప్రేమ కోసమే. భగవంతుని ప్రేమించి ఆ ప్రేమ కోసమే ప్రశాంత చిత్తులై సమస్తాన్ని ఓర్చుకోగలిగిన వారి హృదయాలకు ఆహ్లాదాన్ని సంచలనాన్ని కలిగిస్తుంది. కాని తత్సంబంధములైన ధ్వని ప్రతిధ్వనులు విని భయకంపితు లైనవారు. పారిపోయేవారు దానిని తమదరికి రానీయనివారు కొందరున్నారు. ఆర్త రక్షకుడును, పరమేష్టియునైన అవతార పురుషుడు మానవకోటిని ఈ విధంగా ఆహ్వానింప వలసిన అవసరం ఎలా కలిగిందో తెలిసికొనలేక చిక్కుపడే వారు మరి కొందరున్నారు’.

‘ప్రజల సందేహాలతో, విశ్వాసాలతో నాకు సంబంధము లేకుండా మానవునకు సత్యాసత్య వివేకము కలిగించి అజ్ఞానులగు మానవ కోటిచే మాటిమాటికి విమర్శింప బడేటందుకై సర్వమానవుల యందు నాకున్నట్టి అనంత ప్రేమకు ఫలితంగా నేను అవతార పురుషుని రూపంలో వస్తూనే ఉన్నాను. పురాణ పురుషునికి సహజ సిద్ధమైన యదార్థ నమ్ర భావం అనే ముసుగులే మరుగు పడి ఉండటం చేత అతని దివ్య ఆహ్వానం ప్రారంభ దశలో నిర్లక్ష్య భావంతో చూడబడుతుంది. కాని అది అనంతశక్తి కలదవుట చేత సత్యవస్తువు యొక్క వాణిగా లెక్కలేని మానవ హృదయాలయందు అది ప్రతిధ్వనించేటందుకు ప్రారంభమై అధికాధికంగా ప్రతిధ్వనిస్తూ మహత్తరంగా వ్యాప్తి నొందుతుంది’.

‘శక్తిమంతునికి సహజమైన నమ్రభావం కలుగుతుంది. శక్తిహీనునికి కృత్రిమమైన నమ్రభావం కలుగుతుంది. యదార్థమగు శక్తిమంతుడు సహజ నమ్రతతో కూడి ఉంటాడు. ‘వాస్తవంగా మహిమ కలిగిన ఒక వ్యక్తి తన గొప్పదనాన్ని తానే చెప్పినప్పుడు అది తన సహజ నమ్రతను వెల్లడించడమే అవుతుంది. మానవుడైన వాడు తన మానవత్వం పట్ల తనకు విశ్వాసం కలిగి ఇతరులను కూడా అలా విశ్వసింప చేయడానికి ఎలా వెనుకాడడో మహిమ కలవాడు సహజ సిద్ధమైన తన మహత్యాన్ని తాను తెలుసుకొంటూ ఇతరులకు కూడా అది తెలుపడానికి వెనుకాడడు’.

'తాను యదార్థ మహిమను కలిగియున్నట్లు తెలిసి కొన్న వాణ్ణి మహత్వం లేని వానిగా మనం ప్రకటించినప్పుడు నిస్సందేహంగా వాని గొప్పతనాన్ని మనం దించినట్లే అవుతుంది. ఎందుకంటే – కృతిమంగా నమ్రభావం వేషధారణతో కూడి ఉంటుంది గాని యదార్థ మహత్వానికి వేషధారణతో పని లేదు. అలా కాకుండా తనకు మహత్వం లేదని స్వానుభవంచే తెలిసియుండి కూడా మహత్వం కలవానిగా ప్రకటించుకునే మానవుడు గొప్ప కపట ప్రవర్తనుడు అవుతున్నాడు'.

'తనకు మహిమ లేనప్పుడు మహిమ లేదనే సంగతి స్వానుభవం వలన తెలుసు కొని ఆ విషయాన్ని నిశ్చయంగా, స్పష్టంగా వెల్లడించేవాడు సత్యవాది అవుతున్నాడు. గొప్పతనం లేని వారు కొందరేమిటి? చాలా మంది ఉన్నారు. కాని వారు తమలో గొప్పతనమున్నట్లు నిజంగానే నమ్ముకొని నమ్రతను వహిస్తూ ఉంటారు. కాని మానవ సేవా పరాయణుల మని చెప్పుకుంటూ తమ నమ్రభావాన్ని పదే పదే మాటల రూపంలోను, క్రియా రూపంలోను ప్రకటిస్తూ ఉంటారు. నమ్రభావం నటించి నందు వలన నిజమైన నమ్రభావం కలుగనేరదు. యదార్థ మహిమ కలవారి మహత్వ శక్తి చేతనే సహజ నమ్ర భావం నిరంతరం సహజంగానే ఉదయిస్తుంది. తన నమ్రతను గురించి తానే చెప్పుకునే వాడికి (ఆత్మస్తుతి) నమ్రభావం కలగనే కలుగదు. 'నేను మానవుడను' అని ఒక చిలుక ఎంత మొత్తుకున్నా అది మానవుడు కాజాలదు. కృత్రిమ నమ్రభావం వహించి లేని గొప్పతనాన్ని స్థిరపరుచుకోవటం కంటే గొప్పతనం లేకపోటమే మంచిది. ఇలా మానవుడు తనకు నమ్రభావం కలిగేటందుకు చేసే ప్రయత్నం అతని శక్తి సామర్థ్యాలను ప్రకటించలేవు సరికదా, మీదు మిక్కిలి తనకు సత్య వస్తు జ్ఞానము లేక పోవటం చేత కలిగే దౌర్బల్యానికి ఫలితంగా ఉదయించే కృతిమ నమ్రభావాన్ని అవి ప్రకటిస్తున్నాయి. కృతిమ నమ్రభావం కలుగకుండా జాగ్రత్త వహించండి. కృతిమ నమ్రభావం, సహజ నమ్రభావం యొక్క వేషాన్ని ధరించి ఆత్మవంచన మనే వలలో మానవుడు చిక్కుపడేటట్లు చేస్తుంది. కృతిమ నమ్రభావం వలన అహంకారం ఉదయించటంచే దానికి ఫలితంగా మానవుడు స్వాతిశయానికి లొంగిపోతున్నాడు. మహత్తరమైన గొప్పదనం, మహత్తరమైన నమ్రభావం ఒకదానితో నొకటి

అవినాభావ సంబంధం కలిగి అవి రెండునూ సహజంగా అప్రయత్నంగా ఉదయిసున్నాయి’.

‘అందరికంటే మహాఘనుడైన వాడు ‘నేను మహా ఘనుడను’ అని చెప్పినప్పుడు అది అమోఘమగు సత్యమునకు సంబంధించిన అప్రయత్నమగు వచనమే అవుతుంది. అతని గొప్పదనం యొక్క శక్తి శారీరకంగాను, మానసికంగాను బలహీనుల వలన తాను అపహాస్యం చేయబడినప్పుడును, పీడించబడినప్పుడును, హింసింపబడినప్పుడును గోచరిస్తుంది కాని మరణించిన వారిని బ్రతికించటంలో గోచరించదు’.

‘మానవాళి తానింతకు ముందు తెలిసికొనియున్న పాత ప్రమాణాలను ఆధారం చేసుకొని అవతార పురుషుని దివ్యస్వభావాన్ని విమర్శించడం వలన అతని సహజ నమ్రభావం యొక్క యదార్థమగు గంభీర స్థితిని యుగ యుగాంతరముల నుండి అది తెలిసికొన లేకపోతుంది. సత్యవస్తు జ్ఞానం కొంతవరకు కలిగియున్న ఋషులు, సాధువులు కూడా అవతార పురుషుని యదార్థ నమ్రభావాన్ని ప్రత్యక్షంగా చూచి కూడా అతని మహత్వాన్ని తెలిసికొన లేక పోతున్నారు’.

‘చరిత్ర పునరావృతమవుతుందనే సామెతగా లోకమందలి స్త్రీ పురుషులు అజ్ఞానానికి, సంకుచితస్వభావానికి, గర్వానికి వశులై తాను భగవంతుడనని చెబుతున్న మానవ రూపధారియైన భగవంతుని (అవతార పురుషుని) యొక్క సత్యవాక్కులు తమకు బోధపడనందున, అట్టివారిని తమకు తోచినట్లుగా విమర్శించుతూ చివరి కతడు శిక్షార్హుడనే ప్రతియుగంలోను తీర్మానించుతున్నారు. కాని అతడు నింద, పీడనములను లెక్కచేయడు. ఎందుచేతనంటే – అతడు కరుణాసముద్రుడు అవటంచే సర్వమును అవగతం చేసుకుంటున్నాడు; సత్య వస్తువు యొక్క నిరంతర స్వానుభవంచే వారల సంకల్పాలను తెలిసికొంటున్నాడు; అతని అనంత స్వభావం గల అనుగ్రహ ఫలితంగా వారలను క్షమిస్తున్నాడు’.

‘సర్వమూ భగవంతుడే; సర్వాన్ని తెలుసుకునే వాడు భగవంతుడే; సర్వాన్ని నడపే వాడు భగవంతుడే. తాను సనాతన పరమాత్ముడనని, అవతార పురుషుడు,

ప్రకటించినప్పుడు అట్టి ప్రకటన భూలోకంలో అవతరించిన భగవంతుని ప్రకటనే అవుతుంది. అవతార తత్వాన్ని గూర్చి అనుకూలంగా గాని ప్రతికూలంగా గాని మానవుడు ప్రసంగించునప్పుడు వాని ద్వారా అలా భగవంతుడు తనను గూర్చి తాను చెప్పుకుంటున్నాడు. అవతార పురుషుని ద్వారా మానవకోటి ద్వారా కూడా భగవంతుడే తనను తాను ప్రకటించుకుంటున్నాడు'.

'మీరు నేను కలిసి 'మనం' అవుతున్నామని చెప్పటం సరికాదని, ఒకటే యని చెప్పుట సరియైనదని నా భగవధికారమును అనుసరించి నేను మీకందరకూ చెబుతున్నాను. మీకు తెలియకుండానే నా అవతార తత్వాన్ని మీలో మీరు అనుభవిస్తున్నారు. మీలో ప్రతి వ్యక్తి ఏది అనుభవిస్తున్నాడో నేను అదే ధ్యాన పూర్వకంగా అనుభవిస్తున్నాను. ఇలా ప్రతి వ్యక్తి ఇప్పటికీ ఎప్పటికీ కూడా ఒకే వ్యక్తిత్వం, ఒకే వస్తు తత్వం అవుతుందనే అర్థంలో మనలో ప్రతివ్యక్తి అవతార పురుషుడే అవుతున్నాడు. భగవంతుడు తప్ప వేరొక పదార్థమే లేదు. అతనొక్కడే సత్య వస్తువు. సత్య వస్తువు యొక్క అఖండమైన ఏకత్వం ననుసరించి మనమందరమూ ఏకతత్వమే అవుతున్నాము. భగవదైక్యము నొందిన వ్యక్తి 'నేను భవగంతుడను, మీరు భగవంతులే; మనమందరం ఒక్కటే' అని చెప్పి ఈ ఏకత్వ జ్ఞానము మాయా బద్ధులగు జీవాత్మలకు కలిగించినప్పుడు – పిన్న,పెద్దా, పేదా, ధనికులు, వినయ వంతుడు, వినయ వేషధారి, మంచి చెడ్డా అనే భేదమునకు సంబంధించిన ప్రశ్నే అంతరించి పోతుంది. మానవునకు కలిగే విద్యారూపమైన ద్వైత జ్ఞానమే అతనికి భేద బుద్ధిని కలిగించి వస్తువుల యొక్క భిన్నత్వాలను తరగతులుగా నిరూపిస్తుంది'.

'నా నిత్య నిరంతర సత్య వస్తువు అనుభవాన్ని అనుసరించి ప్రపంచము నందలి ధనికులకు, పేదలకు ఎట్టి భేదము లేదని నేను మాటిమాటికి నొక్కి వక్కాణిస్తున్నాను. సంపదకు, దారిద్ర్యానికి గల భేదాన్ని నేను గమనిస్తున్నా ననేది ప్రశ్న కలిగి నప్పుడు – ప్రపంచ సంపద కలిగియున్నా .... ఎవరికి భగ్రవత్ప్రేమ అనే సంపద లేదో అట్టి ధనికుని దరిద్రునిగానే నేను భావిస్తున్నానని తెలుసుకొనాలి. మరి ప్రపంచ సంపద

బొత్తిగా లేకపోయినా భగవత్ప్రేమ అనే అమూల్య పెన్నిధిని ఎవరు కలిగి యుంటారో అతడు నిజంగా ధనవంతుడే అవుతున్నాడు. అతని ధనహీనత ప్రభువులకు కూడా మాత్సర్యాన్ని కలిగించి ప్రభువులకు ప్రభువైన భగవంతుని కూడా అతనికి బానిసను చేస్తుంది. కనుక భగవంతుని దృష్టియందు ధనికునికి, పేదవానికి గల భేదము వారివారి సంపద, దారిద్ర్యాలను అనుసరించి గాక భగవంతుని పొందాలనే వారి కోరికలో గల తీవ్రతకును – సరళ భావనకును గల తారతమ్యమును అనుసరించి ఉంటుంది'.

'నశించే లక్షణము గల ప్రపంచానికి ఆధార భూతమైన పరిమిత లక్షణము కల అహంకారము యొక్క మిథ్యాస్వభావాన్ని భగవత్ప్రేమ ఒక్కటే నిర్మూలించగలదు. సద్వస్తువు యొక్క శాశ్వత స్థితికి ఆధారభూతమైన మానవుని అపరిమిత లక్షణము గల అహంభావము నేను భగవంతుడను అనే నిజమైన భావం' యొక్క నిజతత్వాన్ని భగవత్ప్రేమ ఒక్కటే మనకు అనుభవాన్ని కలిగించగలదు. సద్వస్తువు యొక్క శాశ్వత స్థితికి ఆధార భూతమైన దివ్య అహం నిత్యమూ స్వయంప్రకటితమౌతూనే ఉంటుంది. కాని తనను అజ్ఞానం ఆవరించుట చేత మానవుడు తన అఖంధ అహం భావాన్ని; పరిమితము, ప్రత్యేకము అయినట్టి అహంకారంగానే భావించి దానిని అలాగే అనుభవిస్తూ ప్రకటిస్తూ ఉంటాడు'.

'సత్యవస్తువు యొక్క ఏకత్వం అనంతత్వంగా సర్వత్రా వ్యాపించియున్నదని నా యొక్క భగవదధికార పూర్వకంగా నేను చెబుతున్నాను. అందువలన 'మనమందరమూ ఒకటే' అనే వాక్యంలో 'మనము' అనే మాటకు అనంత, అఖండ ఏకత్వ స్థితియందు స్థానం లేదు. ఇది మీరు గమనించాలి. మీరు మాయా సుషుప్తి నుండి మేలుకొనండి. భగవదవతారమే గాక చీమ, పిచ్చుక, మీరందరూ కూడా అఖండ ఏకత్వ స్థితి ననుసరించి – భగవంతుడే అన్న సంగతిని ఇప్పుడు మీరు తెలుసుకోవాలి. తేడా ఏదైనా ఉంటే .... అది చైతన్యము యొక్క వివిధ అవస్థల తారతమ్యమే యని గ్రహించాలి. పిచ్చుక అనుబడేది పిచ్చుక కాదని అవతార పురుషునికి తెలుసు కాని పిచ్చుకకు ఆ సంగతి తెలియదు. తన అజ్ఞాన స్థితి కూడా

తనకు తెలియనందున పిచ్చుక తనను పిచ్చుకగానే తెలుసు కొంటుంది'.

'మీరు అజ్ఞాన జీవితం గడప వద్దు. మీ తోటి మానవులను విమర్శిస్తూ వాళ్ళలో కనిపించే తేడాలను గమనిస్తూ అమూల్యమైన క్షణభంగురము అగు మీ జీవితాన్ని వృధా చేయకండి. భగవత్ప్రేమను కోరడమే మీరు నేర్చుకొనాలి. మీ లోక ధర్మాలను నిర్వహించుకొంటూ మీ ప్రియతముడగు భగవంతునితో మీకు గల యదార్థమగు ఏకత్వాన్ని తెలుసుకొనడానికి అనుభవించడానికి మాత్రమే మీరు జీవించి యుండాలి'.

'నిష్కళంకము, నిరాడంబరము అగు జీవితం కలిగి ఉండండి. అందరూ ఏకతత్త్వమే (భగవంతుడే) గనుక అందరినీ ప్రేమించండి. సరళము, నిష్కపటము గల జీవితము కలవారై మీ పట్ల మీరు ధర్మసమ్మతంగా ప్రవర్తించాలి. కృత్రిమ నమ్రభావం నుండి నిజాయితీ మిమ్మల్ని కాపాడుతుంది. సహజ నమ్రభావం యొక్క శక్తిని కలిగిస్తుంది. పరోపకారానికి మీరు ఎన్ని కష్టాలైనా పడాలి. అందుకు భగవత్ప్రేమను తప్ప ప్రతిఫలంగా మరేమీ కోరవద్దు. నిజాయితీగా తీవ్రతరంగా ఈ భగవత్ప్రేమ అనే వరాన్ని మీరు కోరుకోవాలి. అప్పుడు మీరు కోరుకున్న దాని కంటే అధిక తరంగా ప్రేమ ప్రసాదాన్ని నేను ప్రసాదించ గలనని నా ఈశ్వరీయ యోగ్యతను అనుసరించి నేను మీకు వాగ్దానం చేస్తున్నాను'.

'నా దివ్య ప్రేమ కణం భగవత్ప్రేమ ప్రాప్తికై మీ హృదయాల్లో గాఢమైన ఉత్కంఠను పాదుగొల్పు నిమిత్తమై మీ కందరకూ నా ఆశీస్సులను ప్రసాదిస్తున్నాను'.


## 6. నా వాంఛితము

(24.05.1958 – మిర్టిల్ బీచ్ – అమెరికా)

ప్రేమికుడు తన ప్రియతముని వాంఛితమును నెరవేర్చవలెను. నా ప్రేమికులకు నా వాంఛితమును ఈ క్రింది విధముగా తెలియపరచుచున్నాను.

1. మీ బాధ్యతల నుండి మీరు తప్పించు కొనవద్దు.

2. మీ ప్రాపంచిక విద్యుక్త ధర్మములను విశ్వాసముతో నిర్వహించవలెను. కాని



ఇది అంతయూ బాబాదే అని మీ మనస్సు నందు ఎల్లప్పుడు ఉంచుకోవాలి.

3. నీకు ఆనందము కలిగినప్పుడు బాబా నన్ను ఆనందింప జేయగోరుచున్నాడు అనియు, దుఃఖము కలిగినప్పుడు బాబా నన్ను దుఃఖింప గోరుచున్నాడు అనియు భావించుము.

4. ఎట్టి పరిస్థితులలోనైనా బాబా నన్ను ఈ స్థితిలో ఉంచదలచినాడు అని నిజాయితీతో విశ్వసింపుడు.

5. బాబా అందరిలోను ఉన్నారనే భావన కలిగియుండి ఇతరులకు సహాయ పడుతూ సేవలందించుడు.

6. నేను నా దివ్యాధికారముతో మీకందరకు చెప్పునదేమనగా ఎవ్వరైననూ నా నామము తమ అవసానకాలమందు స్మరించిన వారు నన్ను చేరుకొందురు. కనుక మీ మరణ సమయమందు నన్ను స్మరించుట మరువకుడు. ఈ క్షణము నుంచి నన్ను స్మరించుట ఆరంభించనిదే అంత్యకాలమందు నన్ను స్మరించుట దుర్లభము. కనీసము రోజు కొక్కమారైనను నా నామము స్మరించిన మీ మరణ సమయమందు నన్ను గుర్తుంచుకొనుట సాధ్యమగును.

## 6ఎ. సప్త సత్యములు

1. యదార్థ అస్థిత్వము : అనంత పరమాత్మ అయిన ఒకే ఒక భగవంతుడు అన్ని వ్యక్తాత్మలలో స్థిరమై ఉన్నాడు.

2. యదార్థ ప్రేమ : ఈ అనంత పరమాత్మను దర్శించి, తెలుసుకొని, ఆ ఏకైక

సత్యముతో ఒకటి కావాలనే తీవ్ర తపనను కలిగి యుండటం.

3. యదార్థ త్యాగము : ఈ యదార్థ ప్రేమ ద్వారా పరిమిత శరీరాన్ని, మనస్సును, హోదాను వ్యక్తిగత సంక్షేమాన్ని మరియు జీవిత సర్వాన్ని త్యాగం చేయడము.

4. యదార్థ సన్యాసము : ప్రాపంచిక కార్యకలాపాల విధి నిర్వహణలో మునిగి యుండి కూడా స్వార్థపూరిత ఆలోచనలను, కోరికలను సన్యసించడం.

5. యదార్థ జ్ఞానము : సజ్జనులు, దుర్జనులు, సాధువులు, పాపాత్ములు – అందరిలో నున్న పరమాత్మ ఒక్కడేనన్న జ్ఞానాన్ని కలిగియుండటం. ఈ జ్ఞానము కొరకై ఎట్టి లాభాపేక్షా లేకుండా పరిస్థితుల కనుగుణంగా అందరకూ సహాయపడుతూ, ఒక వివాదంలో తప్పని సరి పరిస్థితులలో చిక్కుకొన్నప్పుడు ఎదుటి వానిపై ద్వేషభావము, ఎట్టి శత్రుత్వము లేకుండా ఉంటూ, ఇతరులను సోదర భావంతో చూస్తూ, వారిని ఆనంద పరుస్తూ, నీకు హాని కలిగించిన వారికి కూడా నీ మనోవాక్కాయకర్మల ద్వారా ఎట్టిహానినీ కలిగించకపోవడం.

6. యదార్థ నిగ్రహము : నిమ్న స్థాయికి చెందిన కోరికలను దరి చేర నీయక సంపూర్ణ పవిత్ర సౌశీల్యాన్ని కలిగియుండటం.

7. యదార్థ శరణాగతి : ఎట్టి విపత్కరమైన ఆందోళనకర పరిస్థితులలోను కలత నొందక, ఆందోళన చెందక స్థిరతను కలిగియుండి సంపూర్ణ ప్రశాంతతో భగవత్సంకల్పానికి అంకితమై ఉండటం.

## 7. కొవ్వూరు మెహెర్‌స్థాన్ ప్రారంభానికి ఇచ్చిన (8) సూక్తులు

(28.02.1963 – మెహెరాబాద్)

1963 సంవత్సరం ఫిబ్రవరి 28 తేదీన కొవ్వూరు మెహెర్ స్థాన్ కేంద్ర ప్రారంభోత్సవ సమయానికి బాబా పంపించిన సందేశాలు :



1. సాంప్రదాయ సిద్ధంగా ఆచరించ బడుతున్న కర్మకాండల యొక్క అడ్డు తెరలు ఛేదించినట్లయితే పూజింప బడేవాడను, పూజను, పూజించేవాడను నేనే అని మీరు కనుగొంటారు.

2. సామాన్యమైన పూజను కర్మకాండల చేత నింపడం అంటే నన్ను అజ్ఞానమనే చలి గాడ్పులకు గురి చేసి వదిలి వేయడమే అన్న మాట.

3. విశ్వాసంతో దైవ మానవుని ప్రేమించడం అంటే దైవాన్ని నిజంగా ఆరాధించడమే.

4. మెహెర్‌స్థాన్‌లో నన్ను ఇక్కడ కనుగొనడానికి మీ హృదయపు లోతులను శోధించుకోవాలి.

5. మెహెర్ స్థాన్ నా కోసం ప్రేమతో నిర్మింపబడింది. కాని నా ప్రేమికుడు నన్ను తన హృదయంలో నుంచుకొని ఇక్కడకు తీసుకొని వస్తేనే నేను ఇక్కడ అతనికి గోచరిస్తాను.

6. హృదయం ఎలా ఉందో సదనం అలా ఉంటుంది. కన్ను ఎలా ఉందో ఈ నిలయంలో ప్రతిమ కూడా అలాగే కన్పిస్తుంది.

7. సనాతన పురుషుని ఆరాధనకు మానవుల హృదయమే పురాతన ఆలయంగా ఎప్పుడూ ఉంటుంది.

8. ప్రేమ లేని నిలయం ఏదీ సనాతన పురుషుని ఆలయంగా ఉండ నేరదు.


కొవ్వూరులో బాబా విగ్రహం ఆవిష్కరణ జరిగిన రోజున 'స్వార్థ రహితుల కోసమే దేవుడు' అని తంతి సందేశం పంపించారు.

## 8. బాబా ఉపదేశం (సెర్మన్)

(16.10.1950 – మహాబలేశ్వర్)

అవశ్యంగా మనమందరమూ ఒక్కటే. అందులకు విరుద్ధముగా నున్నామని అనుకొనడం అజ్ఞానం వల్లనే. జీవుడు తనను తాను తెలుసు కొనుటకు చైతన్యమును (తెలివిని) కోరతాడు. ఈ లక్ష్యమును సృష్టి మీద ఆధారపడకుండా స్వతంత్రంగా సాధించలేడు గనుక మానవుడు ప్రత్యగాత్మగా అనుభవములను పొందుట ద్వారా జ్ఞానమును సంపాదించవలెను. ఇదంతా ఊహాజనితమే కావున జీవాత్మకు ప్రధమంగా జ్ఞానమునకు బదులు అజ్ఞానము ఎదురగుచున్నది. ద్వైత రూపములు మాయా సృష్టిజాలమంతా అజ్ఞాన సంజనితమే, జననం, మరణం, సుఖము, దుఃఖము, పుణ్యము, పాపము, మంచి, చెడ్డ అన్నీ సమముగా ఈ అజ్ఞానము యొక్క ఆవిర్భావమే. నీవు ఎప్పుడూ పుట్టనూ లేదు – చావనూ లేదు; నీవు ఎప్పుడూ బాధ పడనూ లేదు – ఇక పడేదీ లేదు; నీవు ఎల్ల కాలముల యందు ఉంటివి, ఎల్లప్పుడూ ఉందువు, నీ ప్రత్యేక స్థితి ఊహా జనితము.

జీవాత్మ అనేక రూపములలో అనుభవమును సంపాదిస్తుంది – రాజూ, బిచ్చగాడు; ధనికుడు, పేదవాడు; పొడుగు, పొట్టి; బలవంతుడు, బలహీనుడు; రూపవంతుడు, కూరూపి; హంతకుడు, హతుడు. జీవాత్మ ఎంతకాలము నిజముగా ఒకటి అవిభాజ్యమైనా తాను వేరు అని భావిస్తూ ఉంటుందో ఈ అనుభవములను పొందుతూనే ఉండవలసి ఉన్నది. మాయా మయమైన ఈ అనుభవముల యొక్క సంస్కారములను జీవాత్మ ఎప్పుడైతే కడిగివేసుకుంటుందో దాని అసలు నగ్న స్వరూపమును పొంది ఏకము, అవిభాజ్యము, సత్యము, అనంతము అగు పరమాత్మతో తన ఏకీభావమును



పూర్తిగా గుర్తించును. ఈ సంస్కార బంధనముల నుండి జీవాత్మ అనేక మార్గముల వలన స్వేచ్ఛను పొందును. భగవత్సాక్షాత్కారము పొందుటకు ఈ మార్గములలో అతి ముఖ్యమైనది ప్రేమ. ఈ ప్రేమ ద్వారా జీవాత్మ భగవంతునిలో పూర్తిగా లీనమై పోతుంది, తుదకు తనను తాను పూర్తిగా విస్మరించును. ఆ సమయంలోనే పిడుగుపడి కృశించిన దానినల్లా భస్మీపటలం చేసినట్లు అకస్మాత్తుగా జ్ఞానోదయమై అజ్ఞానాన్ని పటాపంచలు గావిస్తుంది.

ఈ జ్ఞానము భ్రాంతులను, సంశయములను, చింతలను నిర్మూలిస్తుంది. సకలమైన బాధలు పోయి జీవిత పరమావధి అయిన శాశ్వత శాంతి నిత్యానందము కలుగుతుంది. జీవాత్మ ఇప్పుడు సమస్తమైన మాయల నుండి ముక్తి పొంది స్వస్వరూపమును తెలుసుకుంటుంది. ఈ జ్ఞానము ఆశలకు, కోరికలకు అతీతమైనది గావున మనము ఆశించవలదు. ఈ జ్ఞానము మనకు భావనాతీతమైనది. మనము అవగాహన చేసుకోలేనటు వంటిది; గావున మనము దానిని తర్కించవద్దు. ఈ జ్ఞానము నిశ్చయములలో కెల్ల నిశ్చయమైనది కావున మనము సంశయించ వద్దు.

కామయుతము, ఆశాసహితము, అసత్యము, అపవిత్రము అగు మనస్సు ఈ జ్ఞానమును అందుకోలేదు కావున మనము ఇంద్రియలోలత్వము గల జీవితమును గడుపవద్దు. మన ఆత్మలకు ఆత్మగా భగవంతుని మనము ప్రేమించుదము. ఈ ప్రేమ యొక్క పరాకాష్ఠ యందే ఈ జ్ఞానమున్నది. దైవత్వముతో సంపూర్ణులైన సత్పురుషులు వారిచ్ఛ వచ్చిన ఎవరికైనను ఎప్పుడైనను ఈ జ్ఞానమును ప్రసాదించ గలరు. మనమందరము అచిర కాలముననే ఈ జ్ఞానమును పొందెదము గాక.

## Existance is Substance and Life is Shadow - Summary

## పర్వర్దిగార్ ప్రార్థన

(13.09.1953 – డెహ్రాడూన్)

ఓ పర్వర్దిగార్ ! సర్వ పోషకా ! సర్వ రక్షకా !

నీవు ఆదియును అంతమును లేనివాడవు, అద్వయుడవు, నిరుప మానుడవు, నీ ప్రమాణ మెవ్వరును ఎరుంగ నేరరు;

నీవు వర్ణము, నామము, రూపము, గుణములు లేనివాడవు; నీవు అపరి మితుడవు, గంభీరుడవు, ఊహాతీతుడవు, భావనాతీతుడవు, శాశ్వతుడవు, నాశములేని వాడవు.

నీవు అవిభాజ్యుడవు, దివ్యచక్షువులతో గాని నిన్నెవరును చూడజాలరు; నీవు ఎల్లప్పుడు నుంటివి, ఎల్లప్పుడు నున్నావు; నీవు ఎల్లప్పుడూ నుందువు; నీవు అంతటను గలవు; నీవు అన్నింట నున్నావు; మరి నీవు అంతటికి, అన్నింటికి అవల నుందువు.

నీవు ఆకాశమున గలవు, పాతాళమున గలవు. నీవు వ్యక్తుడవు, అవ్యక్తుడవు; అన్ని భూమికలందున్నావు, అన్ని భూమికల కతీతుడవు. నీవు మూడు లోకాలలో నున్నావు. ముల్లోకాల కావల గూడ నున్నావు.

నీవు అగోచరుడవు, స్వతంత్రుడవు; నీవు సృష్టికర్తవు, ప్రభులకు ప్రభుడవు, అందరి మనస్సులను హృదయాలను ఎరిగిన వాడవు,

నీవు సర్వశక్తిమంతుడవు, సర్వవ్యాపివి, నీవే అనంత జ్ఞానము, అనంత శక్తియు, అనంత ఆనందమును; నీవు జ్ఞానసాగరుడవు, సర్వజ్ఞుడవు, అనంత జ్ఞానివి; నీవు భూత భవిష్య ద్వర్తమానముల నెఱింగిన వాడవు; జ్ఞానమే నీవు.

నీవు సర్వదయాళుడవు, నిత్య శుభంకరుడవు. నీవు ఆత్మల కెల్ల నాత్మవు, అనంత గుణ విశిష్టుడవు; నీవు సత్య, జ్ఞాన, ఆనందముల త్రిమూర్తివి; నీవే సత్యమునకు మూలము, ప్రేమ మహాసాగరుడవు.

నీవు పురాణ పురుషుడవు, సర్వోత్తముడవు; నీవు ప్రభుడవు, పరమేశ్వరుడవు; నీవు పరుడవు, పరాత్పరుడవు; నీవు పరబ్రహ్మవు, అల్లాహ్, ఇలాహీ, యజ్దాన్, అహూర్మజ్దా, ప్రియతముడైన భగవంతుడవు.

నీవు 'ఈజద్' అనబడు యేకైక పూజ్యుడవు.

## పశ్చాత్తాప ప్రార్థన

(08.11.1952 – మెహెరాబాద్)

ఓం పరబ్రహ్మ పరమాత్మ ! యా యజ్దాన్ ! లా ఇలాహ్ ఇల్లిల్లాహ్ ! ఓ గాడ్ ! ఫాదర్ ఇన్ హెవెన్ !

పరమ దయానిధివగు ఓ ఈశ్వరా ! మా పాపములన్నిటికిని మేము పశ్చాత్తాప పడుచున్నాము.

అసత్యము, అధర్మము, అపవిత్రమును అగు మా ప్రతి తలంపునకు పశ్చాత్తాప పడుచున్నాము.

పలికియుండరాని పలికిన ప్రతి మాటకును, చేసియుండరాని చేసిన ప్రతి చేతకును మేము పశ్చాత్తాప పడుచున్నాము.

స్వార్థముచే ప్రేరేపింపబడిన ప్రతి పనికిని, ప్రతి మాటకును, ప్రతి తలంపునకును ; ద్వేషముచే ప్రేరేపింపబడిన ప్రతి పనికిని, ప్రతి మాటకును, ప్రతి తలంపునకును మేము పశ్చాత్తాప పడుచున్నాము.

ముఖ్యముగా కామముతో గూడిన మా ప్రతి తలంపునకు, కామ ప్రేరితమగు మా ప్రతి చేతకును, పలికిన ప్రతి అనృతమునకు, సమస్త కపట వర్తనమునకు, ఆడి తప్పిన ప్రతి వాగ్దానమునకు, సమస్త పర నిందలకు, పరోక్ష నిందలకు మేము పశ్చాత్తాప పడుచున్నాము.

ఇంకనూ ముఖ్యముగా కూడ, పరులకు నాశన మొనగూర్చిన మేము చేసిన ప్రతి పనికిని, ఇతరులకు బాధ కలుగజేసిన మేమాడిన ప్రతి మాటకును, చేసిన ప్రతి చేతకును, ఇతరులకు బాధ కలుగవలెనని మేము కోరిన ప్రతి కోర్కెకును, మిక్కిలి పశ్చాత్తాప పడుచున్నాము.

నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా ! మేము చేసిన ఈ పాపములన్నిటిని క్షమింప వేడుచున్నాము. తలపులలో కాని, మాటలలో కాని చేతలలో కాని నీ ఇచ్ఛానుసారము నడచుకొన జాలక నిరంతరము విఫలుల మగుచున్న మమ్ములను క్షమింప వేడుచున్నాము.

## బాబా ప్రేమికులకు, మండలి సభ్యులకు ప్రసాదించిన ప్రార్థన

ప్రియతమ దైవమా ! నిన్ను అధికముగా ప్రేమించుటకును, ఎంతో అధికముగ, ఇంకను అధికముగ నీతో ఐక్యము పొందగల అర్హత సంపాదించునంత వరకును మా అందరికి తోడ్పడుము. ఇంకను, బాబా 'కొంగు' ను చిట్టచివరి వరకూ వీడకుండని విధముగా మాకందరికి సహాయభూతుడవు కమ్ము.

### హారతి

దేవాదిదేవా ! ప్రేమ స్వభావా ! ప్రభో మెహెరు బాబా !
ప్రియతమా ! మనసు హారతిదే ! ప్రియతమా ! మనసు హారతిదే !

ప్రేమ జ్యోతి మా హృది వెలగించు – కామ క్రోధముల మది తొలగించు
దామను వీడక నిను ప్రేమించు – మము కరుణించవయా !
ప్రియతమా ! మనసు హారతిదే ! ప్రియతమా ! మనసు హారతిదే !

నీ దివ్య నామమె మదిని స్మరించు – నీ దివ్య రూపమె హృది తిలకించు
నీ దివ్య పదములె ఆరాధించు – మము కరుణించవయా !
ప్రియతమా ! మనసు హారతిదే ! ప్రియతమా ! మనసు హారతిదే !

అహంకారము హారతి కాగా – ఇహమే పరమై ప్రకాశించగా
పాహి ! శరణు ! సాయుజ్యము పొందగా – మము కరుణించవయా !
ప్రియతమా ! మనసు హారతిదే ! ప్రియతమా ! మనసు హారతిదే !

దేవాదిదేవా ! ప్రేమ స్వభావా ! ప్రభో మెహెరు బాబా !
ప్రియతమా ! మనసు హారతిదే ! ప్రియతమా ! మనసు హారతిదే !

రచన : శ్రీ బాలగోపాల భాస్కరరాజు

పేజీ సంఖ్య ఫోటో వివరము


3 – ఎడమ నుండి కుడికి – నిలబడిన వారు బెహ్రాం, జాల్, కూర్చొన్నవారు మేర్వాన్, షిరియార్, తమ్ముడు ఆది, షిరీన్ బాను–పూనా 1912–14
7 – సెయింట్ విన్సెంట్ స్కూల్‌లో క్రికెట్ టీమ్ ఫోటో – 1910.
12– సద్గురు హజరత్ బాబాజాన్.
13– మేర్వాన్ నుదుటి గాయాన్ని కప్పుకోవడానికై తలపాగాను ధరించి, పూనా – 1918
14 – సద్గురు నారాయణ మహారాజ్
16 – సద్గురు తాజుద్దీన్ బాబా
17 – సద్గురు షిరిడీ సాయిబాబా
18 – సద్గురు ఉపాసనీ మహారాజ్
30 – తొలినాటి శిష్యులతో – క్వెట్టా వెళ్ళే గ్రూపు, 1923
30 – సేవలో పరిపూర్ణత చిహ్నం.
32 – మెహెర్‌బాబా సమాధి, మెహెరాబాద్.
36 – బీదల, వ్యాధిగ్రస్తుల పాదాలు కడుగుతూ మ్రొక్కుతున్న దృశ్యం – అహ్మద్‌నగర్, వాడియాపార్కు–1954.
37 – మెహెరాబాద్‌లో బాబా – 1927.
39 – ప్రేమాశ్రమ బాలురతో, 1927.
41 – మెహెరాబాద్‌లో తొలినాటి రోజులలో.
43 – అక్షరపలకతో బాబా, మెహెరాబాద్ 1935.
45 – కమ్లి కోటు ఫోటోగ్రాఫ్
46 – మెహెరాబాద్‌లో
56 – బాబా సమాధి తొలిరోజులలో
57 – బాబా సమాధి లోపలి భాగం
58 – పర్యటనలలో తీసిన ఫోటో.
61– ఇటలిలో 1932.
67 – మెహెరాబాబాతో నటీమణి తల్లూలా బాంక్‌హెడ్ – హాలీవుడ్‌లో 1932
67 – పాశ్చాత్య ప్రేమికులతో బాబా, డావెన్ షేర్ – 1932.
73 – మస్తు షెరియత్ ఖాన్‌తో, బెంగళూర్ – 1939.
74 – ఒక మస్తుకు స్నానం చేయిస్తూ బాబా – 1940 బెంగళూర్‌లో.
79 – మస్తులతో బాబా 1940 బెంగళూర్ ఆశ్రమంలో.
80 – విశ్వ ఆధ్యాత్మిక కేంద్రం, బైరమంగళ (బెంగళూర్)
82 – (ఎడమ) మెహెరాజాద్ వరండా
84 – బాబా, ఆదీ కె ఇరానీ, గుస్తాద్‌జీ (వెనుక) నవజీవనంలో బిక్షకై, కాశీ – 1950
90 – నవజీవనం, డెహ్రాడూన్ మార్చి – 1950 కేకీ నలావాలా బాబాకు బిక్షనొసగుతూ.
100 – వివిధ భావాలను – సందేశాలను సంజ్ఞలతో.
108– మెహెరాజాద్ కొండపై 1947లో
118– అహ్మద్‌నగర్–1954
119– ఒక ప్రదర్శన ప్రోగ్రాంలో
125– ఢిల్లీలో
132– ధు ఆన్‌ధా జలపాతం వద్ద
136 – నర్మదానదిలో

146 – పూనా బింద్రా ఇంటిలో ఒక జోక్‌కు నవ్వుతూ, 1954.
160 – సాకోరీ ఉపాసనీ మహారాజ్ ఆశ్రమంలో, 1954.
161 – ఒక సహవాస–దర్శన కార్యక్రమం
162 – ఎడమ నుండి గుల్మాయి, బాబా, మెహెరా పర్యటనలలో
168 – అహ్మద్‌నగర్, 1952.
174 – న్యూయార్క్, జూలై – 1956.
175 – అవతార్స్ ఎబోడ్
177 – ఒక సహవాస–దర్శన కార్యక్రమానంతరం (ఎడమ నుండి) ఆదీ కె ఇరానీ, బాబా, ఈరచ్ జెస్సావాలా.
181 – విదేశీపర్యటనలలో
190 – ప్రాక్ – పశ్చిమ సమావేశం – పూనా, 1962.
191 – ఒక దర్శన కార్యక్రమం
193 – మెహరాజాద్, మండలిహాలులో
194 – ఒక దర్శన కార్యక్రమంలో
196 – భౌతిక దేహాన్ని త్యజించిన అవతారుడు సమాధిలో, మెహెరాబాద్.
203 – మెహెర్‌బాబా, 1940 లలో
219 – వాషింగ్‌టన్–అమెరికా, 1956
222 – ఒక వివరణ ఇస్తూ

అవతార్ మెహెర్‌బాబాను గురించిన మరింత సమాచారానికై –

1. అవతార్ మెహెర్‌బాబా పెరపెట్యువల్ చారిటబుల్ ట్రస్ట్,
   పోష్టు బాక్సు నెంబరు – 31, కింగ్స్ రోడ్డు, అహ్మద్‌నగర్, మహారాష్ట్ర, పిన్ – 414001.
2. అవతార్ మెహెర్‌బాబా పూనా సెంటర్,
   441/1, సోమవార్ పేట్, పూనా–411 011. మహారాష్ట్ర
3. అవతార్ మెహెర్‌బాబా విశ్వ ఆధ్యాత్మిక కేంద్రం,
   బైరమంగళ, పోష్టు – ఇట్టమాడు, బెంగళూర్ జిల్లా, కర్ణాటక, పిన్ – 562 109.
4. అవతార్ మెహెర్ బాబా ఢిల్లీ సెంటర్,
   50– ఇనిస్ట్యూషనల్ ఏరియా, తుగ్లకాబాద్, న్యూఢిల్లీ – 110 062.
5. అవతార్ మెహెర్ బాబా హైదరాబాద్ సెంటర్ (జూబ్లిహిల్స్)
   రోడ్ నెంబర్ – 36 చివర, మాదాపూర్ రోడ్, జూబ్లిహిల్స్, హైదరాబాద్.
6. అవతార్ మెహెర్‌బాబా హైదరాబాద్ (కోఠీ) సెంటర్,
   ఇస్సామియా బజార్, కోఠీ, హైదరాబాద్ – 500 027.
7. మెహెర్ స్పిరిట్యువల్ సెంటర్,
   10200 హైవే 17 నార్త్, మిర్టెల్ బీచ్, సౌత్ కారోలీనా 29572, యు ఎస్ ఎ.
8. మెహెర్ బాబా అసోషియేషన్,
   1 228 హేమెర్ స్మిత్ గ్రూవ్, లండన్ డబ్లూ – 67, హెచ్. జి., ఇంగ్లాండ్.
9. మెహెర్ బాబా ఫౌండేషన్ ఆస్ట్రేలియా,
   అవతార్స్ ఎబోడ్, మెహెర్ రోడ్డ్, పోష్టుబాక్సు–22, వూమ్‌బే, క్వీన్స్‌లాండ్ 4559, ఆస్ట్రేలియా.